# ఈనాడు శ్రీకాకుళం

శుక్రవారం 5 జనవరి 2018 | 16 పేజీలు




## అయ్యో! ఎంత పనయింది!

● రేషన్ కార్డులు కొందరికే ● 'పల్స్ సర్వే' ఆధారంగా దరఖాస్తుల్లో కోత

న్యూస్‌టుడే-కలెక్టరేట్(శ్రీకాకుళం)

**జిల్లాలో పరిస్థితి ఇది**

| | | |
|---|---|---|
| ◆ రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు | : | 25,833 |
| ◆ ఈ జన్మభూమిలో తొలివిడత మంజూరైన కార్డులు | : | 5,314 |
| ◆ రెండో విడతలో మంజూరు చేసినవి (గురువారం) | : | 2,961. |
| ◆ దరఖాస్తుల్లో అనర్హమైనవి | : | 651 |
| ◆ ప్రజాసాధికార సర్వే ఆధారంగా తిరస్కరించినవి | : | 16,907 |

నిరుపేదలకు రాయితీపై సరకులు ఇచ్చేందుకు ప్రభుత్వం తెలుపు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తోంది. వీటికి దరఖాస్తు చేసుకునేవారికి ఏటా జన్మభూమి కార్యక్రమంలో కార్డులు అందిస్తోంది. గడిచిన నాలుగు విడతల్లో కూడా ఇదే మాదిరిగా చేశారు. ప్రస్తుత 5వ విడతలో మిగిలిన వారికి కార్డులు ఇస్తారని ఆశించి దరఖాస్తులు చేయగా...అవి పూర్తి స్థాయిలో మంజూరుకాలేదు. దరఖాస్తుదారులు మాత్రం కార్డుల కోసం ఎదురుచూస్తున్నా ప్రయోజనంలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం (మిగతా 15వ పేజీలో)

## అభయమిస్తూ... ఆదేశిస్తూ!

● అంతా తానై.. సభను నడిపించిన ముఖ్యమంత్రి
● ఏకధాటిగా మూడు గంటలపాటు నిర్వహణ
● ఆలోచన రేకెత్తించేలా 'జన్మభూమి- మాఊరు' ప్రసంగం



సభకు హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**జిల్లా అభివృద్ధికి అభయమిచ్చారు**
**వంశధార విషయంపై స్పష్టతిచ్చారు**
**కిడ్నీ బాధితులకు ఊరట కలిగేలా నిధులిస్తామన్నారు**
**జిల్లాకు భావనపాడు ఎంత అవసరమో వివరించారు**
**కొబ్బరి రైతులకు...మత్స్యకారులకు మేలు కలిగేలా ముందుకు సాగుతానని భరోసా కల్పించారు...**
*అదే క్రమంలో...*
**జిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణంలో ఏమాత్రం నిర్లక్ష్యం వద్దని ఆదేశించారు**
**స్ఫూర్తిదాయక ఉదాహరణలు వివరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్ఛాపురంలో గురువారం నిర్వహించిన 'జన్మభూమి-మాఊరు' సభలో చైతన్యం కలిగించారు.**

ఇచ్ఛాపురం - న్యూస్‌టుడే

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఇచ్ఛాపురం పర్యటన ఆద్యంతం ఉత్సాహ భరితంగా సాగింది. అంతా తానై మూడు గంటలపాటు ఏకధాటిగా సభను నిర్వహించారు. పలు పర్యాయాలు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి చప్పట్లు కొట్టించారు. వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారిని వేదికపైకి పిలుపించుకుని మాట్లాడారు. శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ముందే ముఖ్యమంత్రి ఇచ్ఛాపురం చేరుకున్నారు. మంత్రులకు కూడా మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. శాసనసభ్యులు బెందాళం అశోక్, కలెక్టర్ ధనంజయరెడ్డిలకు మాత్రమే కొద్ది సేపు అవకాశం కల్పించారు. గతంలో కంటే భిన్నంగా సరదాగా వ్యాఖ్యలు చేస్తూ, సభికులను భాగస్వామ్యం చేస్తూ.. మధ్యమధ్యలో వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ 'జన్మభూమి- మా ఊరు' సభను చంద్రబాబు నడిపించారు.



చంద్రన్న బీమా పత్రాలు అందిస్తున్న ముఖ్యమంత్రి

### ఇది భావ్యమా అంటూ...

మధ్యాహ్నం రెండు గంటలకే వేదిక మీదికి చేరుకున్న చంద్రబాబు... ముందుగా జ్యోతి వెలిగించి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం వందేమాతరం ఆలపించిన వారిని అభినందిస్తూ... పిలిచి మరీ ఫొటోలు దిగారు. మరుగుదొడ్ల నిర్మాణంలో జిల్లా వెనకబాటును దృష్టిలో ఉంచుకుని మూడో రోజు ప్రాధాన్య అంశమైన స్వచ్ఛఆంధ్రప్రదేశ్‌కు సభను పరిమితం చేశారు. సెల్‌ఫోన్లు ఎంత మందికి ఉన్నాయో చేతులెత్తమన్నారు. సభికుల్లో చాలా మంది చేతులెత్తడంతో.. మరి మరుగుదొడ్లు నిర్మించుకోకపోవడం భావ్యమా.. అంటూ ఆలోచనలు రేకెత్తించారు. విద్యార్థినులతో మాట్లాడించారు. మూడో తరగతి చదువుతున్న రిషిత, (మిగతా 15వ పేజీలో)



తన పాలనపై అనర్గళంగా ప్రసంగించిన రిషితను అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో కలెక్టర్ ధనంజయరెడ్డి, తదితరులు

## ధనంజయ్ బాగా చేశావ్...

■ కలెక్టర్‌కు ముఖ్యమంత్రి అభినందనలు
■ నిర్వాసితులు పెద్ద మనసుతో సహకరించారని కృతజ్ఞతలు

ఈనాడు - శ్రీకాకుళం

'ధనంజయరెడ్డీ.. బాగా చేశావ్. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాసిత గ్రామాలను ఖాళీ చేయించగలిగారు' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్‌ను ప్రశంసించారు. హెలీప్యాడ్ నుంచి ...కలెక్టర్, ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎంపీ రామ్మోహన్ నాయుడులను తన పక్కన కూర్చోపెట్టుకొని వారితో మాట్లాడుతూ ప్రత్యేక బస్సులో సభా స్థలికి సీఎం చేరుకున్నారు. తిరిగి వెళ్లేటపుడు మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కిమిడి కళా వెంకటరావుతో కలిసి కలెక్టర్ ధనంజయరెడ్డిని వెంటబెట్టుకుని కారులో హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. ఈ రెండు సందర్భాల్లోనూ వంశధార అంశాన్ని ప్రస్తావించారు. చాలా బాగా వ్యవహరించారని అభినందించారు. ' వంశధార పనులపై ఇక వెంటపడాల్సిందే. ఏ పరిస్థితుల్లోనూ వేగం తగ్గించకూడదు. వంశధారను వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి చేసి.. జలాశయాన్ని నింపాలి. ఏమాత్రం అలక్ష్యం చేయవద్దు' అని మంత్రులు, (మిగతా 15వ పేజీలో)

## అడిగినా... తిరిగినా లేనేలేవ్



శ్రీకాకుళం, ఆమదాలవలసలో మూతపడిన ఏటీఎంలు

● జిల్లాలో మళ్లీ నగదు కొరత
● రెండు రోజులుగా మూతపడిన అత్యధిక ఏటీఎంలు
● బ్యాంకుల్లో రూ.20, రూ.10 నోట్లే గతి
● ఖాతాల్లో నగదు ఉన్నా ప్రజలకు తప్పని ఇబ్బందులు

● శ్రీకాకుళం బ్యాంకర్స్ కాలనీకి చెందిన బి.శ్రీనివాసరావు అనే ఉపాధ్యాయుడు తన ఖాతాలోని నగదు తీసుకునేందుకు గురువారం మధ్యాహ్నం నగరంలోని జీటీ రోడ్డులో అన్ని బ్యాంకుల ఏటీఎంలకు వెళ్లారు. చాలావరకు మూతపడి ఉన్నాయి. తెరిచిన వాటిలో 'నగదు లేదు' అనే సూచికలే దర్శనమిచ్చాయి. అటు నుంచి మహిళా కళాశాల రోడ్డు, కళింగరోడ్డు, పాలకొండరోడ్‌లో కూడా తిరిగారు. అన్నిచోట్లా అదే చిత్రం. తప్పనిసరి పరిస్థితుల్లో జీటీరోడ్డులోని ఓ బ్యాంకు ప్రధాన శాఖకు వెళ్లి కొంతసేపు కౌంటర్‌లో నిలుచుని రూ.40 వేల కోసం ఏటీఎం కార్డుతో స్వైప్ చేశారు. అందుకు బ్యాంకు సిబ్బంది కేవలం రూ.20 నోట్లు, రూ.10 నోట్లనే కట్టలుగా ఇచ్చారు. దీంతో కంగుతిని ఈ నోట్లెలా... పెద్దనోట్లు ఇమ్మని కోరారు. సిబ్బంది నుంచి.. అస్సలు లేనేలేవు అనే సమాధానం వచ్చింది. చివరికి నగదును వెనక్కి ఇచ్చేసి రెండో పూట వస్తాను... పెద్దనోట్లు వస్తే ఉంచండని చెప్పి వెళ్లిపోయారు

న్యూస్‌టుడే - పాతశ్రీకాకుళం

జిల్లాలో నగదు కొరత ఎంత తీవ్రంగా ఉందో ఇక్కడి ఉదాహరణ చదివితే అర్థమవుతుంది. జిల్లా కేంద్రంలోనే ఇలాంటి దుస్థితి కొనసాగుతుంటే... గ్రామీణ ప్రాంతాలు..మండల కేంద్రాల్లో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అసలే నెల ప్రారంభ వారం..ఆ పైన సంక్రాంతి ఖర్చులు వెంటాడుతుండగా బ్యాంకులు మాత్రం డబ్బుల్లేవు (మిగతా 15వ పేజీలో)

న్యూస్‌టుడే పరిశీలన

# 'జన్మ' ధన్యమయ్యేనా!

సంతకవిటి, వంగర, జి.సిగడాం, ఎల్.ఎన్.పేట, న్యూస్‌టుడే

**గ్రామస్థాయికి నేరుగా అధికారులు వెళ్లి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ఒక వేదిక ఉండాలని ప్రభుత్వం జన్మభూమి మాఊరును ప్రవేశపెట్టింది. గత జన్మభూమికి భిన్నంగా ఈసారి సభలో ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా ఉండాలని ప్రభుత్వ చెబితే క్షేత్రస్థాయి పరిస్థితి విరుద్ధంగా ఉంది.**

జన్మభూమిలో ఫిర్యాదు చేసిన వాటిని గడువులోగా పరిష్కరించాల్సి ఉన్నా మూడేళ్లు కావస్తున్నా నేటికీ పరిష్కారం కాలేదు. గత మూడేళ్లుగా సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీమళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారే తప్ప సంక్షేమ ఫలాలు అందడం లేదు. ఇటువంటి వారు గ్రామాల్లో వందల మంది ఉన్నారు. పింఛన్లు, ఇళ్లు , రేషన్‌కార్డులు, బ్యాంకుల రుణాలు, విద్యుత్తు , తాగు , సాగు నీరు , రహదారుల అభివృద్ధి వంటి వాటిపై ఒకటికి పదిసార్లు దరఖాస్తు చేసుకుంటున్నా ఫలితం ఉండడం లేదు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నాలుగు జన్మభూములు పూర్తికాగా ప్రస్తుతం జరుగుతోంది అయిదో విడత జన్మభూమి. గతంలో దరఖాస్తు చేసుకున్నవారే మళ్లీ ఇప్పుడూ అవే సమస్యలపై దరఖాస్తులు చేస్తున్నవారే ఎక్కువ. ఇప్పటికైనా మార్పు వస్తుందో లేదో చూడాలి.

## మంజూరుకన్నా దరఖాస్తులే ఎక్కువ


అయిదో విడత జన్మభూమిలో ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలు కన్నా, గ్రామ సభల్లో వస్తున్న దరఖాస్తులే ఎక్కువగా వస్తున్నాయి. నాలుగో విడత జన్మభూమిలో దరఖాస్తు చేసుకున్నవారి సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం అయిదో విడతలో రేషన్‌కార్డులు, పింఛన్లు, ఉపకారవేతనాలు మంజూరు చేసింది. మంజూరైన వాటికన్నా ప్రస్తుతం దరఖాస్తులు అధిక సంఖ్యలో వస్తున్నాయి.

- అయిదో విడత జన్మభూమిలో 20 వేల మందికి వృద్ధాప్య, వింతంతు, వికలాంగ, చేనేత, గీత కార్మికులకు పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం ముందుకువచ్చింది. పింఛన్లుకు దరఖాస్తులు 30 వేలకుపైగా రావచ్చని అధికారుల అంచనా.
- జిల్లాలో చంద్రన్న బీమాలో నమోదైన డ్వాక్రా మహిళల పిల్లలకు ఏటా అందిస్తున్న ఉపకారవేతనాలు 1,03,666 మందికి అందించేందుకు రూ.12.43 కోట్ల మేర నిధులు విడుదల చేసింది. జిల్లా అంతటా సగం మంది విద్యార్థులకు మాత్రమే ఉపకారవేతనాలు వస్తుండగా, సగం మంది విద్యార్థులకు మూడేళ్ల నుంచి ఉపకారవేతనాలు అందడం లేదు.
- ప్రభుత్వం అరకొరగా ఇళ్లు మంజూరు చేయడంతో గ్రామాల్లో నిర్మాణాలకు ముందుకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. జన్మభూమి మాఊరు గ్రామసభల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి.
- జిల్లాలో ఏడాదిగా అంతర్జాలంలో, తహశీల్దార్ కార్యాలయాలకు తెలుపు రేషన్ కార్డుల కోసం 5,314 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ తెలుపురేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రెవెన్యూ అధికారులు జన్మభూమి ప్రారంభమై నాలుగు రోజులు అయినా నేటికీ కార్డులు ముద్రించి లబ్ధిదారులకు అందించడంలో విఫలమయ్యారు. 2017 డిసెంబరు 28వ తేదీ నాటికి రేషన్‌కార్డుల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వచ్చిన వాటిని విచారించి 2018 జనవరి రెండో తేదీ నాటికి ముద్రించి సంబంధిత తహశీల్దార్ కార్యాలయాలకు అందించాల్సి ఉంది. ఆ ప్రక్రియ నేటికీ సాగడం లేదు. దీంతో దరఖాస్తు చేసుకున్నవారు ఈ జన్మభూమిలో కార్డులు అందిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు. అంతర్జాలంలో దరఖాస్తు చేసుకున్నవారే కాకుండా, ప్రస్తుతం జన్మభూమి గ్రామ సభల్లో కుప్పలుతెప్పలుగా రేషన్‌కార్డులు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు.

## కలెక్టరుకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు

నాకు సెంటు భూమి లేదు. గతంలో నాకు వృద్ధాప్య పింఛను వచ్చేది. దాన్ని తొలగించారు. మళ్లీ మంజూరు చేయాలని కలెక్టరుకు, జన్మభూమి గ్రామసభల్లో దరఖాస్తు చేసుకున్నా. జన్మభూమి కమిటీ నాకు పింఛను రాకుండా అడ్డుకుంటుంది. దరఖాస్తు చేసుకోవడమే తప్ప ఫలితం ఉండటం లేదు.

– ఎన్.అప్పయ్య, వాసుదేవపట్నం



## మూడుసార్లు దరఖాస్తు చేశా



నా వయసు 67 ఏళ్లు. నా భర్త అయిదేళ్ల కిందట చనిపోయాడు. నాకు నా అన్నవారు ఎవరూ లేరు. నాకు వితంతు, వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని ఇప్పటికి పలుసార్లు దరఖాస్తు చేసుకున్నా. నేటికీ మంజూరు కాలేదు.

- ఎం.చిట్టెమ్మ, ఎంఆర్అగ్రహారం

## నాలుగు సార్లు ఫిర్యాదు చేసినా



నేను ఇప్పటి వరకు నాలుగు సార్లు వృద్ధాప్య పింఛను కోసం దరఖాస్తు చేశా. ఇంతవరకు పింఛను రాలేదు. అర్హతుండి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

– వరహాలు, ఆనందపురం, జి.సిగడాం

## అడుగడుగునా నిలదీత

జిల్లాలో నిర్వహిస్తున్న జన్మభూమి మాఊరు సభల్లో చాలాచోట్ల వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సమస్యలు పరిష్కరించనప్పుడు మళ్లీ ఎందుకు సభలంటూ ప్రశ్నిస్తున్నారు. చాలా గ్రామాల్లో తెదేపా వర్గీయులే సభలను బహిష్కరిస్తున్నారు. అర్హులకు పింఛన్లు, ఇళ్ల పట్టాలు, రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడంపై గ్రామసభలకు ఎందుకురావాలని నిలదీస్తున్నారు.



**జన్మభూమి గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న లబ్ధిదారులు**

## పాపం.. పాపమ్మ

ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలిపేరు గండు పాపమ్మ. ఈమెకు గతంలో అత్యోదయ కార్డు ఉండేది. గత నాలుగు సంవత్సరాలుగా ఆమెకు సరకులు రావటంలేదు. ఆమెకు ముందు వెనుక ఎవ్వరూ లేరు. ప్రతి జన్మభూమి, ఇతర సమావేశాల్లో అధికారులకు వినతి ఇచ్చినా స్పందనలేదు. గురువారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఆమె తహశీల్దార్ బి.వెంకటరావును రేషన్ అందించాలని మళ్లీ కోరారు.



- ❖ పరిష్కారానికి నోచుకోని సమస్యలే ఎక్కువ
- ❖ దరఖాస్తులకు రెండేళ్లుగా దక్కని మోక్షం
- ❖ జన్మభూమి- మా ఊరి సభలపై ప్రజల్లో వ్యతిరేకత
- ❖ ఆందోళన వ్యక్తం చేస్తున్న అర్హులు
- ❖ ఈ సభపై ఆశలు పెట్టుకున్న లబ్ధిదారులు

**జన్మభూమి సభల్లో వచ్చిన వినతులన్నీ ఈ జన్మభూమి ముగిసేనాటికి పరిష్కరించాలని గురువారం రాత్రి నిర్వహించిన టెలీ సమావేశంలో ముఖ్యమంత్రి స్పష్టం చేయడం గమనార్హం.**



## వితంతువులకు అందని పింఛను



సంతకవిటి మండలం ఎంఆర్అగ్రహారం గ్రామానికి చెందిన తోలాపు దాలమ్మ, కారు అప్పలరాము, తాలాడ లక్ష్మిలు వీరు. వీరి భర్తలు అయిదేళ్ల కిందట మృతిచెందారు. వీరు ఇప్పటి వరకూ నిర్వహించిన నాలుగు జన్మభూమి మాఊరు గ్రామసభల్లో పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాళ్లు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగారు. శుక్రవారం గోళ్లవసల పంచాయతీలో నిర్వహించనున్న జన్మభూమిలో మళ్లీ పింఛన్లు కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఒక్క ఈ గ్రామంలోనే కాదు అన్ని పంచాయతీల్లో వందల మంది అర్హులు ఉన్నా అందడం లేదు.

## 70 ఏళ్లు అయినా పింఛను లేదు



నా వయసు 70 ఏళ్లు. అయినా నాకు పింఛను అందడం లేదు. కనీసం ఈ జన్మభూమిలోనైనా అందుతుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్నా. అధికారులను పింఛను ఇవ్వాలని కోరుతుంటే అదిగో ఇదిగో అంటున్నారు.

– రామయ్య, వృద్ధుడు, కొప్పరవలస, వంగర

## కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు

నా వయస్సు 78 ఏళ్లు. ఇప్పటి వరకు నేను పింఛను తీసుకోలేదు. కక్షపూరితంగా ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు విచక్షణంగా ఆలోచించాలి. ఈ కమిటీలు ఏర్పడ్డాక వారికి ఇష్టం ఉన్న వారికే ఇస్తున్నారు.

- ఎస్.పారినాయుడు, తలగాం, వంగర



## ఏడాదిగా నిత్యావసరాలు అందడం లేదు

నాకు ప్రభుత్వం అంత్యోదయ మంజూరు చేసింది. ఒక నెల మాత్రమే ఆ కార్డుపై 35 కి.లోల బియ్యం అందించారు. తరువాత ఆ కార్డును ప్రభుత్వం రద్దు చేసింది. రేషన్ కార్డును పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని పలుసార్లు అధికారులను కోరా. అయినా పరిష్కారం కాలేదు. కుష్ఠి వ్యాధితో బాధపడుతున్న నా పరిస్థితిని చూసైనా ఎవరూ దయచూపడం లేదు. **– అప్పారావు, సంతకవిటి**

## అంతర్జాలంలో నమోదు చేయాలి

జన్మభూమి మాఊరు గ్రామసభల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును స్వీకరించి సంబంధిత శాఖకు పంపించడంతో పాటు, ఏ రోజుకు ఆ రోజే అంతర్జాలంలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించాం. కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లి అర్హులందరికీ పింఛన్లు, రేషన్‌కార్డులు, ఉపకారవేతనాలు, ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోనున్నాం. **– ఆర్.గున్నయ్య, ఆర్డీవో**



## రైతులందరికీ పంటల బీమా పరిహారం

నర్సిపురం (నందిగాం), న్యూస్‌టుడే: 2015-16 సంవత్సరానికి సంబంధించిన పంటల బీమా పరిహారం త్వరలోనే అందరికీ అందుతుందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రూ.45 లక్షలతో నిర్మించే దిమిలాడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం కార్యాలయ భవన నిర్మాణ పనులకు గురువారం ఆయన భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం మంత్రి రైతులతో మాట్లాడారు. పెద్దతామరాపల్లి, పూండి గ్రామీణ వికాస్ బ్యాంకుతోపాటు పలు బ్యాంకుల ద్వారా పంటల బీమా పరిహారం అందనివారికి త్వరలో బీమా పరిహారం అందుతుందని, ఇటీవల బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు డోల జగన్, తెదేపా మండల అధ్యక్షుడు పినకాన అజయకుమార్, వంశధార ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మళ్ల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



**సహకార సంఘ కార్యాలయ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, డీసీసీబీ అధ్యక్షుడు డోల జగన్**



| జిల్లాలో వాహనాలు | |
|---|---|
| ద్విచక్ర వాహనాలు: | 2.35 లక్షలు |
| త్రిచక్ర వాహనాలు: | 16,661 |
| నాలుగు చక్రాల వాహనాలు: | 11,524 |

**ఇదీ పరిస్థితి**

| సంవత్సరం | ప్రమాదాలు | క్షతగాత్రులు | మృతులు |
|---|---|---|---|
| 2015 | 1118 | 1,587 | 301 |
| 2016 | 1040 | 1,592 | 303 |
| 2017 | 873 | 1,256 | 323 |

**వేగం పెరిగేకొద్దీ ప్రాణాపాయం**

| గంటకు వాహన వేగం | ప్రాణాపాయం శాతాల్లో |
|---|---|
| 55 కి.మీ. | దెబ్బతగిలినా ప్రాణాలతో బయటపడొచ్చు |
| 56 కి.మీ. | 2 |
| 57 కి.మీ. | 4 |
| 58 కి.మీ. | 6 |
| 60 కి.మీ. | 10 |
| 70 కి.మీ. | 30 |
| 80 కి.మీ. | 50 |
| 90 కి.మీ. | 70 |
| 100 కి.మీ. | 90 |

- అతి వేగం... తీస్తుంది ప్రాణం!
- ప్రమాదాల నివారణకు పలు చర్యలు
- ఆధునిక సాంకేతికత అందుబాటులోకి
- రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా..

# ఉత్సాహ వీచిక... కానీయకు విషాద గీతిక




**వాహనం నడపడం కొందరికి సరదా.. మరికొందరికి అవసరం.. ఇంకొందరికి జీవనోపాధి! కారణాలేమైనా వాహన చోదకులు అవగాహనతో ట్రాఫిక్ నిబంధనలకు లోబడి వాహనం నడపకపోతే చివరికి మిగిలేది విషాదమే! నిండు ప్రాణాలు గాలిలో కలిసి పోవడం కలచి వేస్తోంది. గతం కంటే ప్రమాదాల సంఖ్య తగ్గినా మరణాల రేటు ఇంకా తగ్గాల్సిన అవసరం ఉంది. తనిఖీలు ముమ్మరం చేయడం, శిక్షలు, జరిమానాలు కఠినంగా ఉండటం, నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుండటం ఫలితం ఇస్తోంది. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా జిల్లాలో పరిస్థితి, తీసుకుంటున్న చర్యలపై 'న్యూస్‌టుడే' కథనం.**

**- న్యూస్‌టుడే, రాజాం**

జిల్లాలో 194 కిలోమీటర్ల జాతీయ రహదారి ఉంది. ఆరు పట్టణాలు, 1100 పంచాయతీల్లో వేల పల్లెలున్నాయి. గతంతో పోలిస్తే వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. రద్దీ రహదారులపై వేలాది వాహనాలు నిత్యం తిరుగుతున్నాయి. రాజాం వంటి ప్రాంతంలోనే కొన్ని సమయాల్లో నిమిషానికి సుమారు 60 వాహనాలు దూసుకుపోతున్నాయంటే ట్రాఫిక్ ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. గతంతో పోలిస్తే ప్రమాదాల సంఖ్య తగ్గుతోంది. ఇందుకు పోలీసులు, రవాణా శాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలే కారణం. ఇటీవల ప్రభుత్వం రహదారి ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాహన చోదకులపై కొరడా ఝుళిపిస్తున్నారు. ఈ నిర్ణయాలన్నీ మంచి ఫలితాన్ని ఇస్తున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**ఈ-చలానా:** అతివేగం, లైసెన్సు లేకపోయినా, తప్పు రహదారిలో వచ్చినా భారీగా అపరాధ రుసుం విధిస్తున్నారు. పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలను ముమ్మరం చేశారు. వాహనం నంబరు చిత్రం తీసిన వెంటనే కేసు నమోదైపోతోంది. రూ.1,600 వరకు అపరాధ రుసుం వాహనచోదకులు చెల్లించాల్సి వస్తోంది. గతంలో పోలీసులకు అపరాధ రుసుం చెల్లిస్తే రసీదు ఇచ్చేవారు. ఇప్పుడు అలా కాదు. మీ సేవ కేంద్రాలకు వెళ్లి అపరాధ రుసుం ఆన్‌లైన్‌లోనే చెల్లించే వీలుంది. నిర్ణీత గడువులోగా వీటిని చెల్లించాల్సి ఉంటుంది.

## మద్యం బాబులపై ఉక్కు పాదం

జిల్లాలో ఏటా రూ.వందల కోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఇందులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారి సంఖ్యే అధికంగా ఉంటోంది. ప్రమాదాలు ఎక్కువగా వీరి వల్లే జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు. అంతే నిఘా పెంచారు. శ్వాస విశ్లేషణ పరీక్షలు నిర్వహించి వాహన చోదకులు తాగిన మద్యం స్థాయిని గుర్తిస్తున్నారు. ఇందులో పట్టుబడితే వాహనం స్వాధీనం చేసుకోవడమే కాదు.. కేసులు నమోదు చేసి భారీగా అపరాధ రుసుం విధిస్తున్నారు. జిల్లాలో గతేడాది ఏకంగా 5,455 మంది మద్యం బాబులు పట్టుబడ్డారు. 2014లో కేవలం 387 కేసులు నమోదవ్వగా, 2015లో 7,555, 2016లో 8,124కు ఈ సంఖ్య పెరిగింది. దీంతో గతేడాది పోలీసులు కొరడా ఝుళిపించడంతో మద్యం బాబులు వెనక్కి తగ్గారు.

### ప్రమాదాలకు కారణాలివి

జిల్లాలో ప్రమాదాలకు గల కారణాలపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు అధ్యయనం చేశారు. ఎక్కువ ప్రమాదాలు ఇలా జరుగుతున్నాయి.



రహదారి ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

- అతివేగం
- మద్యం మత్తులో వాహనాలు నడపడం
- ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకపోవడం
- లైసెన్సులు లేకుండా వాహనాలు నడపడం
- వాహన చోదకుల నిర్లక్ష్య వైఖరి
- సరిపడా నిద్ర లేకుండానే లారీలు వంటి భారీ వాహనాలు నడపడం

### అడుగడుగునా నిఘా



- జిల్లాలో 194 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ఆస్కారం తలెత్తుతోంది. దీంతో పోలీసులు దీనిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. జిల్లా ఎస్పీ త్రివిక్రమవర్మ ఆదేశాల మేరకు పలు చర్యలు చేపట్టారు.
- రణస్థలం నుంచి ఇచ్ఛాపురం వరకు జాతీయ రహదారిలో నిఘా పెంచారు.
- ప్రతి 12 కిలోమీటర్లకు ఒక పెట్రోలింగ్ వాహనం ఏర్పాటు చేశారు. ప్రత్యేక సిబ్బందిని నియమించారు. వచ్చి పోయే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించడం, ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే తక్షణం సహాయక చర్యలు అందించడం చేస్తున్నారు.
- వేగ నియంత్రణ వాహనం ఏర్పాటు చేయడం మంచి ఫలితాలు ఇస్తోంది. గతంలో లారీలు, కార్లు, ఇతరత్రా వాహనాలు దూసుకుపోయేవి. ఈ వాహనం ద్వారా వేగం గుర్తించి కేసులు నమోదు చేస్తుండటంతో వాహనాల వేగానికి కళ్లెం పడుతోంది.
- కూడళ్లలో ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి ఆయా చోట్ల స్టాపర్లు ఏర్పాటు చేశారు. విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయడంతో గాడాంధకారం ఇబ్బందులు తొలగిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలు స్పష్టంగా గుర్తించేందుకు వీలవుతోంది.
- రాత్రి సమయాల్లో నిద్ర మత్తుతో వాహనాలు నడిపే డ్రైవర్లను గుర్తించి ముఖాలు కడిగించడం చేస్తున్నారు.

### ప్రయాణం భద్రంగా సాగాలి



ప్రయాణం భద్రంగా సాగాలి. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు వాహనం నడపడానికి అవసరమైన అనుమతి పత్రాలన్నీ ఉండాలి. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపకూడదు. వారికి వాహనం నడిపేందుకు లైసెన్సు ఉండదు. దొరికితే చాలా కఠినమైన శిక్ష ఉంటుంది. ఇలాంటి వారు వాహనాలు నడిపితే ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. సామర్థ్యం లేని, కాలం చెల్లిన వాహనాలు అనుమతి లేకుండా రోడ్లపై తిరగకూడదు.

**- శ్రీదేవి, రవాణాశాఖ ఉప కమిషనర్, శ్రీకాకుళం**

### నిబంధనలు మీరితే కఠిన చర్యలు



రహదారి ప్రమాదాలు మరింతగా తగ్గించాలి. ఇంతవరకు తీసుకున్న చర్యలు మంచి ఫలితాన్ని ఇచ్చాయి. గతంతో పోలిస్తే ప్రమాదాలు, మృతుల సంఖ్య తగ్గింది. అయినా ఇంకా ఇవి తగ్గాలి. పోలీసు శాఖ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మద్యం తాగి వాహనం నడిపేవారిపై నిఘా పెంచాం. అవసరమైన బ్రీత్ ఎనలైజర్లు అందించాం. చోదకులు వేగ నియంత్రణ పాటించాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు ప్రమాదాలు తగ్గుతాయి.

**- త్రివిక్రమవర్మ, ఎస్పీ, శ్రీకాకుళం**

## పిడిమందస జన్మభూమిలో జగడం



పిడిమందస జన్మభూమి సభలో తోపులాడుకుంటున్న ఇరు వర్గాలవారు

పిడిమందస (మందస): మందస మండలంలోని పిడిమందసలో గురువారం నిర్వహించిన 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో తెదేపా, వైకాపా కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. హుద్‌హుద్ నిధులతో పిడిమందస వరకు తారు రోడ్డు మంజూరైనా పనులు చేపట్టడం లేదని వైకాపా నాయకులు ప్రశ్నించడంతో తెదేపా నాయకులు అడ్డుచెప్పారు. దీంతో మొదలైన తోపులాటలో కుర్చీలు విసురుకోడానికి సిద్ధమయ్యారు. ఎంపీడీఓ చంద్రకుమారి పోలీసులకు ఫోన్ చేయడంతో వివాదం సద్దుమణిగింది.

**చికెన్ ధరలు** బ్రాయిలర్ (బ్యాగ్) లైవ్: 100; డ్రెస్డ్: 155; స్కిన్‌లెస్: 175, **వెన్‌కాబ్:** లైవ్: 109; డ్రెస్డ్: 158; స్కిన్‌లెస్: 180, **సుగుణ:** లైవ్ 108; డ్రెస్డ్: 157; స్కిన్‌లెస్: 184.

## నాలుగు పంచాయతీల్లో 'జన్మభూమి' బహిష్కరణ

సీతంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'జన్మభూమి' కార్యక్రమానికి అక్కడక్కడ అవాంతరాలు ఎదురవుతున్నాయి. సీతంపేట మండలం కోడిశ, కుసిమి, కిల్లాడ, దారపాడు పంచాయతీల్లో గురువారం నిర్వహించ తలపెట్టిన 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాన్ని గిరిజనులు పూర్తిగా బహిష్కరించారు. మండల ప్రత్యేకాధికారి భవానీశంకర్, ఎంపీడీవో డబ్ల్యూ.రాధాకృష్ణన్, తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండు బృందాలు ఆయా పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వెళ్లినప్పటికీ అక్కడి గిరిజనులు ఎవరూ హాజరు కాలేదు. బోయ, వాల్మీకి కులస్థులను గిరిజన జాబితాలో చేర్చుతున్నట్లు శాసనసభలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్‌తో ఆదివాసీ సంఘాల ఐకాస నాయకుల పిలుపుమేరకు జన్మభూమిని బహిష్కరించారు. కుసిమిలో జన్మభూమిలో పాల్గొనేందుకు వచ్చిన తెదేపా పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి, గిరిజన సలహా మండలి సభ్యులు నిమ్మక జయకృష్ణకు ఆదివాసీ సంఘాల ఐకాస నాయకులు ఎస్.గంగారావు, బి.శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో గిరిజనులు వినతిపత్రం అందజేశారు. గిరిజనులు జన్మభూమిని బహిష్కరించడంతో జడ్పీటీసీ సభ్యుడు పి.రాజబాబు, నాయకులు ఎన్.నాగేశ్వరరావు, బి.చంద్రరావు, మాలయ్య, ఎంపీటీసీ సభ్యురాలు చంద్రకళ, అధికార బృందం నిర్ణీత సమయం వరకు వేచి చూసి వెనుదిరిగారు.



కుసిమిలో ప్రజలరాక కోసం వేచి చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

# ఇచ్ఛాపురం

## ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

రాజపురం (కవిటిగ్రామీణం) న్యూస్‌టుడే: రాజపురంలోని ఆదర్శ పాఠశాల 2018-19 సంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.శారదమ్మ తెలిపారు. ఆన్‌లైన్‌కు తుదిగడువు ఫిబ్రవరి 16గా తెలిపారు. ఏప్రిల్ 8న విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు.

## తెరపై సినిమాలు

★ ఇచ్ఛాపురం : ఎల్‌మాక్స్ సినిమా (శ్రీమణికంఠ) 2కంట్రీస్, పూర్ణ - ఎంసీఏ ★ సోంపేట : శ్రీనివాస - ఒక్క క్షణం, తిరుమల - ఎంసీఏ ★ కవిటి : మహాలక్ష్మి - ఎంసీఏ, అశోక్ : 2కంట్రీస్

-న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## ఎమ్మెల్యే అశోక్‌కు ముఖ్యమంత్రి అభినందనలు


కాన్వాయ్ నుంచి అభివాదం తెలుపుతున్న ముఖ్యమంత్రి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ముఖ్యమంత్రి వాటిని తిలకించేలా ప్రధాన వేదికకు సమీపంలో మరో వేదికను ఏర్పాటుచేశారు. అయితే కళాకారుల ఆశ నెరవేరలేదు. ప్రజలు మాత్రం ఆస్వాదించారు. తప్పెట గుళ్లు, కోలాటం, ఆంధ్రా, ఒడిశా నాట్యకారుల నర్తనలతో పాటు గంగిరెద్దులాటలను ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రి వినోదానికి దూరంగా, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధన కోసం ఆరుబయట మలవిసర్జన లేని గ్రామాలను తీర్చిదిద్దేందుకే ప్రాధాన్యం ఇచ్చారు. రైతు రథంపైకి ఎక్కి కాసేపు అందరినీ అలరించారు.

జన్మభూమి-మన ఊరు కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డా.బెందాళం అశోక్ బాగా కష్టపడ్డారు. జిల్లా అధికారులు తోడుగా నిలిచి, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సభకు హాజరైన జనసందోహాన్ని చూసిన ముఖ్యమంత్రి, ఇతర పెద్దలు ఎమ్మెల్యే అశోక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్యమంత్రికి పొందూరు ఖాదీ వస్త్రాలను సమర్పించారు. బస్సులో ఉండటంతో ప్రజలకు కనిపించలేదని గుర్తించిన ముఖ్యమంత్రి తిరుగు ప్రయాణంలో కారు తలుపు తెరిచి, ప్రజలకు అభివాదం చేస్తూ, జ్ఞానభారతి వద్ద ఉన్న హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. ఈ ప్రయాణంలో ప్రజలు ఇస్తున్న అర్జీలను స్వయంగా అందుకున్నారు. ఇక హెలీప్యాడ్ వద్ద కొద్ది నిమిషాలు స్థానిక నాయకులతో మాట్లాడారు. జిల్లా కలెక్టరుతో పాటు ఇతర అధికారులను, పురాధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను ముఖ్యమంత్రి అభినందించి తిరిగివెళ్లారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు నర్తు రామారావు, జేసీ చక్రధర్‌బాబు, తెదేపా జిల్లా మాజీ అధ్యక్షుడు బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి రాక కోసం వేచి ఉన్న తెదేపా నాయకులు

## ప్రగతి ప్రతిబింబాలు... సంక్షేమ ప్రదర్శనలు

● ముఖ్యమంత్రిని ఆకట్టుకున్న విభాగాలు ● అన్నింటా పోటాపోటీగా ప్రగతి కనువిందు


ఉద్యానశాఖ ఏర్పాటుచేసిన బిందుసేద్య ప్రదర్శన

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, గ్రామీణం

ఐదో జన్మభూమి కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టిని అలరించేలా ప్రగతి ప్రదర్శన వేదికలు నిలిచాయి. గురువారం ఇచ్ఛాపురం జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. వేటికవే పోటీపడి, తమ శాఖల ప్రతిభను ప్రతిబింబించేలా ఏర్పాట్లుచేశాయి. ఉద్యాన, ఐటీడీఏ, వ్యవసాయశాఖలు తమ పథకాలతో ప్రదర్శనలు ఇచ్చాయి. బిందు సేద్యాన్ని వివరించేలా పూలమొక్కలతో చేపట్టిన ఉద్యానశాఖ ప్రదర్శన, అందులోనే ఆకట్టుకొనేలా కొబ్బరిగెలలు ప్రదర్శించారు. ఇక వ్యవసాయశాఖ కొత్తవంగడాల సాగులో సాధించిన విజయాలు ప్రదర్శించారు. బాలకృష్ణాపురం రైతు బదకల గణపతి రూపొందించిన ధాన్యరాశి, దానిచుట్టూ జన్మభూమి నినాదాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా శ్రీకాకుళం సన్నాలు వరికంకులతో చేసిన హారాన్ని దాన్ని రూపొందించిన మండల రైతు దున్న జానకిరావు ముఖ్యమంత్రికి సమర్పించారు. ఐటీడీఏ ఉత్పత్తులను ప్రదర్శించారు. కొండతేనె, పసుపు, ఇతర ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ స్టాల్స్ వద్దకు ప్రజలను చేరనివ్వకపోవడంతో, అక్కడ ఉన్న పోలీసులే వాటిని కొనుగోలు చేశారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ (ఐసీడీఎస్) ఏర్పాటుచేసిన విభాగంలో వివిధరకాల పౌష్టికాహార పిండి వంటలు ఏర్పాటు చేశారు. వాటిని పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వీకరించారు. మత్స్యశాఖ విభాగంలో సంప్రదాయ చేపల వేట పనిముట్లు, పడవలు, ఇతర పరికరాలను ప్రదర్శించారు. చెత్తతో సంపదను తయారుచేసేందుకు డంపింగ్ యార్డుల అవసరాన్ని, సాధించిన ప్రగతిని పేర్కొనేలా పీవో హేమసుందరరావు ఆధ్వర్యంలో ప్రదర్శన ఏర్పాటుచేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీ రోజారాణి ఆధ్వర్యంలో మహిళా సంఘాలు తయారుచేసిన వివిధ ఉత్పత్తులను ప్రదర్శించారు. రైతు రథాన్ని కొళిగాంకు చెందిన ప్రకాష్‌చంద్ర నాయక్‌కు అందించారు.


మత్స్యశాఖ ప్రదర్శనలో పరికరాలు


చేతివృత్తి ప్రదర్శన విభాగం


జిల్లా విద్యావిభాగ ప్రదర్శనలో భవిత పరికరాలు, అధికారులు

## వినతుల వెల్లువ.. సానుకూల స్పందన

### సభలో ముఖ్యమంత్రికి అందజేసిన ఎమ్మెల్యే అశోక్

సోంపేట, న్యూస్‌టుడే : ఇచ్ఛాపురం జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో 20ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన నీటి సరఫరా వ్యవస్థతో ఇబ్బందులు నెలకొంటున్నాయని, సరిహద్దు చెక్‌పోస్టు ఎత్తివేతతో ఏర్పడిన సమస్యలు ఇతర అంశాలను సభలో వివరించారు. సరిహద్దు ప్రాంతంలోని ఇచ్ఛాపురంలో ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గానికి స్వాగతద్వారం ఏర్పాటుచేయాలని, రత్తకన్న పురుషోత్తపురం పంచాయతీలకు రోడ్లు, ఇతర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి గాను రూ.40కోట్లు మంజూరుచేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. కొబ్బరి పార్కు ఏర్పాటు, అరకబద్రపై వంతెన నిర్మాణం, తీరప్రాంతాల్లో శీతలీకరణ గిడ్డంగులు ఏర్పాటుచేస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలతో పాటు గంగాసాగరాన్ని జలాశయంగా చేయాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించగా సానుకూలంగా స్పందించారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంతో పాటు ఇతర సమస్యలపైనా ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వగా మత్స్యకారుల అంశం తన దృష్టిలో ఉందని పరిశీలిస్తానని పేర్కొన్నారు.

**ఇచ్ఛాపురం** : బాహుదా జలాలను నిల్వ చేసేందుకు మూడుచోట్ల జలాశయాలను నిర్మించాలని, ఇచ్ఛాపురం రైలు నిలయం అభివృద్ధి చేయడంతో పాటు, ముఖ్యరైళ్లను ఆపాలని, సీపీఎస్ పింఛను విధానాన్ని రద్దు చేయాలని నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతులను అందించారు. రత్తకన్న-ఇచ్ఛాపురం మధ్య రైల్వే గేటు వద్ద ఫైఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ఇచ్ఛాపురంలో సాంకేతిక విద్యకేంద్రాల ఏర్పాటు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రహరీ, భవన నిర్మాణాలు చేపట్టడం, పట్టణ ముఖద్వారంలో రాష్ట్రానికి స్వాగతం పలికే స్వాగతద్వారంతో పాటు, మహనీయుల విగ్రహాల ఏర్పాటుచేయాలని కోరారు. ఇచ్ఛాపురంలో రైతు బజారు ఏర్పాటుచేయాలని, ఆర్టీసీ డిపో ఏర్పాటుచేయాలని కోరారు. ఈ వినతులను అందించిన వారిలో కాళ్ల ధర్మారావు, నాగరాజుపాత్రో, నందిక జాని, సిహెచ్ తులసీదాసు, కొండా శంకర్‌రెడ్డి, నీలాపు డిల్లీ, ఏపీటీఎఫ్ నాయకులు ఉన్నారు. మండల సమస్యలను ఎంపీపీ దక్కత డిల్లీరావు ముఖ్యమంత్రికి నివేదించారు. సొండి కులస్థులు తమ కుల వృత్తిని ప్రోత్సహించాలని కోరుతూ వినతులను అందించారు. రజకుల సంక్షేమసంఘం తమ సమస్యలను నివేదించారు.


విద్యార్థుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తూ..

## అభివృద్ధి చెందిన జిల్లాగా శ్రీకాకుళం

### జిల్లా కలెక్టర్ ధనంజయరెడ్డి

సోంపేట, న్యూస్‌టుడే : శ్రీకాకుళంను మీ ఆధ్వర్యంలో అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ ధనంజయరెడ్డి ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. ఇచ్ఛాపురంలో గురువారం నిర్వహించిన జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో ప్రారంభోపాన్యాసం చేస్తూ మార్చి 31నాటికి బహిరంగ మలమూత్ర విసర్జన జిల్లాగా మార్చేందుకు అందరిసహకారంతో ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ పరంగా 32శాతం వృద్ధి చెందిందని కూలీల వేతనాల రూపంలో రూ.232కోట్లు, ఇతరాల కోసం రూ.154కోట్లు కేటాయింపులు జరిగాయని ఇది రికార్డుస్థాయి ప్రగతిగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సూచనమేరకు ప్రతీ కుటుంబానికి నెలకు రూ.10వేలు వచ్చేలా కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆగస్టు, సెప్టెంబరులలో నిర్వహించిన రైతుసేవలో రెవెన్యూ కార్యక్రమంలో 75 వేలు ఫిర్యాదులు పరిష్కరించామని, ఈ నెలలో ఇల్లాలికి ఇంటి పట్టా, రైతుకు భూమి హక్కు పేరిట ఐదు వేల పట్టాలు పంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వంశధార కల నెరవేరనుందని ఈ రబీలో 3లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నామని, వచ్చే రబీ నాటికి 5లక్షల ఎకరాలకు సాగునీరందిస్తామన్నారు. గ్యాస్ కనెక్షన్ల పంపిణీ ద్వారా పొగరహిత జిల్లాగా మార్చామని చంద్రన్నబీమా ద్వారా 4,852 మంది బాధిత కుటుంబాలకు రూ. 34 కోట్లు పరిహారం అందజేశామన్నారు. ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందించేందుకు ఏర్పాట్లుచేస్తున్నామని, పింఛన్ల కోసం రూ.30 కోట్లు వెచ్చిస్తున్నట్టు వివరించారు. ఎన్టీఆర్ వైద్యసేవ, ఎస్టీ, ఎస్సీలకు విద్యుత్తు సదుపాయం, మరుగుదొడ్ల నిర్మాణాల వివరాలను ఆయన ముఖ్యమంత్రికి వివరించారు.


వేదిక వద్ద మాట్లాడుతున్న కలెక్టరు ధనంజయరెడ్డి


విద్యార్థినితో మాట్లాడుతున్న ధనంజయరెడ్డి

## నేటినుంచి బారువ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరం

బారువ (సోంపేట), న్యూస్‌టుడే: ఈనెల 5 నుంచి బారువ పంచాయతీ కుమ్మరిపేటలో బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్. శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు ఎన్.ఎస్.ఎస్. పీవో పి.అరుణకుమార్ తెలిపారు. శుక్రవారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. ఛైర్మన్ గూడేన కృష్ణమూర్తి, బారువ మేజర్ పంచాయతీ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

# ఇచ్ఛాపురం




# జన్మభూమి-మాఊరుతో సమస్యలు పరిష్కారం


యక్కలలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచి, ఎంపీడీవో తదితరులు


కొజ్జిరియాలో సామూహిక సీమంతాలు

యక్కల, కేసరపడ(కంచిలి), న్యూస్‌టుడే : జన్మభూమి-మాఊరు కార్యక్రమాలను నిర్వహించడం వలన స్థానిక సమస్యలను నేరుగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకొనే అవకాశం కలుగుతుందని యక్కల సర్పంచి కాతిల లక్ష్మి తెలియజేశారు. గురువారం ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో యక్కల, కేసరపడ గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని చేపట్టారు. కేశరపడ, యక్కల పంచాయతీలలో జరిగిన ఈ కార్యక్రమాలలో ఎంపీపీ ఇప్పిలి లోలాక్షి, సర్పంచి యర్ర హైమావతి మాట్లాడుతూ గత జన్మభూమిలో సమస్యలకు పరిష్కారం చూపకుండా కొత్తగా మళ్లీ నిర్వహించడంతో ఎలాంటి ప్రయోజనం ఉండదని విమర్శించారు. పంచాయతీలలో నిర్మాణాలు చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్లకు బిల్లులు చెల్లించడం లేదని లబ్ధిదారులు సమావేశంలో తెలిపారు. స్థానిక నాయకులు, కొన్నిశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మిగిలిన అధికారులు, సిబ్బంది ముఖ్యమంత్రి పర్యటకు హాజరైనట్టు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు.

బెల్లుపడ, కుంబరినౌగాం(కంచిలి), న్యూస్‌టుడే : కుంబరినౌగాం, బెల్లుపడ పంచాయతీలలో తహసీల్దార్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో జన్మభూమి- మాఊరు కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక సర్పంచులు దుర్గాప్రసాద్ పండా, ఎ.హరికృష్ణ పాల్గొన్నారు. పంచాయతీ కేంద్రాల్లో పరిధిలో స్వచ్ఛభారత్ ర్యాలీలు నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించి త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలన్నారు. లబ్ధిదారుల నుంచి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు.

**కొజ్జిరియా, కరాపాడు (కవిటిగ్రామీణం) న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల పరిష్కారానికి జన్మభూమి ఓ చక్కనివేదిక అని ప్రత్యేక అధికారి కె.సూర్యనారాయణ అన్నారు. కొజ్జిరియా, కరాపాడులలో గురువారం జన్మభూమి కార్యకమ్రాలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాఛ్చాంధ్రప్రదేశ్‌పై దిశానిర్ధేశం చేసారు. సామూహిక సీమంతాలు నిర్వహించి, రేషన్‌కార్డులు, చంద్రన్న కానుకలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎస్.తిరుపతిరావు, డెప్యూటీ డీఎంహెచ్‌వో ఎం.ప్రవీణ్ , తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో రామకృష్ణారావు, సర్పంచి, ఎంపీటీసీసభ్యులు సుసీల, ఉషారాణి పాల్గొన్నారు.

**నేడు జన్మభూమి గ్రామ సభలు**

సిలగాం (కవిటిగ్రామీణం) న్యూస్‌టుడే : జన్మభూమి-మావూరు గ్రామసభలు శుక్రవారం సిలగాం, శహలాలపుట్టుగలలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.రామకృష్ణారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు అన్నిశాఖల అధికారులు పూర్తిస్తాయి సమాచారంతో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

## సాయినాథుడికి విశేష పూజలు

ఆడుపూడి ఆర్.ఎస్(కవిటిగ్రామీణం) న్యూస్‌టుడే : షిర్డీ సాయి మందిరం జాడుపూడి ఆర్ఎస్‌లో గురువారం విశేష పూజలు చేపట్టారు. వేకువజామున స్వామి వారికి సుప్రభాత సేవ, హారతులు, విశేషార్చనలు చేపట్టారు.

## విద్యార్థులకు జన్మభూమి ఆటలు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రజాచైతన్యంతో పాటు, సంప్రదాయ ఆటపాటలతో ఉల్లాసంగా సాగారు. బిర్లంగి, హరిపురం, మండపల్లి గ్రామాలలో ప్రజా చైతన్య కార్యక్రమాలను గురువారం ఉదయం జరిపారు. ఓడీఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతీఒక్కరూ శ్రమించాలని విద్యార్థులు పిలుపునిచ్చారు. గ్రామాలలో స్వచ్ఛత పాటించేలా అందరితో కలసి స్వచ్ఛభారత్ నిర్వహించారు. కళాశాల ఆవరణలో కబడ్డి, క్రికెట్, ఖోఖో ఆటలను ఆడించారు. 11న విజేతలకు బహుమతులు అందిస్తామని ప్రిన్సిపల్ డా.కె.మధుసూదన్ తెలిపారు.

## రసవత్తరంగా క్రికెట్ పోటీలు

బూరగాం(కంచిలి), న్యూస్‌టుడే : బూరగాం యువ భారత్ క్రికెట్ పోటీల్లో భాగంగా గురువారం గోకర్ణపురం- కవిటి కొత్తూరు, పొత్తంగి-గెద్దలపాడు జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. తొలుత బ్యాటింగ్ చేపట్టిన కవిటి కొత్తూరు 99 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేపట్టిన గోకర్ణపురం జట్టు 65 పరుగులకే అంతా అవుటవడంతో కవిటికొత్తూరు విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన పోటీలలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత 14 ఓవర్లలో 118 పరుగులు చేపట్టగా, తరువాత బ్యాటింగ్ చేపట్టిన గెద్దలపాడు జట్టు 60 పరుగులకే అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి పాలైంది.

## నిరంతర వ్యాయామంతో సత్ఫలితాలు

కవిటిగ్రామీణం, న్యూస్‌టుడే: వికలాంగ బాలలకు నిరంతర వ్యాయామంతోనే మంచి ఫలితాలు సాధ్యమని డా.బి.భార్గవి అన్నారు. కవిటిలో గురువారం నిర్వహించిన ఫిజియోథెరఫీ వైద్యశిబిరంలో ప్రత్యేకావసరాల బాలలకు వ్యాయామచికిత్సలు నిర్వహించారు. ఇంటి వద్ద పాటించాల్సిన పద్ధతులపై వారి తల్లిదండ్రులకు సూచనలు చేశారు. క్రమంతప్పకుండా వ్యాయామం నిర్వహించాలన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి


ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడుని కలిసిన పీఆర్టీయూ ప్రతినిధుల బృందం

**సోంపేట, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడుని పీఆర్టీయూ ప్రతినిధుల బృందం కోరారు. గురువారం సోంపేట వచ్చిన ఆయనను పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.శరత్‌బాబు ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీయస్ విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలుచేయాలని, ఒప్పంద, అవుట్ సోర్సింగ్ మహిళా ఉపాధ్యాయులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరుచేయాలని కోరారు. సర్వీసు రూల్స్‌కి న్యాయపరమైన అడ్డంకులు తొలగించి పదోన్నతలు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకు తనవంతు కృషి చేసి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీని కలిసినవారిలో పీఆర్టీయూ నాయకులు వేణుగోపాలరావు, సోమేశ్వరరావు, డి.బాలరాజు, టి.రవికుమార్ తదితరులు ఉన్నారు.



# స్వచ్ఛభారత్ సాధనలో అందరూ భాగస్వాములవ్వాలి

సోంపేట, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం పంచుకోవాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు పేర్కొన్నారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమాల్లో భాగంగా సీఎం పిలుపుమేరకు గురువారం సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వచ్ఛభారత్‌పై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రతీ ఇంటిలో మరుగుదొడ్డి ఉండాలని, పరిసరాల్లో ఎలాంటి చెత్తాచెదారాలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని పట్టణవీధుల్లో తిరుగుతూ నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు జి.శంకరరావు, పి.లోకనాధం, శివరాంప్రసాద్‌పాడి, ఎం.సూర్యారావు, బి.శ్రీధర్, సంతోష్‌కుమార్, బి.సుధాకర్, పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పురపాలక సంఘ ప్రజలకు స్వచ్ఛతే సేవపై అవగాహన కలిగించేందుకు విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. గురువారం ఇచ్ఛాపురం పురపాలకసంఘం బాలికోన్నత పాఠశాల నుంచి ఈ ప్రదర్శన ప్రారంభమైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పద్మవల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనను పురపాలకసంఘ కమిషనర్ పూడి రవిబాబు ప్రారంభించి, ప్రదర్శనలో పాల్గొన్నారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో మూడోరోజున స్వచ్ఛతసేవకు ప్రభుత్వం పిలుపునిచ్చిన దరిమిలా ఈ ప్రదర్శన నిర్వహించినట్లు కమిషనరు రవిబాబు తెలిపారు. బస్టాండు, బజారుకూడలి, దాసన్నపేట, రథంవీధి,పంజావీధి, ఆసుపత్రి మార్గం మీదుగా తిరిగి పాఠశాలకు చేరుకున్నారు.

కంచిలి : చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం, బహిరంగ మలవిసర్జన చేపట్టకుండా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి వాటిని ఉపయోగించుకోవడంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, ఆరోగ్యకరమైన పరిసరాలు ఉంటే రోగాలకు దూరంగా ఉండొచ్చని కంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ తెలియజేశారు. గురువారం పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

**బుషాభద్ర (సోంపేట), న్యూస్‌టుడే:** వ్యక్తిగత పరిశుభ్రత, శతశాతం మరుగుదొడ్లను నిర్మించుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం బుషభద్ర పంచాయతీలో జరిగిన జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో సర్పంచి పి.సదానందం, వివిధశాఖల అధికారులు మాట్లాడుతూ ప్రతీ ఇంటిలో మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని, అందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛభారత్ సాధ్యపడుతుందన్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు అంశాలపై అధికారులకు దరఖాస్తులు అందజేశారు.

బొరివంక (కవిటి గ్రామీణం): స్వచ్ఛభారత్ సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ గుర్తెరగాలని ప్రధానోపాధ్యాయులు ఎం.మురళిప్రకాష్ అన్నారు. ఇద్దివానిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గురువారం స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.


స్వచ్ఛభారత్‌పై సోంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


కంచిలిలో ర్యాలీ చేపడుతున్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

# పారిశ్రామికవాడ అభివృద్ధికి రూ.3.55 కోట్లు మంజూరు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలసలో ఉన్న కర్మాగారాలు మూతపడుతున్న సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో ఆమదాలవలస పారిశ్రామికవాడ అభివృద్ధి చెందనుంది. దీని కోసం ప్రభుత్వ విప్ కూన రవికుమార్ పలుమార్లు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వాలు స్పందించాయి. దీంతో పారిశ్రామికవాడ అభివృద్ధి కోసం ఏపీఐఐసీ వారు ఆమదాలవలస ఇండస్ట్రియల్ ప్రాంతంలో రహదారులు, మంచినీటి సౌకర్యానికి, బ్యాంకు, పోస్టాఫీసు సేవలకు, సోషల్ ఫారెస్ట్రీ వంటి వాటిని ఏర్పాటుచేసేందుకు రూ.3.55 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ప్రభుత్వ విప్ కూన రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో ఆమదాలవలస నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.



# సిక్కోలు వాకిట మరో క్రీడా సంబరం

## నేటి నుంచి రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్‌డీవో తదితరులు

బలగ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే

క్రీడల ఖిల్లా.. సిక్కోలు జిల్లా మరో రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధమైంది. ఈ సారి ఎర్రన్నాయుడు స్మారక మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు వేదిక కానుంది. ఈ పోటీలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇప్పటికే వసతి, భోజన ఏర్పాట్లు పూర్తయ్యాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఇప్పటికే పలు చోట్ల వసతి కల్పించారు. కృష్ణా, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు క్రీడాకారులు చేరుకున్నారు. పెద్దఎత్తున క్రీడాకారులు రానున్నందున ఎటువంటి లోపాలూ తలెత్తకుండా సంబంధిత అధికారులతో కలెక్టర్ ధనంజయ రెడ్డి, ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఇప్పటికే సమావేశమై సూచనలు చేశారు. మున్సిపల్, రెవెన్యూ, క్రీడా సంస్థల సంయుక్త సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పోటీలను ప్రారంభించి.. క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించనున్నారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో శుక్రవారం నుంచి ఈ క్రీడా సంబరం నిర్వహించనున్నారు. శాప్, డీఎస్‌ఏ, జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘంతో పాటు వే ఫౌండేషన్ సహకారం అందిస్తున్నారు.

### ఏర్పాట్లు ఇలా..

వాస్తవానికి ఈ పోటీలు కేఆర్ మైదానంలో జరగాల్సి ఉండగా, అక్కడ పునర్నిర్మాణ పనులు చేపట్టడంతో ఈ మైదానాన్ని ఎంపిక చేశారు. ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానాన్ని పోటీల కోసం సుందరంగా తీర్చిదిద్దారు. ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. అథ్లెటిక్స్ విభాగంలో అన్ని విభాగాలకు సంబంధించి సంబంధిత వ్యాయామోపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి ఆట మైదానాలను సిద్ధం చేశారు. 50 మంది పీడీలు, పీఈటీలు ఈ పోటీలలో పాల్గొననున్నారు. వివిధ జిల్లాల నుంచి వంద మందికిపైసాంకేతిక సిబ్బంది రానున్నారు.

### వసతి ఇలా..

మహిళలకు వైటీసీ, పురుషులకు ఆర్ట్స్ కళాశాలలో వసతి ఏర్పాటు చేశారు. మైదానంలో నెలకొల్పిన ప్రత్యేక స్టాళ్లలో భోజనాలు అందించనున్నారు. శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచే పోటీలు ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం రెండు వరకు సాగుతాయి. భోజన విరామం తరువాతే అధికారిక కార్యక్రమం జరగనుంది. 35 నుంచి 90 ఏళ్ల వరకు వివిధ వయో విభాగాల పోటీలు జరగనున్నాయి.

### ఏర్పాట్లపై సమీక్ష

పోటీల నిర్వహణపై గురువారం సాయంత్రం డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పలువురు పీడీలు, పీఈటీలు, వివిధ జిల్లాలకు చెందిన న్యాయ నిర్ణేతలతో భేటీ అయి ఏర్పాట్లపై సమీక్షించారు. పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనతో క్షణం తీరిక లేకుండా ఉన్నప్పటికీ మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడులు అధికారులతో మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు.



సిద్ధమైన ట్రాక్

### ఎర్రన్నాయుడు స్ఫూర్తితో..

దివంగత కేంద్ర మంత్రి ఎర్రన్నాయుడు స్ఫూర్తితో తొలిసారిగా ఈ పోటీల నిర్వహణకు శ్రీకాకుళం ఆతిథ్యం ఇవ్వనుంది. నవ్యాంధ్రలో ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేందుకు శాప్, డీఎస్‌ఏ, మిగతా జిల్లా యంత్రాంగం ఎంతగానో కృషి చేస్తోంది. సిక్కోలుకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకువచ్చేలా జిల్లా క్రీడాకారులు రాణించాలి. ముందు కూడా క్రీడాకారులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు, ఆధునిక వసతుల కల్పనకు ప్రభుత్వం తరఫున కృషి చేస్తాను.

**- కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎంపీ, శ్రీకాకుళం**

### సర్వం సిద్ధం

జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. క్రీడల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పోటీలను ప్రారంభించనున్నారు. ఇప్పటికే వేర్వేరు కమిటీల నేతృత్వాన క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యాలు కల్పించాం. వెయ్యి మందికిపైగా క్రీడాకారుల రాకతో ఇక్కడి మైదానం కళకళలాడనుంది.

**- బి.శ్రీనివాస్ కుమార్, డీఎస్‌డీఓ**

### కొత్త స్ఫూర్తి

మారుమూల పల్లెల నుంచి క్రీడా కుసుమాలు వికసిస్తున్న ఈ తరుణాన ఇటువంటి వేడుకలు కొత్త స్ఫూర్తి ఇస్తాయి. మా సంఘం తరఫున పోటీలను విజయవంతం చేసేందుకు తప్పక సహకరిస్తాం. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారుల రాకతో వేర్వేరు ప్రాంతాల సంస్కృతులు తెలుస్తాయి. పోటీతత్వం పెరగడమే కాదు, ఇటువంటి సంబరాలు సాంస్కృతిక వారధిగా నిలుస్తాయి. దివంగత నేత ఎర్రన్నాయుడు పేరిట ఏటా స్మారక పోటీలు నిర్వహించాలి.

**-చల్లా శ్రీనివాస్, అధ్యక్షుడు, జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ సంఘం**

# నిర్వాసిత కాలనీల్లోనే సరకుల పంపిణీ



మెట్టూరు బిట్-2లో చంద్రన్న కానుకలను అందిస్తున్న దృశ్యం

**ఈనాడు కథనానికి స్పందన**

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని మెట్టూరు, గూనబద్ర నిర్వాసిత కాలనీల్లోకే నేరుగా నిత్యావసర సరకులను అందించారు. 'అన్నింటికీ ఇబ్బందే' శీర్షికతో గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పాలకొండ ఆర్డీవో రెడ్డి గున్నయ్య ఆదేశాల మేరకు హిరమండలం మండలంలోని పౌరసరఫరాల శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో సంబంధిత పాడలి, తులగాం, దుగ్గపురం, గార్లపాడు, పెద్ద సంకిలి, తదితర గ్రామాల్లోని రేషన్ డిపోల ఈ-పాస్ యంత్రాలను నిర్వాసిత గ్రామాల్లోకి తీసుకొచ్చి సరకులు, చంద్రన్న కానుకలు ఇచ్చేవిధంగా చర్యలు చేపట్టారు. మెట్టూరు, గూనబద్ర నిర్వాసిత కాలనీల్లోని హిరమండలం మండలంలోని పలు గ్రామాలకు చెందిన కార్డుదారులకు గురువారం చంద్రన్న సంక్రాంతి కానుకలు, నిత్యావసర సరకులు అందించారు. దీనిని పక్కాగా అమలు చేస్తే కొంత మేరకు నిత్యావసర సరకులకు సంబంధించిన ఇబ్బందులు తీరనున్నాయి.

# ఆదిత్యునికి విరాళాలు

అరసవల్లి, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామి వారికి శ్రీకాకుళం నగరానికి చెందిన కొంచాడ రమేష్‌బాబు, ఎస్.శ్రీనివాసరాజు రూ.లక్ష చొప్పున విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఈవో శ్యామలాదేవి, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలకు ఈ విరాళాలను అందించారు. ఆలయంలో స్టీల్ క్యూలైన్లు ఏర్పాటు చేసేందుకు విరాళాన్ని వినియోగించాలని రమేష్ కోరగా.. అన్నదానం కోసం శ్రీనివాసరాజు విరాళమిచ్చారు. కార్యక్రమాల్లో గుడ్ల కొండబాబు, తెన్నేటి విక్రమ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



విరాళాలను అందిస్తున్న రమేష్, శ్రీనివాసరాజు

## తాగునీటి బోరు... స్నానాల గది అయ్యింది చూడరూ..!



మందస మండలంలోని కొండలోగాం పంచాయతీ చాపరాయి వీధిలో ఉన్న ప్రభుత్వ బోరును అక్కడి స్థానికులు స్నానపు గదిగా మార్చేశారు. తాగునీటి వనరుగా ఉపయోగపడే బోరు ఆరు నెలల క్రితమే పాడైంది. దాన్ని బాగు చేయకుండా అలా వదిలేయడంతో ఆ గ్రామానికి చెందిన ఓ గిరిజన కుటుంబం ఆ బోరుకు చెందిన సిమెంటు సప్టా చుట్టూ చీరలు చుట్టి దాన్ని స్నానపు గదిగా వినియోగించుకుంటున్నారు. **-న్యూస్‌టుడే, కొండలోగాం (మందస)**

## కవ్వళ్లు... కనువిందు

వజ్రపుకొత్తూరు మండలంలోని మంచినీళ్లపేటలో గురువారం నాటు తెప్పలపై వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు భారీగా కవ్వళ్లు(కలవలు) చేపలు చిక్కాయి. మోతాదుకు మించి చేపలు వలలో పడడం, అన్నీ పచ్చివి కావడంతో అమ్మకానికి ఇబ్బందిగా ఉంటుందని వాటిని ఎండబెట్టి అమ్మితే మంచి ధర పలుకుతుందని భావించిన స్థానిక మత్స్యకారులు ఇదిగో ఇలా తీరం ఇసుకలో ఆరబెట్టారు. ఈ చేపలు ఎండిన తర్వాత కిలో రూ.100 వరకు అమ్ముతామని మత్స్యకారులు చెబుతున్నారు. తీరం వెంబడి 100 మీటర్ల పొడవున కవ్వళ్లను ఎండలో ఆరబెట్టడంతో కనుచూపు మేర చేపలు కనువిందు చేస్తున్నాయి.

**-న్యూస్‌టుడే, ఎంఎన్‌పేట(వజ్రపుకొత్తూరు గ్రామీణం)**



చిత్రావళి



## ప్రమాదాలకు దగ్గర దారి!

ఒక పక్క గూడ్సు రైలు వస్తుండగా, దాని పక్క నుంచే కొందరు ప్రమాదకరంగా తమ ద్విచక్రవాహనాలను తరలిస్తున్న ఈ దృశ్యం జలుమూరు మండలం తిలారు రైలు నిలయంలో గురువారం కనిపించింది. ఇక్కడ రైలునిలయానికి రైళ్లలో వచ్చిన తమ ద్విచక్ర వాహనాలను వాటి యజమానులు తమ గ్రామాలకు ఇలా తరలిస్తుండడం గమనార్హం. రైలు నిలయంలోని ప్లాట్‌ఫాం ముందున ఉన్న పక్కా రహదారి మీదుగా ప్రయాణిస్తే దూరమని భావించిన వీరు దూరం తగ్గుతుందని ఇలా పట్టాల పక్క నుంచి ప్రమాదకర ప్రయాణం సాగించారు. ఎటువంటి ప్రమాదాలు జరగకముందే రైల్వేశాఖ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**- న్యూస్‌టుడే, కోటబొమ్మాళి**

## తవ్వకాలతో తంటాలు

కోటబొమ్మాళి రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో రహదారికిరువైపులా మురుగు కాలువల నిర్మాణానికి తవ్వకాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇళ్లు, దుకాణాలకు వెళ్లేందుకు మార్గం లేక ఎవరి వారే సొంత ఖర్చులతో మార్గాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇవన్నీ ఓ కొలిక్కి వస్తున్న దశలో మళ్లీ మురుగుకాలువల ముందు తవ్వకాలు చేపడుతుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్తపేట కూడలి సమీపంలోకి చేరుకునేసరికి విద్యుత్తు స్తంభాల పేరుతో 55 అడుగుల రహదారి తగ్గిపోవడం, ఓవైపు మురుగుకాలువ తవ్వకాలు, మరోవైపు కేబుల్ ఏర్పాటు పనుల పేరుతో జరుగుతున్న



తవ్వకాలతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చేసిన పనులే మళ్లీ మళ్లీ చేస్తుండడం, ముందస్తు ప్రణాళికలు లేవనేందుకు ఇక్కడ జరుగుతున్న పనులు, ప్రజలు పడుతున్న ట్రాఫిక్‌పరమైన ఇబ్బందులే తార్కాణం. **-న్యూస్‌టుడే, కొత్తపేట (కోటబొమ్మాళి)**

## మరుగుదొడ్లు ఇలా.. స్వచ్ఛభారత్ ఎలా?

స్వచ్ఛ భారత్‌లో భాగంగా మరుగుదొడ్లు నిర్మించుకోవాలని రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు ఓ పక్క చెబుతున్నారు. శత శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారులు మరొపక్క ఘోషిస్తున్నారు. అయితే నిర్మించినవి నిరుపయోగంగా ఉండటంతో నిధులు దుర్వినియోగమవుతున్నాయి. అందుకు ఉదాహరణగా ఎల్‌ఎన్‌పేట మండలం దబ్బపాడు గ్రామంలోని సామూహిక మరుగుదొడ్లను చెప్పుకోవచ్చు. 30 వరకు నిర్మించారు. అయితే ఇంతవరకు వినియోగంలోకి రాకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. అంతే కాకుండా ఆ మరుగుదొడ్ల వద్దనే గ్రామంలో చెత్త అంతా వేయడం విశేషం. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మించిన వాటిని వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

**-దబ్బపాడు(ఎల్‌ఎన్‌పేట), న్యూస్‌టుడే**





## రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక

**పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే:** జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో చెకుముకి రాష్ట్రస్థాయి పోటీలకు పాలకొండకు చెందిన ఎస్.తమ్మినాయుడు పాఠశాల విద్యార్థులు పి.సురేష్‌నాయుడు, ఎస్.హరిచందన్‌నాయుడు, పి.కావ్యసింధులు ఎంపికయ్యారు. ఈ నెల ఆరు నుంచి ఎనిమిది వరకు కర్నూలులో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమార్ తెలిపారు. గత నెలలో శ్రీకాకుళంలో జరిగిన జిల్లాస్థాయి చెకుముకి పరీక్షలో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు.

## బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు గమనిక

**శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే:** బీఎస్ఎన్ఎల్ ఇప్పటి వరకు అందిస్తున్న ఫ్రీ నైట్‌ఆఫర్ సమయాన్ని ఇకపై రాత్రి 10.30 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మార్పు చేసినట్లు బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పి.మహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని బీఎస్ఎన్ఎల్ ల్యాండ్‌లైను, బ్రాడ్‌బ్రాండ్ కాంబోప్లాన్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

## పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పెద్దదూగాం వద్ద రహదారి నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఈఈ కె.ఎం.వి.ప్రసాదరావు, తదితరులు

**పెద్దదూగాం (జలుమూరు), న్యూస్‌టుడే:** రహదారి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఈఈ కె.ఎం.వి.ప్రసాదరావు పేర్కొన్నారు. రాణా కూడలి నుంచి కరవంజ వరకు 3.38 కిలోమీటర్ల పొడవునా నాబార్డు నిధులు రూ.2.05 కోట్లతో నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీ లేదని, పక్కాగా నిర్మిస్తే పనులు ముందుకు సాగుతాయని, లేకుంటే నిలుపుదల చేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రహదారి నాణ్యతను పరిశీలించిన ఆయన వాటి నమూనాలను పరీక్షించి నిర్ధారిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ రామారావు, జేఈ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పేపరు మిల్లు ఆస్తుల వేలంపాట వాయిదా

**అక్కురాడ (జలుమూరు), న్యూస్‌టుడే:** జలుమూరు మండలం అక్కురాడ వద్ద ఉన్న శివసాగర్ (బయోగ్రీన్) పేపరు మిల్లు ఆస్తుల వేలంపాట కార్యక్రమం గురువారం వాయిదా పడింది. పేపరు మిల్లు యాజమాన్యం వాణిజ్య పన్నుల శాఖకు రూ.1.46 కోట్లు బకాయి పడిన నేపథ్యంలో నరసన్నపేట వాణిజ్య పన్నులశాఖ సహాయ కమిషనర్ అనుసూయ ఆధ్వర్యంలో అధికారులు గురు వారం వేలంపాట ఏర్పాటు చేశారు. అయితే పాటదారులెవరూ రాకపోవడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు వేసి చూసిన అధికారులు వెనుదిరిగారు. వేలం పాటకు ఎవరూ హాజరుకాలేదని, మరో 15 రోజుల్లో ప్రకటన ఇచ్చి వేలంపాట నిర్వహిస్తామని సహాయ కమిషనర్ అనసూయ తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగరం వాణిజ్యపన్నులశాఖ సహాయ కమిషనర్లు సోమశేఖర్, ప్రసాదరావు, కాశీబుగ్గ ఉపకమిషనర్ సత్యనారాయణ, సర్వే యరు చిన్నప్పన్న, వీఆర్వో నూకడు, తదితరులు పాల్గొన్నారు.



వేలంపాట వద్ద నిరీక్షిస్తున్న అధికారులు

## ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించండి



సభలో ప్రసంగిస్తున్న సంజీవరెడ్డి

**రామవరప్పాడు(విజయవాడ గ్రామీణం), న్యూస్‌టుడే :** తెలంగాణ రాష్ట్రం తరహాలో ఆంధ్రాలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏఎన్‌టీయూసీ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి కోరారు. గురువారం విజయవాడ శివారు రామవరప్పాడులోని సుభం కల్యాణ మండపంలో 13 జిల్లాలకు చెందిన ఏపీ ఎలక్ట్రసిటీ ఉద్యోగుల ఏపీఈఈఈ యూనియన్-327 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2018 కాలమానిని ఆవిష్కరించినట్లు ఏపీ ట్రాన్స్‌కో ప్రాంతీయ అధ్యక్షుడు శేఖర్ తెలిపారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ.. పనికితగిన వేతనం ఇవ్వాలని కోరారు. ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాడలని డిమాండ్ చేశారు. జీపీఎఫ్ పింఛన్ విషయమై పోరాడతామని చెప్పారు. 13 జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాలమానిని ఆవిష్కరించారు. వాటితోపాటు డైరీలను అందరికీ అందజేశారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఎడ్వైజర్ కె.రంగనాథం, ఎస్ఈ ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలచంద్రబాబు పాల్గొన్నారు.

# అభివృద్ధి మంత్రం.. స్వచ్ఛతే లక్ష్యం

● వంశధార - బాహుదా నదులు అనుసంధానిస్తాం ● ఒడిశా సరిహద్దు వరకు సాగు, తాగునీరు
● ఇచ్ఛాపురం అభివృద్ధికి రూ.40కోట్లు ● 'జన్మభూమి - మాఊరు' సభలో ముఖ్యమంత్రి వరాలు

సోంపేట, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే

శ్రీకాకుళం జిల్లాలో నదుల అనుసంధానంతో కొత్తగా మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. హిరమండలం జలాశయం నుంచి వంశధారను నాగావళితో అనుసంధానించే పనులు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం వంశధార - బాహుదా నదుల అనుసంధానాన్ని చేపట్టి ఒడిశా సరిహద్దు వరకు సాగుకు నికరజలాలు అందిస్తానని బాబు ప్రకటించారు. భావనపాడు ఓడరేవు నిర్మాణం సహా, పోర్టు కళింగపట్నంలో రిసార్ట్స్, పర్యాటక జెట్టీలతో జిల్లాను పర్యటక రంగంలో కొత్త పుంతలు తొక్కించనున్నట్లు వెల్లడించారు. ఇచ్ఛాపురం శాసనసభ్యులు బెందాళం అశోక్ చేసిన విజ్ఞాపనల మేరకు ఇచ్ఛాపురం పట్టణానికి రూ.40కోట్ల వరాలు ప్రకటించారు. వీలైనంత త్వరలోనే ట్రిపుల్ ఐటీ తరగతులను శ్రీకాకుళంలో నిర్వహించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటానని బాబు వెల్లడించారు. 2018లో జిల్లాను అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తానని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. హిరమండలం జలాశయం నుంచి వంశధారపై వయోడెక్ట్ నిర్మించి ఇచ్ఛాపురం వరకు సాగునీరు తెచ్చేందుకు ఇప్పటికే డీపీఆర్ రూపకల్పనకు రూ.2కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. డీపీఆర్ రూపొందించిన వెంటనే అంచనాలు రూపొందించి పాలనాపరమైన మంజూరు చేస్తానన్నారు. భావనపాడు ఓడరేవు నిర్మాణం పూర్తయితే జిల్లా పారిశ్రామికంగా పురోభివృద్ధిలో పయనిస్తుందన్నారు. ఉద్దానం కిడ్నీ బాధితులకు రూ.2,500 వంతున పింఛన్లు ఇస్తున్నామని, ఏడు ఆర్వో ప్లాంట్లు నిర్మించామని చెప్పారు. వారికి మందుల కోసం రూ.10కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అరసవిల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఓ కమిటీని రూపకల్పన చేశామన్నారు. కిడ్నీ బాధితులు తాగేందుకు వంశధార నీరందించనున్నట్లు చెప్పారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు రూ.466 కోట్లు ఇచ్చామని గుర్తుచేశారు. తీర ప్రాంతంలో మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేకంగా శీతల గిడ్డంగులు నిర్మించి చేపలను నిల్వ చేసుకోడానికి వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఇచ్ఛాపురం తెదేపాకు కంచుకోట అని ఇక్కడి ప్రజలు ఎప్పుడూ తెదేపానే గెలిపిస్తూ వచ్చారని ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఒడిశా నుంచి వచ్చేవారికి ఇచ్ఛాపురం గేట్‌వే అవుతుందని దీన్ని నిర్మాణానికి నిధులు మంజూరుచేస్తానని ప్రకటించారు. మురుగునీటిపారుదలకు రూ.7కోట్లు, రోడ్లకు రూ.6కోట్లు, కంపోస్టు, పార్కు వంటి నిర్మాణాలకు మొత్తం రూ.40కోట్లు మంజూరుచేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు.


వేదికపై ముఖ్యమంత్రితో మంత్రులు, ఎమ్మెల్యే, అధికారులు, ప్రముఖులు


స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధిస్తామని ప్రతిజ్ఞ చేస్తూ...

## ఆకట్టుకున్న విద్యార్థిని ప్రసంగం

సోంపేట, న్యూస్‌టుడే : నాలాంటి వారి భవిష్యత్తు కోసం రోజుకు 20 గంటలు పనిచేస్తున్న మిమ్మల్ని భారతదేశ ప్రధానిగా చూడాలని ఉందని, తప్పకుండా మా ఆశ నెరవేరుతుందని లాబాల ఇంద్రాని అనే ఎనిమిదేళ్ల బాలిక ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి మాట్లాడుతూ సభికులను ఆకట్టుకుంది. ఆ మాటలు విన్న చంద్రబాబు తనకు ప్రధాని పదవి వద్దని సైగలు చేసి తెలిపారు. గురువారం ఇచ్ఛాపురం జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో మాట్లాడిన ఇంద్రాని అందరి భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎల్లప్పుడూ రుణపడి ఉండాలని పిలుపునిచ్చింది. నవ్యాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి అందరూ సాయంచేయాలని ఆమె కోరింది. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి అంతా బాసటగా నిలవాలని ఇంద్రాని ఉత్సాహభరితంగా చేసిన ప్రసంగం సభికులతో పాటు, ప్రముఖులను ఆకర్షించింది.


ఇంద్రాణిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి



## ● ముఖ్యమంత్రి పర్యటనలో పదనిసలు ●

● నిర్ణీత సమయానికన్నా ముందే ఇచ్ఛాపురం చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. అనుకున్న షెడ్యూల్ ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.50 గంటలకు హెలీక్యాప్టర్‌లో చేరుకోవాలి. కానీ పది నిముషాల ముందే ఇచ్ఛాపురం చేరుకున్న ముఖ్యమంత్రి ఇటు అధికారులను, అటు ప్రజాప్రతినిధులను పరుగులు పెట్టించారు.

● ముఖ్యమంత్రికి స్వాగతం పలికినవారిలో మంత్రులు అచ్చెన్నాయుడు, కళావెంకటరావు, శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు గౌతు శిరీష, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డా.బెందాళం అశోక్, జడ్పీ అధ్యక్షురాలు చౌదరి ధనలక్ష్మి ఉన్నారు. వీరిలో అశోక్, ధనలక్ష్మిలు సీఎం పాదాభివందనం చేశారు.

● తొలుత ప్రార్థనా గీతాన్ని ఆలపిస్తారని సభానిర్వాహక అధికారులు ప్రకటించారు. అది గమనించని మంత్రి కళావెంకటరావు మాట్లాడేందుకు ఉద్యుక్తుడవుతుండగా, ముఖ్యమంత్రి వారించి, ప్రార్థన విషయాన్ని వివరించారు.

● ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలను ముఖ్యమంత్రి వివరిస్తున్నపుడు సభికుల నుంచి ముఖ్యంగా మహిళలు, యువకుల నుంచి మంచి స్పందన వచ్చింది. చేతిలోని జెండాలను ఊపుతూ, ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు.

● సభలో మాట్లాడిన విద్యార్థినులు లాబాల ఇంద్రాణి, రిషికలు ముఖ్యమంత్రిని ఆకట్టుకున్నారు. రాష్ట్ర ప్రజల అభిమానాన్ని చూరగొన్న ముఖ్యమంత్రి ఏదో ఒకరోజు దేశానికి ప్రధాని కాగలరని ఇంద్రాణి చెప్పగా, వేదికపై ఉన్న వారంతా చప్పట్లు కొట్టారు.

● సభకు ఊహించిన దానికన్నా ఎక్కువమంది తరలిరావడం, వచ్చినవారు సుదీర్ఘ ప్రసంగాన్ని ఆసాంతం వినడం, స్పందించడం గమనించిన పార్టీ వర్గాలకు ఉత్సాహం వచ్చింది.

● ఈ గ్రామసభ సందర్భంగా ఏర్పాటుచేసిన వివిధశాఖల విభాగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంక్రాంతి శోభను కనిపించేలా ఇక్కడ గంగిరెద్దుల ఆటలు, సంప్రదాయ ఆటలు, రైతుల విజయసూచికగా కొత్తవరివంగడాల నుంచి మంచి దిగుబడిన సాధించిన వైనాలను ప్రదర్శనగా ఉంచారు. మహిళలు సభాప్రాంగణం అంతా రంగవల్లికలతో తీర్చిదిద్దారు.

● పలువురు మహిళలు, విద్యార్థులు 'జై జన్మభూమి... మాఊరు', నారా చంద్రబాబునాయుడుకు జై అనే పదాలను ఒక్కో ప్లకార్డుపై ఒక్కో అక్షరం పేర్చి, మాలగా పదాలను ప్రదర్శించారు.

● రైతు రథాలను అందించిన తరువాత ఆయా ట్రాక్టర్లపై కూర్చొని ముఖ్యమంత్రి ప్రజలకు అభివాదం చేశారు.

● జిల్లా కలెక్టరు తన ప్రసంగంలో జిల్లా అభివృద్ధిని వివరించారు. స్వచ్ఛతే సేవలోనూ మంచిస్థానాన్ని సాధిస్తామని ముఖ్యమంత్రికి హామీ ఇవ్వడం విశేషం.

సభకు వస్తున్న విద్యార్థులు


రైతులతో..


శ్రీకాంత్ నాట్య బృందాన్ని అభినందిస్తున్న ముఖ్యమంత్రి


స్టాళ్లను పరిశీలిస్తూ...


ఆకట్టుకున్న వ్యవసాయశాఖ స్టాల్


సీఎంతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్న, ఎమ్మెల్యే అశోక్


మాట్లాడుతున్న మహిళా సంఘాల సభ్యులు


మహిళా సమాఖ్య సభ్యులకు రూ.108 కోట్ల చెక్కును అందిస్తూ....


బీసీ సంఘాలకు..


ఎస్సీ లబ్ధిదారులకు చెక్కు అందిస్తూ...



ముఖ్యమంత్రికి చేతులు ఊపుతూ అభివాదం తెలుపుతున్న అయ్యప్పస్వామి మాలధారులు


రైతు రథంపై సీఎం


అధికారులతో సమీక్షిస్తూ...


వాలీబాల్ ఆటతో సంప్రదాయ క్రీడలను ప్రారంభిస్తూ...


మహిళలతో కోలాటమాడుతూ...


సభకు వస్తున్న జనం


పాఠశాలలో నుంచి పిల్లలు చేతులూపుతూ


హెలీకాప్టర్ రాకతో ఎగురుతున్న పక్షులు

# ఆదిత్య దర్శనం

● అరసవల్లి సూర్యనారాయణస్వామికి శుక్రవారం వేకువజామున 5 గంటలకు సుప్రభాత సేవ, అనంతరం ఉషఃకాలార్చన, మంత్రపుష్పం, బాలభోగం, నిత్యార్చనలు ఉదయం 6 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనం ● 7.30 నుంచి 11.30 గంటల వరకు ఆర్జిత సేవలు ● ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సూర్యనమస్కార సేవ ● స్వామి క్షేత్రపాలకులైన భువనేశ్వరీ సహిత రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, క్షీరాభిషేకం ● నవగ్రహ మంటపంలో నవగ్రహాలకు నిత్యార్చనతో పాటు చంద్రునికి ప్రత్యేక పూజలు, అర్చనలు ● మధ్యాహ్నం 12 గంటల నుంచి నిత్యాన్నదానం ● ఒంటి గంట నుంచి స్వామికి మహారాజ భోగం ● మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు స్వామి వారి పవళింపు సేవ ● సాయంత్రం 6 గంటలకు మంత్రపుష్పం, మహా హారతి ● రాత్రి 8 గంటలకు స్వామికి పవళింపు సేవ

–న్యూస్‌టుడే, అరసవల్లి

## శ్రీకూర్మంలో నేటి పూజలు

● శుక్రవారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, నిత్యాభిషేకం, నిత్యార్చన, ప్రాబోధిక, తిరువారాధన, మంగళాశాసనం, బాలభోగం, సర్వదర్శనం, ● మధ్యాహ్నం 12 గంటలకు రాజభోగం, సర్వదర్శనం, ● సాయంత్రం 7:30 గంటలకు నిత్య తిరువారాధన, మంగళాశాసనం, ● రాత్రి 8 గంటలకు పవళింపు సేవ

–న్యూస్‌టుడే, శ్రీకూర్మం (గార)

## శ్రీముఖలింగేశ్వర దర్శనం

శుక్రవారం వేకువజామున 4 గంటలకు సుప్రభాతసేవ, ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సర్వదర్శనం, ఆ సమయంలో శివపంచాయతన ఉన్న అమ్మవారికి సహస్ర కుంకుమార్చనలు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్నభోగం, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కవాటబంధనం, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వ దర్శనం, సాయంత్రం 5.30 గంటలకు నీరాజనం, సాయంత్రం 6 గంటల నుంచి లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, క్షీరాన్నభోగం, మంత్రపుష్పం, రాత్రి 8 గంటలకు పవళింపుసేవ.

–న్యూస్‌టుడే, శ్రీముఖలింగం (జలుమూరు)

## ఈటీవీలో ఈనాడు

**ఉదయం**

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: పనుల్లో ఆటంకాల నివారణకు గణపతిని ఎలా పూజించాలి? రైతులకు లాభాన్నిచ్చే వ్యవసాయ వాస్తు నియమాలు.. 8-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: లాహిరి లాహిరి లాహిరిలో.. (హరికృష్ణ, భానుప్రియ).

**మధ్యాహ్నం**

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'రాజ్‌మా ఆనపకాయకుర్మా', మీ చేతి వంట 'సోయాకాజూకర్రీ', 'వెజ్ కోకోనట్ పలావు', జస్ట్ ఎ మినిట్ 'చిక్కుడు గింజల ఛాట్' తయారుచేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

**సాయంత్రం**

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: సైసై సయ్యారే (రిపీట్), 06-00: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్)

**రాత్రి**

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్: 100% కామెడీ షో, 10-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సాటైం...

## ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 నేను..తను రిపీట్
01:15 ప్రేమిస్తే చుక్కలు చూపిస్తా రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామా
03:30 పటాస్ పంచెస్

సాయంత్రం

04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామా
08:00 క్రిరాక్ కిడ్స్
09:00 పటాస్
09:30 డీజే
09:45 స్టే..పూలిష్
10:00 ఈ-జంక్షన్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

## ఈటీవీ లైఫ్

★ మానస – (ఉ.6:00, రా. 11:30)
★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా. 10:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.6:30, రా.10:00)
★ అమృతం: తృణ ధాన్యాలు (ఉ.8:00, మ.12:30, రా.8:00)
★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.01:00, రా.8:30)
★ కౌంట్ యువర్ కేలరీస్ (మ.1:30)
★ జీవనరేఖ చైల్డ్ కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా ? (ఉ.9:30)
★ హోమియో – మోనోపాజ్ కంటే ముందు నొప్పులు (మ.2:00, రా.7:00)
★ సుఖజీవనం (ఉ.10:00)
★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (మ.2:30, రా.9:30)
★ ఆరోగ్యమస్తు – 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (ఉ.10:30)
★ ఆరోగ్యమస్తు – 1. పొడిబారిన కళ్ళు - తీసుకోవలసిన జాగ్రత్తలు, 2. మన శరీరం మీద మద్యం ప్రభావం, 3. అల్లం తీసుకోవడం ఎప్పుడు మంచిది కాదు (మ.3:00, రా.9:00)
★ డా. ఈటీవీ – అజీర్తి సమస్యలు (ఉ.11:00)
★ డా. ఈటీవీ – జనరల్ హెల్త్ (ఉ.11:15)
★ డా. ఈటీవీ – శ్వాసకోశ సమస్యలు (మ.3:30, రా. 7:30)
★ డా. ఈటీవీ – ఎముక ఆరోగ్యం - కీళ్లవాతం (మ. 3:45, రా. 7:45).

## ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలీషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: మోసగాడు, (శోభన్‌బాబు, శ్రీదేవి) 10-00: మార్నింగ్ షో: భలే అబ్బాయిలు (కృష్ణ, కె.ఆర్.విజయ), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: ధర్మక్షేత్రం (బాలకృష్ణ, దివ్యభారతి), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ముసుగుదొంగ, (సుమన్, భానుప్రియ), రాత్రి: 7-00: ఫస్ట్ షో: పెద్దకొడుకు (శోభన్‌బాబు, కాంచన), 10-00: సెకండ్ షో: 47 రోజులు (చిరంజీవి, జయప్రద).

## ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలిచెనా బొరుగుల ఉప్మా & పచ్చిమిర్చి మొక్కజొన్న మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలి శెనగల పుదీనా బ్రౌన్ రైస్ & క్యారెట్ కీన్వా మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్డ్ వెజ్ సాగూ, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - మిక్స్డ్ దాల్ మిల్లెట్ కిచిడి, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - మిక్స్డ్ గ్రీన్ ఓట్స్ కబాబ్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - చెట్టినాడ్ ఎగ్ కర్రీ & చెట్టినాడ్ ఎగ్ దోస, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - పంచ్ ఖద్యా, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చిల్లీ ఛీజ్ ఫ్రైస్, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ - రైస్ సేమ్యా చికెన్ బిర్యాని, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - స్వీట్ కార్న్ బంగాళదుంప బేల్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ కట్‌లెట్ & చికెన్ కోకోనట్ మిల్క్ బనానా ఫ్లవర్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) ఎండురొయ్యల పొట్టు కూర, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - తలకాయ కూర & షికమ్ పూరీ కబాబ్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - కోకోనట్ ఫింగర్స్, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - వెల్లుల్లి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: మా ఊరి రుచులు - గ్రీన్ చిల్లీ చికెన్ & బ్రెడ్ గులాబ్ జామున్.

## ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ మహాలక్ష్మి ఆలయం, చిట్టినగర్, విజయవాడ, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

## ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సంతోషిమాతా ఆలయం, సూర్యాపేట, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

## ఏ ఛానల్లో ఏముంది.. 05-01-2018

**ఎస్వీబీసీ:** **ఉదయం:** 05-30 తిరుప్పావై + గోదాస్తుతి, 06-30 తిరుప్పావై + గోదాస్తుతి + నిత్యపూజలివిగో, 07-00 విష్ణుసహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు - (అభిషేకం), 08-00 శతమానంభవతి, 08-30 లైవ్ డయల్ యువర్ ఈ.ఓ., 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కళ్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్రనామామృతం, లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జితబ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 లైవ్ శ్రీ పద్మావతి అమ్మవారి అభిషేకం, **సాయంత్రం:** 04-00 శ్రీ లలితా సహస్రనామస్తోత్ర పారాయణం, 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి సేవ - తిరుమల + స్పెషల్ న్యూస్ + లైవ్ ఎస్.డి. సేవ తిరుచానూరు, - తిరుచానూరు, 06-00 ఎస్.డి. సేవ - తిరుచానూరు, 06-30 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం +శ్రీనివాస గద్యం + అలివేలుమంగ నామావళి 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు, భక్తుల అనుభవాలు, 08-30 మల్లిఖార్జున సుప్రభాతం - శ్రీ చాగంటి, 09-00 ఆలయదర్శనం, 09-30 శివమహాపురాణం - శ్రీ సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు.

**భక్తి TV:** **ఉదయం:** 06-00 శ్రీలక్ష్మీ సహస్రం 6-30 శ్రీకనకధారస్తోత్రం, 7-00 అర్చన, 7-30 శ్రీలలితా సహస్రం 08-00 పుణ్యక్షేత్రం, 08-30 జ్యోతిస్వరూపా అయ్యప్ప 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మ సందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రీకనకధార స్తోత్రం, 05-30 శ్రీలలితాసహస్రం, 6-00 శ్రీ లక్ష్మీసహస్రం, **రాత్రి:** 7-00 భక్తి విశేషాలు 7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగద్గీత 9-00 త్యాగయ్య (డాక్యుమెంటరీ), 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11.00 గోదామృతం.

**జీ తెలుగు:** **ఉదయం:** 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్ 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: కొత్తబంగారులోకం, 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం, 03-30 కల్యాణ వైభోగం, **సాయంత్రం:** 04-00 కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్), 11-00 కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా (రిపీట్).

**మా:** **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం (రిపీట్), 02-30 సినిమా: మల్లన్న, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్ర బంధం, 10-00 నీలికలువలు, 10-30 సినిమా: సింహా.

**జెమిని:** **ఉదయం:** 06-30 శ్రీ కరుణామయి దేవీ వైభవం, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం, 08-30 సినిమా: పెళ్లైన కొత్తలో, 11-30 నాగిని, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ 12-30 చక్రవాకం, 01-00 నందిని, 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: శంఖం, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: పెళ్లైన కొత్తలో...

**HBO:** **ఉదయం:** 06-00 ది నేక్డ్ గన్ : ఫ్రం ద ఫైల్స్ ఆఫ్ పోలీస్ స్క్వాడ్, 07-01 ఇన్‌సెప్షన్, 09-42 జాక్ ద జయంట్ స్లేయర్, 11-46 మడగాస్కర్, **మధ్యాహ్నం:** 01-14 బ్యాట్‌మేన్ × సూపర్‌మేన్ : డాన్ ఆఫ్ జస్టిస్, 03-58 ది అకౌంటెంట్, **సాయంత్రం:** 06-11 ట్రాన్స్‌ఫార్మర్స్ : డార్క్ ఆఫ్ ది మూన్, **రాత్రి:** 09-00 స్పూక్స్: ది గ్రేటర్ గుడ్.



# నువ్వు సాగులో జాగ్రత్తలు



వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటి తడులతో సాగుచేసే పంటలలో నువ్వు పంట ప్రధానమైనది. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో నువ్వులను విత్తుకుని తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో అధిక రాబడి పొందేందుకు ఈ పంట ఉపకరిస్తుంది. కాగా నువ్వులో వచ్చే తెగుళ్లు, వాటి నివారణ పద్ధతులను పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ అధికారులు వివరించారు.

**ఆకుమచ్చ తెగులు:** గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాపిస్తుంది. ఆల్టర్నేరియా అనే శిలీంధ్రం వల్ల ఆకులు, కాండం, కాయల మీద గోధుమరంగు మచ్చలు కనిపిస్తాయి. ముదురు గోధుమరంగు చిన్న చిన్న వలయాకారపు మచ్చలు ఆకంతా వ్యాపించి ఆకులు ఎండి రాలిపోతాయి. దీని నివారణకు కిలో విత్తనాలకు 2 గ్రాములు కార్బండిజంతో విత్తనశుద్ధి చేసుకుని విత్తుకోవాలి. పంట దశలో ఈ తెగులు కనిపిస్తే 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా ఒక గ్రాము కార్బండిజమ్‌ను లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారీ చేయాలి.

**బూడిద తెగులు:** ఈ తెగులు ఎరిసెఫె అనే శిలీంధ్రం వల్ల సోకుతుంది. లేత ఆకులపై తెల్లటి బూడిదతో కూడిన మచ్చలు ఏర్పడతాయి. తెగులు ఆశించిన ఆకులు పసుపు వర్ణంలోకి మారి రాలిపోతాయి. నివారణకు లీటరు నీటికి 3 గ్రాములు నీటిలో కరిగే గంధకం పొడి కలిపి ఆకులు తడిచేటట్లు పిచికారీ చేయాలి.

**వెర్రి తెగులు:** ఈ తెగులు పూత సమయంలో ఆశిస్తుంది. ఇది సోకిన మొక్కల్లో ఆకులు చిన్నవిగా మారి పువ్వులోని భాగాలన్నీ ఆకుల మాదిరిగా రాలిపోయి కాయలు ఏర్పడవు. దీపపు పురుగుల ద్వారా ఒక మొక్క నుంచి ఇంకొక మొక్కకు వ్యాధి వ్యాప్తి చెందుతుంది. నివారణకు తెగులును తట్టుకునే చందన, హిమ రకాలను ఎంపిక చేసుకోవాలి. తెగులు సోకిన మొక్కలను పీకి తగులబెట్టాలి. దీపపు పురుగుల నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. డైమిథోయేట్ కలిపి పిచికారీ చేయాలి.

**వేరు, కాండంకుళ్లు తెగులు:** ఇది సోకిన మొక్కలు పసుపు వర్ణంలోకి మారి కాండం మీద నల్లని చారలు కనిపిస్తాయి. వేర్లు కూడా కుళ్లిపోతాయి. ఈ తెగులును కలుగచేసే శిలీంధ్రం భూమిలో, విత్తనాలు, పంట అవశేషాలపై జీవిస్తుంది. నివారణకు పంటమార్పిడి పద్ధతి పాటించాలి. పంట అవశేషాలను కాల్చివేయాలి. కిలో విత్తనాలకు 3 గ్రా. కాప్టాన్, 3 గ్రా. మాంకోజెబ్ కలిపి శుద్ధిచేసి విత్తుకోవాలి. లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ కలిపి మొక్కల మొదళ్లు తడపాలి.

– న్యూస్‌టుడే, జీలుగుమిల్లి

# ఆరుతడి పైర్లలో సూక్ష్మనీటి పద్ధతులు

ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యం తక్కువగా ఉంది. వినియోగించే నీటిలో దాదాపు 60-70 శాతం వృథా అవుతోంది. దీనివల్ల సాగునీటి వృథా, భూసారం క్షీణించడం వంటి సమస్యలు వస్తున్నాయి. అధునాతన నీటి పారుదల విధానాలైన బిందు, తుంపర్ల సేద్య పద్ధతుల వల్ల దిగుబడి పెరగడమే గాకుండా, నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

నీరు ఎక్కువగా లభ్యమయ్యే చోట ఆ నీటిని విచ్చలవిడిగా వాడటం వల్ల సారవంతమైన భూములెన్నో చౌడు భూములుగా మారి పంటల దిగుబడి క్రమేణా తగ్గుతున్నాయి. నేలలు కోతకు గురవుతున్నాయి. ఆశించిన దిగుబడులు సాధించాలంటే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలి. నీటిని పెట్టిన మొదటి మూడు రోజులలో నేల లోపలి పొరలు నీటితో నిండిపోయి పొరలలో ఉన్న గాలి బయటికి వెళ్ళిపోతుంది. దీనివల్ల నేలలో సామర్థ్యం కంటే ఎక్కువ నీరు నిల్వ ఉంటుంది. మొక్కలకు కావల్సిన పోషకాలు భూమిలో ఉన్నా మొక్కలకు లభ్యం కావు. దీని వల్ల మొక్కల పెరుగుదల ఆగిపోతుంది. కానీ బిందు సేద్య పద్ధతిలో నీటిని ప్లాస్టిక్ గొట్టాలు, ఇతర పరికరాలతో బిందువుల రూపంలో అన్ని మొక్కలకు సమానంగా మొక్క వేరు భాగానికి కావల్సినంత అందించవచ్చు. ఈ విధానం ద్వారా భూమిలో ఎప్పుడు తేమ మాత్రమే ఉండేలా చేయవచ్చు.

★ మొక్కజొన్న జళ్ళు వేసేటప్పుడు, పాలు పోసుకునేటప్పుడు, గింజ గట్టిపడే సమయంలో నీరు చాలా అవసరం. వేసవిలో 7-10 రోజులకొకసారి నీటితడి ఇవ్వాలి.
★ వేరుశనగలో విత్తిన వెంటనే ఒకతడి, తరువాత 20-25 రోజులకు, ఆ తరువాత పూత, కాత దశలో ప్రతి 10-15 రోజులకు ఒక తడి ఇవ్వాలి.
★ పొద్దుతిరుగుడులో ఆశించిన దిగుబడులు సాధించాలంటే మొగ్గతొడిగే దశ, పువ్వు వికసించే దశ, గింజ కట్టే దశలలో నీటితడి అవసరం.
★ శనగ పంటలో విత్తిన 20-25 రోజులలో తడి ఇవ్వాలి. శనగ పంట ఎక్కువ నీటిని తట్టుకోదు. అవసరాన్ని బట్టి నీటి తడులు అందించాలి.

# ప్రయత్నం ఫలిస్తే.. వైద్యవిద్యకు మహర్దశే!



రిమ్స్ వైద్య కళాశాల

న్యూస్‌టుడే- గుజరాతీపేట (శ్రీకాకుళం)

రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) వైద్య కళాశాలలో వైద్యవిద్య పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) కోర్సుల రాకపై ఆశలు చిగురిస్తున్నాయి. డైరెక్టర్ ఎ.కృష్ణవేణి ఇటీవల వివిధ విభాగాల అధిపతులతో చర్చించారు. ఏడు విభాగాల్లో పీజీ కోర్సులకు అనుమతించాలని కోరుతూ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి దరఖాస్తు చేయనున్నారు. 2008లో ప్రారంభమైన వైద్యకళాశాలలో నేటికీ పీజీ కోర్సులు రాకపోవడంతో ఇక్కడ వైద్యవిద్య పూర్తి చేసిన వారు ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లోని వైద్య కళాశాలల్లో పీజీ చేస్తున్నారు. రిమ్స్‌లో పీజీ కోర్సులకు కోసం దరఖాస్తు చేయనుండటంతో ఆ సీట్లు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. రిమ్స్ నుంచి వచ్చిన ప్రతిపాదనలను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అధికారులు భారతీయ వైద్య మండలి (ఎంసీఐ)కి నివేదిస్తారు. అక్కడి నుంచి ఒక బృందం రిమ్స్‌కు వచ్చి.. అన్ని అంశాలను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉంటే ఆమోదం తెలుపుతారు.

### మౌలిక సదుపాయాలు కీలకం

పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్లు రావాలంటే రిమ్స్‌లో వాటికి తగ్గవిధంగా ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, నర్సింగ్ సిబ్బంది ఉండాలి. ఒక్కొక్క విభాగంలో ఎన్ని యూనిట్లు ఉన్నాయి, వాటికి తగ్గ మౌలిక సదుపాయాలు ఉన్నాయా? గ్రంథాలయం, తరగతి గదులు, సెమినార్ హాళ్లు, ప్రొఫెసర్‌కు సంబంధించి వ్యక్తిగత గదులు తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఆసుపత్రిలో పీజీ కోర్సులు కోరుతున్న విభాగాల్లో వైద్య పరికరాలు, సౌకర్యాలు, రోగులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు తదితర వాటిని పరిశీలిస్తారు. పరిశీలనకు వచ్చే బృందంలో మన రాష్ట్రం వారు కాకుండా దేశం మొత్తం మీద ఏ రాష్ట్రం నుంచైనా రావొచ్చు. ఎంసీఐ నిబంధనలకు అనుగుణంగా రిమ్స్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో సౌకర్యాలు ఉంటేనే వారు ఆమోదం తెలుపుతారు. లేదంటే ఇప్పుడు చేసిన కసరత్తు అంతా వృథా అవుతుంది.


### ఏడు విభాగాల్లో..

రిమ్స్ వైద్య కళాశాలలో ఆర్థోపెడిక్, మెడిసిన్, సర్జరీ, గైనిక్, అనస్థీషియా, పీడియాట్రిక్స్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్స్ తదితర వైద్య నిపుణులు ఉన్నారు. ఒక్కొక్క విభాగంలో ప్రొఫెసర్‌కు రెండు సీట్లు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు ఒక సీటు చొప్పున మూడు పీజీ సీట్ల నిర్వహణకు అనుమతిస్తారు. ఇలా చూస్తే కొన్ని విభాగాల్లో రెండు, నాలుగు యూనిట్లు కూడా ఉన్నాయి. ఎంసీఐ బృందం పరిశీలించి సంతృప్తి చెందితే కనీసం 21 నుంచి గరిష్ఠంగా 50 సీట్ల వరకు పీజీ సీట్లు కేటాయించేందుకు అవకాశం ఉంటుంది.

- రిమ్స్‌లో పీజీ సీట్లకు కసరత్తు
- ఏడు విభాగాల్లో 21 నుంచి 50 పీజీ సీట్లకు అవకాశం
- జులైలో రానున్న ఎంసీఐ బృందం
- ప్రతిపాదనలు పంపించనున్న అధికారులు

### త్వరితగతిన నిర్మాణాలు

రిమ్స్‌లో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న భవనాలను ఇటీవల జిల్లా కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేసి అందివ్వాలని.. లేదంటే సంబంధిత గుత్తేదారులను తప్పించి కొత్తవారితో చేయించడానికి వెనుకాడేది లేదని ఏపీహెచ్ఎంఐడీసీ అధికారులకు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కొత్త భవనాల నిర్మాణం పనులు జోరందుకుంటున్నాయి. రిమ్స్‌లో ప్రస్తుతం భవన నిర్మాణాలు వేగవంతం కావడం, ఇటీవలే మరో 50 ఎంబీబీఎస్ సీట్ల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ రూ. 60 కోట్లు విడుదల చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జులై నెలలో ఎంసీఐ బృందం పర్యటించే సమయానికి మౌలిక సదుపాయాలన్నీ కల్పించవచ్చనే సంకల్పంతో పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేయడానికి డైరెక్టర్ ముందడుగు వేస్తున్నారు.



రిమ్స్‌లో నిర్మిస్తున్న నూతన భవనాలు

### పీజీ సీట్లు వస్తే నిరంతరం వైద్యసేవలు



రిమ్స్‌కు పీజీ సీట్లు వస్తే ఆసుపత్రిలో మరింత ఉన్నతంగా వైద్యసేవలు అందించడానికి వీలుంటుంది. పీజీ చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వైద్య విద్యార్థులు నైపుణ్యం సాధించడానికి నిరంతరాయంగా వైద్య సేవలు అందిస్తారు. ఈ కారణంగా నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో రోగులకు మంచి వైద్య సేవలు అందుతాయి. గతంతో పోల్చుకుంటే రిమ్స్‌లో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తగినంత మంది ఉన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 7 నుంచి 13 బ్లాకులు దాదాపుగా పూర్తి కావచ్చింది. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ రిమ్స్‌ను అభివృద్ధి పథాన నిలపాలనే ఉక్కు సంకల్పంతో ఉన్నారు. ప్రస్తుతం రిమ్స్‌లో ఏడు విభాగాల్లో పూర్తిస్థాయి వైద్య బృందం ఉంది. దీనికి అనుగుణంగానే ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి దరఖాస్తు చేయడానికి అవసరమైన చర్యలు ప్రారంభించాం.

**-డాక్టర్ ఎ.కృష్ణవేణి, డైరెక్టర్, రిమ్స్**



మృతిచెందిన గోవింద

## మృత్యుపాశమైన తెగిపడిన తీగ

### విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

**లావేరు, న్యూస్‌టుడే** : మండలం బెజ్జిపురం పంచాయతీ బొంతుపేటకు చెందిన బొంతు గోవింద (50) గురువారం తెల్లవారు జామున విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు. బహిర్భూమికి వెళ్లేందుకు సమీప పత్తి పంట పొలంలోకి వెళ్తుండగా తెగిపడిన విద్యుత్తు తీగ తగలడంతో మృతిచెందాడు. సమీప పరిశ్రమకు విద్యుత్తు సరఫరా చేసే తీగ తెగిపడి ఉండడాన్ని గమనించకపోవడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సమాచారం తెలిసిన వెంటనే ఏఈ జె.సురేష్‌కుమార్ ఘటనా స్థలం వద్దకు చేరుకొని పరిశీలించారు. కండక్టర్ తీగ ఇన్సులేటర్ పగిలిపోవడంతో తీగ తెగిపడినట్లు గుర్తించారు. లావేరు ఎ.ఎస్.ఐ. కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గోవింద అవివాహితుడు, ఇతనికి తల్లి తవిటమ్మ ఉంది. కొడుకు మృతి చెందడంతో కన్నీరుమున్నీరైంది.

## అమ్మో..ఎంతపెద్ద కొండచిలువో

**జి.సిగడాం, న్యూస్‌టుడే** : గొబ్బూరు గ్రామంలో భారీ కొండచిలువను గ్రామస్థులు హతమార్చారు. గురువారం గ్రామానికి చెందిన పైడి శంకరరావు, రామప్పడులు సరుగుడు తోటలో కొండచిలువ తిరగడాన్ని గమనించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు చేరుకున్న గ్రామస్థులు కొండచిలువను కర్రలతో హతమార్చారు. భారీగా 15 అడుగుల పొడవు ఉండడంతో పామును చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చారు.



హతమైన కొండచిలువను చూపిస్తున్న దృశ్యం

## కారు ఆపిన వెంటనే మంటలు రేగాయి!

### ఎంపీపీ కారు దగ్ధం



పూర్తిగా దగ్ధమైన కారు

**జి.సిగడాం, న్యూస్‌టుడే** : జి.సిగడాం మండలం చంద్రయ్యపేట గ్రామ సమీపంలో ఎంపీపీ డొంక సూరీడమ్మ కారు ప్రమాదవశాత్తు పూర్తిగా దగ్ధమైంది. గురువారం జరిగిన ఈ ఘటనలో ఎంపీపీకి ఆమె భర్తకు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు చెప్పిన వివరాలు ప్రకారం.. ఎంపీపీ సూరీడమ్మ, భర్త సవరయ్య దేవరవలసలోని నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమం చూసుకొని కారులో ఇంటికి వెళ్తున్నారు. ఈ సమయంలో చంద్రయ్యపేట గ్రామ సమీపంలో రోడ్డుపై మినప చేను ఉండడంతో రైతుతో మాట్లాడేందుకు కారు దిగి రోడ్డు మీద ఉన్న పంటను తీయమని చెప్పేలోపు కారులో నుంచి పొగలు వ్యాప్తి చెంది ఒక్కసారిగా పెద్ద మంటలు రావడంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. మంటలు ఎగిసిపడడంతో దూరంగా పరుగులు తీశారు. ఊహించని ఘటనకు వారు భీతిల్లారు. ఈ అకస్మాత్తు ఘటనకు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో వారు ఉండిపోయారు. ఇంతలో కారు దగ్ధమైన విషయం తెలుసుకున్న మండల వాసులు ఉలిక్కిపడ్డారు. అధికారులు సంఘటన స్థలం వద్దకు చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. ఎంపీపీ భర్త సవరయ్య మాట్లాడుతూ రైతు వల్లే బతికున్నామని, లేకపోతే కారులోనే సజీవదహనం అయ్యేవారిమని ఆవేదన వ్యక్తం చేశారు. కారుకు ఎటువంటి మరమ్మతులు లేవని ఎలా మంటలు చెలరేగాయో తెలియడం లేదన్నారు.

## ఈమె ఎవరు?



మంబయిలో ఉన్న మహిళ

**రణస్థలం, న్యూస్‌టుడే** : ముంబయి మహానగరంలో గుర్తు తెలియని మహిళను ఓ స్వచ్ఛంద సంస్థ గుర్తించి సంరక్షించింది. వారు ఆమె వివరాలను ఆరా తీయగా తమది రణస్థలమని , శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తినని మరో దఫా చెబుతున్నారని పోలీసులకు సమాచారం అందిందనిఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహిళ రణస్థలానికి చెందిన వ్యక్తిగా చెబుతున్నారని, ఈమెకు సంబంధించిన వారెవరైనా ఉంటే తమను సంప్రదించాలని ఎస్సై కోరారు.

## ఒడిశాలో ప్రమాదం: జిల్లావాసి మృతి

**పర్లాఖిముండి, గుసాని, న్యూస్‌టుడే:** గుసాని సమితి పాటికోట సమీపంలో బుధవారం మోటారుసైకిల్ అదుపు తప్పి పడిపోవడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మండలం ధన్నుపురం గ్రామానికి చెందిన ఎం.ఆనందరావు(50) ఉప్పలాడ నుంచి వస్తుండగా పాటికోట సమీపంలో కుక్క రోడ్డుపై అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించటానికి ప్రయత్నించి ఆనందరావు అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం తగలటంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్.ఐ. నరసింహాచరణ్ పట్నాయక్ ఆధ్వర్యంలో గురండి పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహిత ఆత్మహత్యాయత్నం

**రాజాం, న్యూస్‌టుడే:** రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన మడ్డు పద్మ గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రాజాం హెచ్‌సీ ఎం.గోవిందరాజు తెలిపిన వివరాలు ప్రకారం.. పెనుబాక గ్రామానికి చెందిన పద్మకు బొద్దాం గ్రామానికి చెందిన మేనమామ కొడుకు తాపీ మేస్త్రీ హరితో అయిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. పెళ్లైన నాటి నుంచి తమకు ఏదీ కలిసి రావడం లేదని భర్త హరి వేధింపులకు పాల్పడేవారు. బాధితురాలితోపాటు పిల్లలకు ఆరోగ్యం బాగోలేక పోయినా ఆసుపత్రికి తీసుకెళ్లేవాడు కాదని , గత ఆరుమాసాలుగా ఆరోగ్యం దెబ్బతినగా మూడు రోజుల నుంచి పరిస్థితి మరింత చేదాటింది. ఆసుపత్రికి తీసుకెళ్లాలని కోరినా భర్త స్పందించక పోవడంతో తాను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని గురువారం ఉదయం హెచ్చరించింది. అయినా భర్త స్పందించలేదు. చస్తే చావు అంటూ భవన నిర్మాణ పనులకు వెళ్లిపోయాడు. భర్త వెళ్లిన తరువాత పద్మ పురుగుల మందు తాగేసింది. తరువాత భర్తకు ఫోను చేసి తాను పురుగుల మందు తాగేసినట్లు చెప్పింది. ఈమాటలు విన్న స్థానికులు పెనుబాకలోని పద్మ కన్నవారికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన వచ్చి రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితురాలు అక్కడే చికిత్స పొందుతోంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త హరి, అత్త ఆదిలక్ష్మి, మరుదులు ఆదినారాయణ, నరసింగరావులపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

## ఆటోను ఢీకొన్న చెరకు లారీ

### పలువురికి గాయాలు



బోల్తా పడిన ఆటో

**రాజాం, న్యూస్‌టుడే:** రాజాం పట్టంలోని శ్రీకాకుళం రహదారిలో వాసవినగర్ సమీపంలో గురువారం రాత్రి రాజాం వైపు వస్తున్న చెరకు లారీ పొందూరు వెపు వెళ్తున్న ఆటోను ఢీకొంది. అంతే ఒక్కసారిగా ఆటో రహదారిపై బోల్తా పడింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో డ్రైవర్‌తో సహా 12 మంది ప్రయాణిస్తున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వీరిలో సుమారు పది మందికి గాయాలయ్యాయి. రాజాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంతకవిటి మండలం మిర్తివలస గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు రాజాం నగపంచాయతీ పరిధిలోని పొనుగుటివలసలో వరి నూర్పునకు వచ్చారు. పని ముగించుకొని గురువారం రాత్రి ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా ఈప్రమాదం జరిగింది. ఇందులో మిర్తివలస గ్రామానికి చెందిన కె.లక్ష్మి, జి.కల్యాణి, డి.మంగమ్మ, పి.తవిటమ్మ, ఆర్.మంగమ్మ, వై.సింహాచలం, ఎ.నారాయుడు, జి.చిన్నమ్మడు, లావేటి పార్వతిలకు గాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన 108 వాహనంలో రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యాధికారి వాసుదేవరావు వీరికి వైద్య సేవలు అందించారు. వీరిలో లావేటి పార్వతి పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించాలని సూచించడంతో ఆమెను తరలించారు. రాజాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

# అడిగినా...తిరిగినా లేనేలేవ్



ఆమదాలవలసలో మూతపడ్డ స్టేట్ బ్యాంకు ఏటీఎం

**(మొదటిపేజీ తరువాయి)** అని చెప్పేస్తున్నాయి. ఖాతాల్లో వేలాది రూపాయలు ఉంటున్నా అవి చేతికి రావడానికి ఆపసోపాలు పడాల్సిన పరిస్థితిని ఖాతాదారులు, ప్రజలు ఎదుర్కొంటున్నారు. బ్యాంకులకు వెళ్లినా అత్యధిక శాఖల్లో కేవలం రూ.100 నోట్లు మాత్రమే ఇస్తుండగా, కొన్నింటిలో అయితే రూ.20, రూ.10ల నోట్లు మాత్రమే చేతికందిస్తున్నారు. చివరికి పెద్దనోట్లు కోసం సిబ్బందితో పైరవీలు చేయాల్సిన పరిస్థితులూ కొన్ని బ్యాంకుల వద్ద తారసపడుతున్నట్లు సమాచారం.

## ఇప్పుడే అవసరమని తెలిసినా

ప్రస్తుత రోజుల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులకు, పింఛనుదారులకు సైతం నిర్దేశించిన నగదును బ్యాంకు ఖాతాల్లోనే జమచేస్తున్నారు. నెల ప్రారంభంలో సహజంగా ఈ వర్గాల ప్రజల ఒత్తిడి ఏటీఎంలు, బ్యాంకులపై ఉంటుంది. దీనిని ముందుగానే గమనించి ఆ మేరకు నగదును అందుబాటులో ఉంచాల్సిన బ్యాంకు అధికారులు కార్యాచరణలో వైఫల్యం చెందుతున్నారు. దీంతో నెల ప్రారంభంలో ఇంటి అద్దెలు, నిత్యావసర సరకుల కొనుగోళ్లకు ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. పెద్దనోట్లు రద్దు తరువాతి రోజుల్లో నెలకొన్న పరిస్థితులే దాదాపు ప్రస్తుతం కొనసాగుతున్నాయని చాలా మంది వాపోతున్నారు. జిల్లాలో 31 బ్యాంకుల పరిధిలో 310 వరకు శాఖలు, 300కుపైగా ఏటీఎంలు కొనసాగుతున్నాయి. ఏటీఎంల వినియోగంలోకి లావాదేవీలు వాటి ద్వారానే ఎక్కువ సాగాలంటున్న బ్యాంకు వర్గాలు నగదు అందుబాటు విషయంలో మాత్రం తాత్సారం చేస్తున్నాయి. ఈ అంశంపై తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తూ నగదు వచ్చే ఏటీఎంల కోసం తిరగాల్సిన పరిస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నారు. కొంతమంది సంక్రాంతి కుటుంబ సభ్యులకు తీయాల్సిన కొత్త దుస్తులు, ఇతరత్రా కొనుగోళ్లకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి మరో రెండురోజుల వరకు ఉంటుందని సమాచారం. ఆంధ్రాబ్యాంకు వరకు జిల్లావ్యాప్తంగా ఉన్న శాఖల కోసం రూ.100 కోట్లు అవసరమని రిజర్వుబ్యాంకుకు ప్రతిపాదనలు పంపడం జరిగింది. అవి శుక్రవారం వచ్చే అవకాశం ఉంది. శనివారం నుంచి అన్ని బ్యాంకుల్లోనూ, ఏటీఎంల్లోనూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆ బ్యాంకు జిల్లా సహాయ జనరల్ మేనేజర్ శ్రీనివాసు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

**ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే:** ఆమదాలవలస పట్టణంలో గురువారం పలు ఏటీఎంలు మూతపడటంతో నగదు అవసరం ఉన్న వినియోగదారులు అవస్థలు ఎదుర్కొన్నారు. సంక్రాంతి పండగ సమయం కావడంతో పట్టణం నుంచి వలస వెళ్లిన అనేక మంది తిరిగి వారి స్వగ్రామాలకు చేరుతుండటం వల్ల ఏటీఎంల్లో నగదు కొరత ఏర్పడటం తీవ్ర అసౌకర్యంగా ఉందని వారంతా చెబుతున్నారు.


ఇక్కడా అంతే...

## మరో పదిరోజులు పడుతుందంటున్నారు

స్టేట్ బ్యాంక్ వరకు పెద్దనోట్ల కొరతను గడిచిన ఇరవైరోజులుగా ఎదుర్కొంటున్నాం. రూ.200 కోట్లు కావాలని రిజర్వుబ్యాంకుకు నివేదించాం. అవి వచ్చేసరికి కనీసం పదిరోజులు పడుతుందని తెలిసింది. అయితే మావద్ద రూ.200 నోట్లు పుష్కలంగా ఉన్నాయి. ప్రజలకు పండుగ అవసరాల నేపథ్యంలో ఎంతో కొంత ఉపయోగపడతాయనే ఆలోచనతో ఆ నోట్లనే ఏటీఎంల్లో ఉంచాలని చెప్పాం.

**- ఎస్.వి.మాధురిబాల, సహాయ జనరల్ మేనేజర్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, శ్రీకాకుళం**

# అభయమిస్తూ...ఆదేశిస్తూ!

**(మొదటిపేజీ తరువాయి)** ఎనిమిదో తరగతి బాలిక నాబాల ఇంద్రాణిల ప్రసంగాలను విని చంద్రబాబు ముగ్ధులయ్యారు. అసలు ఏమాత్రం తడబాటుకు గురి కాకుండా గుక్క తిప్పుకోకుండా.. అనర్గళంగా సమైక్యాంధ్ర నుంచి నవ్యాంధ్ర వరకు.. చంద్రబాబు పోషించిన పాత్రను ప్రస్తావిస్తూ ఏకధాటిగా రిషిత చేసిన ప్రసంగం సభికులను కట్టి పడేసింది. చంద్రబాబుతో పాటు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు పలు మార్లు చప్పట్లు కొట్టి బాలికను అభినందించారు. సాధికార మిత్రలు, ఆదర్శ రైతులు.. ఇలా పలువురి చేత మాట్లాడించారు. చివరిగా పురపాలక కమిషనర్ పూడి రవిబాబును పిలిచి జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. ఇంత వరకు నాలుగు జన్మభూముల్లో ఎన్నివినతులు వచ్చాయి.. ఎన్నింటిని పరిష్కరించారు.. ఎన్ని పెండింగులో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్‌ని పిలిపించి.. పురపాలక సంఘంలో సమస్యలపై క్లుప్తంగా చెప్పాల్సిందిగా మాట్లాడించారు. వెలుగు మహిళలకు రూ.108కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కును అందించారు. స్త్రీనిధి మహిళలకు రూ.36 కోట్లు.. చంద్రన్న బీమా విద్యార్థుల ఉపకార వేతనాలకు రూ. 12.54 కోట్లు, బీసీ కార్పొరేషన్ లబ్ధిదారులకు రూ.177 కోట్లు.. ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు రూ.24.14 కోట్లు, భూమి కొనుగోలు కోసం రూ.6.17 కోట్లు పంపిణీ చేశారు. చంద్రన్న సంక్రాంతి కానుక, ఈ-పాసు పుస్తకాలు, ఇళ్లపట్టాలు అందజేశారు. మెప్మా కింద రూ.0.6కోట్లు అందించారు. **మరుగుదొడ్ల నిర్మాణం ఎంత అవసరమో వివరిస్తూ...వాటి కోసం సీఎం పలు స్ఫూర్తిదాయక ఉదాహరణలు వివరించారు. అవి ఇవీ...:**

- ఉత్తర ప్రదేశ్‌లో ఒక గ్రామంలో మరుగుడ్డి లేకపోతే పెళ్లిళ్లు చేసుకోబోమని ఆడబిడ్డలంతా తీర్మానం చేసి నిర్మాణాలు చేయించుకున్నారు.
- మహారాష్ట్రలో ఒక ఆడబిడ్డ అత్తవారికి కట్నంగా ఇచ్చిన సొమ్ములతో మరుగుదొడ్డి నిర్మించుకుంది.
- కర్ణాటకలో 15ఏళ్ల బాలిక మరుగుదొడ్డికోసం రెండు రోజుల నిరాహారీ దీక్ష చేసి మరీ సాధించుకుంది.
- బిహార్‌లో ఒక మహిళ పవిత్రమైన మంగళసూత్రాన్ని అమ్మి మరుగుదొడ్డి నిర్మించుకుని ఆదర్శంగా నిలిచింది.
- ఛత్తీస్‌గఢ్‌లోలో వృద్ధురాలు మేకపిల్లను అమ్మి మరుగుదొడ్డి నిర్మించుకుని గ్రామానికి ఆదర్శమైంది.
- మణిపూర్‌లో ఇంట్లో మరుగుదొడ్డి లేదని కొత్త పెళ్లికూతురు మొరాయించి మరీ నిర్మించేదాకా వదలలేదు
- కర్ణాటకలో తన భర్త మరణించడానికి అపరిశుభ్రత కారణంగా భావించి.. ఇలాంటి శోకం మరొకరికి రాకూడదని గ్రామంలో అందరిచేత మరుగుదొడ్లు నిర్మించడానికి పూనుకుంది.
- ఒడిశాలో మహిళా సర్పంచి గ్రామంలో బహిరంగ మలమూత్ర విసర్జన ప్రాంతంలో అందరూ చూస్తుండగా.. రోజూ మట్టి కప్పి గ్రామస్తుల్లో చైతన్యం నింపి అందరూ మరుగుదొడ్లు నిర్మించుకునేలా చేసింది.

## ధనంజయ్ బాగా చేశావ్...

**(మొదటిపేజీ తరువాయి)** కలెక్టర్‌కు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వారు సూచించిన.. అందించిన నివేదిక మేరకు జిల్లాకు పలు వరాలు ప్రకటించారు. బహిరంగ సభలోనూ వంశధారను ప్రస్తావిస్తూ.. 'అంతకు ముందు కొంత గందరగోళం తలెత్తింది. గొడవలు కూడా జరిగాయి. అయినా సమస్యను సామరస్యంగా పరిష్కరించారు. రైతులు పెద్ద మనసుతో సహకరించారు. వారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. సభ చాలా బాగా నిర్వహించారంటూ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను అభినందించారు.

# అయ్యో! ఎంత పనయింది!

**(మొదటిపేజీ తరువాయి)** గత ఏడాది 'పల్స్ సర్వే' పేరుతో ప్రతి కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించింది. దీని ఆధారంగా రేషన్‌కార్డుల మంజూరుకు శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా కొత్త కార్డుల కోసం దరఖాస్తులు భారీగానే వచ్చినా కోత కూడా అదే స్థాయిలో ఉంది. ప్రజలకు మాత్రం కార్డులు ఎందుకు రాలేదో అర్థంకాని పరిస్థితి నెలకొంది. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారుల నుంచి ప్రజలకు స్పష్టమైన సమాచారం లేకపోవటంతో కార్డుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

**సర్వేలో రేషన్‌కార్డుల్లో ఉన్నట్టు...:** ప్రజా సాధికార సర్వేలో 16,907 మందికి సంబంధించిన దరఖాస్తుదారుల పేర్లు మరో కార్డుల్లో ఉన్నట్టు నమోదు కావడంతో వీరికి కార్డులు మంజూరు కాలేదు. ఒక కుటుంబంలో భార్యాభర్తలకు వేర్వేరుగా కార్డులు కావాలన్నా, మైనర్, వివాహం కానివారు ప్రస్తుతం ఉన్న కార్డు నుంచి వేరు కావాలన్నా వీలు లేదు. అదే విధంగా సింగిల్ యూనిట్ కార్డును, కుటుంబ పెద్ద, భార్యకు వేర్వేరుగా కార్డులు ఇవ్వకూడదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. రేషన్ కార్డులు కూడా ఆ విధంగా లెక్కలేసే జిల్లాకు పంపారు. ప్రస్తుతం నిలిపేసిన కార్డులకు ఇవన్నీ కారణాలే.

**కుటుంబాల కంటే కార్డులు ఎక్కువ :** ప్రస్తుతం రాష్ట్రంతో పాటు జిల్లాలోనూ కుటుంబాల కంటే కార్డులే అధికంగా ఉన్నాయి. దీంతో ప్రజాసాధికార సర్వేను ఆధారంగా తీసుకుని కార్డుల్లో కోత విధించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో కుటుంబాల సంఖ్య 6.83 లక్షలు. కార్డులు 8,21,083 ఉన్నాయి. తాజాగా 25 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో వీటిలో కోతను విధించి 8,275 మందికి మాత్రమే కొత్త కార్డులు మంజూరు చేశారు.

**మీ-సేవలో దరఖాస్తు చేసుకోవాలి.:** ప్రస్తుతం జన్మభూమిలో ఎనిమిది వేలకు పైగా కార్డులు మాత్రమే వచ్చాయి. కార్డులు రానివారు మీ-సేవలో దరఖాస్తు చేసుకోవాలి. అత్యవసరం అనుకుంటే నోడల్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి.

**-జి.మోహనబాబు, డీఎస్‌వో**

## ఏపీసీసీ మేధావుల విభాగం నూతన కమిటీ నియామకం

**గవర్నర్‌పేట (విజయవాడ), న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మేధావుల విభాగం ఆరుగురు సభ్యులతో నూతన కమిటీని నియమించినట్లు ఏపీసీసీ మేధావుల విభాగం రాష్ట్ర ఛైర్మన్ మద్ది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం విజయవాడ నగరంలోని ఏపీసీసీ కార్యాలయంలో కాపు సాధికారిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఆకుల భాగ్యలక్ష్మి (రాజమండ్రి), కో ఆర్డినేటర్లుగా జిల్లెల మూడి నరసింహారావు (ఏలూరు), ఎ.వెంకటరెడ్డి (కర్నూలు), బోనుల మురళీకృష్ణ (విజయనగరం), టి.ఎన్.మారుతీభూపాల్ (గుంటూరు), కార్యదర్శిగా డాక్టర్ జూపల్లి ప్రేమ్‌చంద్ (అనంతపూర్)లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

# మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

## 1275 మందికి ఆరోగ్య పరీక్షలు

**కత్తులకవిటి, (వీరఘట్టం గ్రామీణం), న్యూస్‌టుడే:** మండలంలోని కత్తులకవిటిలో సత్యసాయి సేవాశ్రయం పదో వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రవాసాంధ్రులైన గుండె వైద్య నిపుణులు కృష్ణమోహనరావు ఆయన సతీమణి సంధ్యల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైద్యురాలు జ్యోత్స్ననాయుడు(జనరల్ ఫిజీషియన్, అమెరికా) చేతులమీదుగా ప్రారంభించారు. మండలవ్యాప్తంగా 1,275 మంది హాజరై చికిత్సలు పొందారు. అమెరికాతోపాటు ఉత్తరాంధ్రకు చెందిన 11 మంది వైద్యనిపుణులు పాల్గొని చికిత్సలు అందించారు. డి.రామమోహనరావు(శస్త్రచికిత్స వైద్య నిపుణులు), డి.కృష్ణమోహనరావు(గుండె వైద్యనిపుణులు, అమెరికా), శేషగిరిరావు(పార్వతీపురం), శకుంతల(ఆయుర్వేద వైద్య నిపుణులు), యు.కిరణ్ కాంత్(చర్మవ్యాధి నిపుణులు), ఎస్.లక్ష్మి(నేత్రవైద్య నిపుణులు), ఎస్.వి.సురేష్‌కుమార్(ఎముకల వైద్య నిపుణులు), కె.ప్రతిమ(రేడియాలజీ), ఏ.రాధాకృష్ణ(దంతవైద్య నిపుణులు), డి.సుధీర్(దంత వైద్య నిపుణులు) ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అవసరమైనవారికి మందులు అందజేశారు. సత్యసాయి భక్తులు రోగులకు సేవలందించారు. ఈ కార్యక్రమానికి ప్రవాసాంధ్రులు, సత్యసాయి సేవాశ్రయం నిర్మాణ కర్తలు రౌతు విశ్వేశ్వరరావు, కుసుమ, సత్యసాయి సేవాసంస్థల తెలుగు రాష్ట్రాల ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు గంగుల రమణబాబు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.దామోదరరావు, తెదేపా పాలకొండ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, తోటపల్లి ప్రాజెక్టు ఛైర్మన్ నిమ్మక పాండురంగ, స్థానిక సర్పంచి ఆర్.దామోదరరావు, ఎంపీటీసీ సభ్యుడు ఆర్.రంగారావు, జన్మభూమి కమిటీ సభ్యులు కె.వెంకటరమణ, పి.కృష్ణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.


మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జ్యోత్స్ననాయుడు


పరీక్షలు చేస్తున్న వైద్యులు

## సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉద్ధృతం

**టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే:** ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని ఎన్ఎంయూ నాయకులు హెచ్చరించారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట గురువారం వారు రిలే దీక్షలో పాల్గొని మాట్లాడారు. ఓవర్‌టైం డ్యూటీలు తగ్గించి చట్ట ప్రకారం 8 గంటలు పనిచేయించుకోవాలని, అన్నిడిపోల్లో కొత్త టిమ్ యంత్రాలు ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు ప్రత్యేక డ్యూటీ చార్టులు వేయాలని, ఇంకా పలు నినాదాలతో నిరసన తెలిపారు. ఈనెల 9వ తేదీన ఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఉమాపతి, కుమార్, అసిరయ్య, శ్రీరాములు, కృష్ణ, శంకర్, రోహిణమ్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


రిలే దీక్షలో ఎన్ఎంయూ నాయకులు

# ఆమదాలవలస

## బూర్జలో ప్రదర్శన

బూర్జ, న్యూస్‌టుడే: స్థానిక జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ జి.తిరుపతిరావు ఆధ్వర్యంలో ఉవ్వపేట గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఆర్ట్స్ సంస్థ సిబ్బంది ఆధ్వర్యంలో బూర్జలో ప్రదర్శన చేపట్టారు. ఇందులో అధ్యాపకులు చిరంజీవి, ప్రసాద్, ఆర్ట్స్ సిబ్బంది శ్రీనివాసరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## మతలబుపేటలో ముగ్గుల పోటీలు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని జరుగుతున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా గురువారం మతలబుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. విజేతలకు బహుమతులను అధికారుల చేతుల మీదుగా అందజేశారు.

# ఇంటింటికీ అందుబాటులోకి సాంకేతికత

## ప్రభుత్వ విప్ కూన రవికుమార్



నందివాడలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కూన రవికుమార్

నందివాడ(పొందూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ఫైబర్ గ్రిడ్ కేబుల్ సేవల ద్వారా ఇంటింటికీ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని ప్రభుత్వ విప్ కూన రవికుమార్ అన్నారు. మండలంలోని నందివాడ గ్రామంలో గురువారం తహసీల్దార్ ఎస్. దిలీప్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేవలం రూ.149కే పలు ఛానళ్లతో పాటు వైఫై, ఫోన్ సౌకర్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకులు విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతుల కల్పన జరుగుతున్నదని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని అన్నారు. అనంతరం పలువురు రేషన్‌కార్డుదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు లోలుగు శ్రీరాములనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణ, పంచాయతీ రాజ్ డీఈ ధర్మారావు, ఈవోపీఆర్డీ సత్యనారాయణమూర్తి, ఏఎంసీ ఛైర్మన్ అన్నెపు రాము, మండల జన్మభూమి కమిటీ సభ్యులు చిగిలిపల్లి రామ్మోహనరావు, గాడు నారాయణరావు, మండల ఇంజినీర్ శ్రీరాములు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

బురిడికంచరాం(పొందూరు గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని బురిడికంచరాం గ్రామంలో గురువారం తహసీల్దార్ ఎస్. దిలీప్ చక్రవర్తి ఆధ్వర్యంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సంక్రాంతి చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. సర్పంచి వండాన సత్యం, ఈవోపీఆర్డీ సత్యనారాయణమూర్తి, ఏవో రేణుకాసాయి పాల్గొన్నారు.

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస పురపాలక సంఘం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత పేర్కొన్నారు. గురువారం 19వ వార్డు పాత ఆమదాలవలసలో నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వార్డులో చంద్రన్న సంక్రాంతి కానుకలను ఆమె పంపిణీ చేశారు. అదేవిధంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామ స్థల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. వార్డు కౌన్సిలర్ బొడ్డేపల్లి చిన్నబాబు, నాయకులు తమ్మినేని విద్యాసాగర్, కొండబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత



పొందూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న సిస్టం కళాశాల విద్యార్థులు

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు సిస్టం విద్యా సంస్థలు ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం ఇక్కడ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై విద్యార్థులతో ప్రతిజ్ఞ, గ్రామ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని గ్రామ పురవీధుల్లో నినాదాలు చేస్తూ ప్రదర్శనల జరిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మొదలవలస మోహనరావు, ప్రిన్సిపల్ ఎం.భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ పీవో చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకోవడానికే జన్మభూమి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి బలివాడ శ్రీహరి అన్నారు. గురువారం పాలవలసల, మతలబుపేట గ్రామాల్లో జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయనున్నట్లు తెలిపారు. మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. అనంతరం అర్హులకు రేషన్‌కార్డులు, సంక్రాంతి చంద్రన్న కానుకలు, విద్యార్థులకు ఉపకార వేతనాల ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కరణం సుభాషిణి, ఎన్.వెంకటలక్ష్మి, ఎంపీడీవో ఎం.పావని, తహసీల్దార్ జేమ్స్ ప్రభాకర్, ఈవోఆర్డీ ఎం.విజయబాస్కర్, డీటీ నాగేంద్రప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పల్లి భాస్కరరావు, మండల జన్మభూమి కమిటీ సభ్యుడు శివ్వాల సూర్యనారాయణ, తాడేల వెంకటరమణ, వైద్యాధికారి బి.మాలతి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జన్మభూమి కార్యక్రమంలో ప్రత్యేక పరిశీలకులు విక్రాంత్ పాటిల్ అన్నారు. గురువారం ఆమదాలవలస మండలం నెల్లిపర్తి గ్రామంలో మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎం.వెంటరమణ, ఎంపీటీసీ సభ్యులు తెలసముద్రం దమయంతి, తహసీల్దార్ బాబ్జీరావు, వెలుగు ఏపీఎం నారాయణరావు, ఆర్ఐ పుష్పలత, తొగరాం వైద్యాధికారిణి వై.దివ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మలతో పాటు అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: పౌష్టికాహారం తీసుకుంటే ఎంతో ఆరోగ్యంగా ఉండవచ్చని మండల ప్రత్యేకాధికారిణి పంచాది రాధ అన్నారు. గురువారం గాజులకొల్లివలస, నెల్లిపర్తి గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు సీమంతాల కార్యక్రమ నిర్వహించారు. ఇందులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం వైద్యాధికారిణి వై.భవ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ కార్యకర్త అరుణ తదితరులు పాల్గొన్నారు.



పాలవలసలో చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేస్తున్న అధికారులు, సర్పంచి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో అబీబ్ అన్నారు. గురువారం మండలంలోని చిట్టివలస గ్రామంలో సర్పంచి గుజ్జల జగదీశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చంద్రన్న సరకులు, రైతులకు ఈ-పాస్ పుస్తకాలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు.

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకని మండలంలోని గాజులకొల్లివలస మాజీ సర్పంచి మొండూటి కూర్మారావు అధికారులకు ప్రశ్నించారు. గురువారం గాజులకొల్లివలస గ్రామంలో మండల ప్రత్యేకాధికారిణి పంచాది రాధ అధ్యక్షతన జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి ఒక ఐఏఎస్, ఐపీఎస్ అధికారి కావాలని జన్మభూమి పరిశీలన ప్రత్యేకాధికారి విక్రాంత్ పాటిల్ అన్నారు. గురువారం మండలంలోని నెల్లిపర్తి గ్రామంలో జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ముందుగా ఆ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. అక్కడ చదువుతున్న విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. ఆయనతో పాటు ప్రత్యేకాధికారిణి రాధ, వైద్యాధికారిణి భవ్య, ఇన్‌ఛార్జి ఎంఈవో ఈశ్వరరావు, తహసీల్దార్ బాబ్జీరావులతో పాటు అధికారులు, గ్రామస్థులు ఉన్నారు.

కొల్లివలస(బూర్జ), న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా తెదేపా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కొల్లివలసలో గురువారం సర్పంచి ఎస్.శిమ్మన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో విప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులైన పేదవారందరికీ సంక్షేమ పథకాలను అందించడంలో నిరంతరం శ్రమిస్తున్నామని తెలిపారు. ఎంపీపీ సూర్యారావు, జడ్పీటీసీ సభ్యులు రామకృష్ణ, ప్రత్యేక అధికారి వెంకటరత్నం, తహసీల్దారు కిరణ్‌కుమార్, ఎంపీడీవో రవీంద్రబాబు, డీఈఈ ఆశాలత, సీడీపీవో శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

మెట్టక్కివలస(ఆమదాలవలస): ఆమదాలవలస పట్టణంలోని 23వ వార్డు వెంకయ్యపేటలో గురువారం నిర్వహించిన 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో కౌన్సిలర్ బొడ్డేపల్లి ఏకాశమ్మ పాల్గొని మాట్లాడారు. ఇందులో పాల్గొన్న ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత ఈ సందర్భంగా తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా పశువైద్య, ప్రాథమిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

## ఇన్‌పుట్ రాయితీ పంపిణీలో వ్యత్యాసాలపై నిలదీత

కొంచాడ(పొందూరు), న్యూస్‌టుడే: ఇన్‌పుట్ రాయితీల చెల్లింపుల్లో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయంటూ సర్పంచి ముగడ తవిటినాయుడు అధికారులను నిలదీశారు. గురువారం మండలంలోని కొంచాడ గ్రామంలో జన్మభూమి-మా ఊరు గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి సభలో మాట్లాడుతూ గ్రామానికి ఆనుకొని ఉన్న తుంగపేటలోని సాగునీరు అందే పొలాలకు 70 శాతం ఇన్‌పుట్ రాయితీని పంపిణీ చేసి వర్షాధారంపై ఆధారపడి అతివృష్టి, అనావృష్టితో ప్రతి ఏటా నష్టాలు ఎదుర్కొంటున్న తమ గ్రామానికి 20 శాతం ఇన్‌పుట్ రాయితీ చెల్లించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని తీవ్ర స్థాయిలో అధికారులపై ధ్వజమెత్తారు. యాగాటిపేటలో వీధి దీపాలకు సంబంధించిన విద్యుత్తు తీగలు లేకపోవడంతో దీపాలు వేయలేకపోతున్నామని, గ్రామం అంధకారంలో ఉందని ఏఈ వీర్రాజును సర్పంచి ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తొలుత గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలంటూ అధికారులు ప్రదర్శన నిర్వహించారు.

తుంగపేటలో..: మండలంలోని తుంగపేట గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభకు సర్పంచి పప్పల వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు. శాఖల వారీగా అధికారులు నివేదికలను చదివి వినిపించారు. చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఏపీవో శోభాదేవి, ఆర్ఐ ఈశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ అన్నెపు రాము, మండల జన్మభూమి కమిటీ సభ్యుడు చిగిలిపల్లి రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



పొందూరు మండలం కొంచాడలో ప్రదర్శన నిర్వహిస్తు న్న దృశ్యం

## నేడు ప్రభుత్వ విప్ పర్యటన

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండలంలో శుక్రవారం ఉదయం కృష్ణాపురం, మధ్యాహ్నం వీఆర్‌గూడేం గ్రామాల్లో నిర్వహించే జన్మభూమి గ్రామసభల్లో ప్రభుత్వ విప్ కూన రవికుమార్ పాల్గొననున్నట్లు మండల జన్మభూమి కమిటీ సభ్యులు చిగిలిపల్లి రామ్మోహనరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జన్మభూమి కమిటీ సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

లోలుగులో..: శుక్రవారం మధ్యాహ్నం లోలుగు గ్రామంలో నిర్వహించనున్న జన్మభూమి కార్యక్రమానికి అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులు ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

## ప్రశాంతంగా జన్మభూమి

బూర్జ, న్యూస్‌టుడే: మండలంలోని తోటవాడ, ఉప్పినవలస, సింగన్నపాలెంలో గురువారం తహసీల్దారు కిరణ్‌కుమార్, ఎంపీడీవో రవీంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించే జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. ఇందులో ఎంపీపీ సూర్యారావు, జడ్పీటీసీ రామకృష్ణ, వైస్ ఎంపీపీ ప్రభాకరరావు, సర్పంచులు ప్రసాద్, భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సర్వసభ్య సమావేశం

బూర్జ, న్యూస్‌టుడే: స్థానిక స్త్రీనిధి భవనంలో శుక్రవారం ఎంపీపీ బి.సూర్యారావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీవో రవీంద్రబాబు తెలిపారు. ఇందులో అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

## మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌కు ఘనసన్మానం

*ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధికి నోచుకోని పురపాలక సంఘం పరిధిలోని 23వ వార్డు వెంకయ్యపేట గ్రామాన్ని కొద్ది కాలంలోనే మంచి అభివృద్ధిని సాధించేందుకు చర్యలు చేపట్టడంతో ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతను ఆ ప్రాంత ప్రజలు గురువారం ఘనంగా సన్మానించారు. పార్టీలకు అతీతంగా శివారు ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని చెప్పిన మాటను ఆమె నిలబెట్టుకున్నారని వారంతా హర్షం వ్యక్తం చేశారు. గత మూడేళ్లలో రూ.65 లక్షల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని కౌన్సిలర్ బొడ్డేపల్లి ఏకాశమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ జన్మభూమి కమిటీ అధ్యక్షుడు తమ్మినేని విద్యాసాగర్, నాయకులు శిమ్మ రవి, శిమ్మ మాధవి, బొడ్డేపల్లి రాజు, కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.*



ఛైర్‌ఫర్సన్ గీతను సన్మానిస్తున్న వెంకయ్యపేట మహిళలు

# ఆమదాలవలస

## ధర్నాను విజయవంతం చేయండి

పొందూరు, న్యూస్‌టుడే: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని పింఛను సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 9న తాలూకా కేంద్రాల్లో జరప తల పెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్, మండల ప్రధాన కార్యదర్శి గన్నెం రామారావులు పిలుపునిచ్చారు. గురువారం మండలం కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పొందూరు డీటీఎఫ్ మండల శాఖ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అన్ని సంఘాల మద్దతుతో పింఛను సాధన సమితిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సీపాన భాస్కరరావు, మండల అధ్యక్షుడు బలివాడ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి జి.భాస్కరరావు, తమ్మినేని మురళీమోహనరావు, జి.శ్రీనివాసరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## 11 నుంచి మండల స్థాయి కబడ్డీ పోటీలు

రాపాక(పొందూరు), న్యూస్‌టుడే: మండలంలోని రాపాక గ్రామంలో కబడ్డీ యూత్, గ్రామ స్థుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని ఈ నెల 11 నుంచి 13 వరకు మండల స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉత్సాహం గల క్రీడా జట్లు ఈ నెల 9 నాటికి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు తమను సంప్రదించాలని తెలిపారు.





ఆమదాలవలస పట్టణంలో స్వచ్ఛభారత్‌పై ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

## స్వచ్ఛభారత్‌తో సంపూర్ణ ఆరోగ్యం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లెల్లో స్వచ్ఛభారత్‌తో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.బి.గోపాలరావు అన్నారు. గురువారం ఆమదాలవలస పట్టణంలో స్వచ్ఛభారత్‌పై ఎన్‌సీసీ విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్లు నిర్మించే విధంగా విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో జె.రవిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### స్వచ్ఛభారత్‌పై ప్రదర్శన

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఆరుబయట మల విసర్జన నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిస్తూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా షళంత్రి గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం స్వచ్ఛభారత్‌పై భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కింతలి(పొందూరు గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని కింతలి గ్రామంలో 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమానికి సంబంధించి 'స్వచ్ఛభారత్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానం' అనే అంశంపై సర్పంచి దవళ గణపతిరావు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. కూటికుప్పల హనుమంతురావు, కార్యదర్శి దుర్యోధన, అధ్యాపక సిబ్బంది, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కేజీబీవీని సందర్శించిన ప్రభుత్వ విప్

బూర్జ, న్యూస్‌టుడే: మండలం కొల్లివలస జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి గురువారం హాజరైన ప్రభుత్వ విప్ కూన రవికుమార్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ను సందర్శించారు. అక్కడ మురుగునీరు పోయేందుకు ఏర్పాటు చేసిన డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం తొమ్మిది, పదో తరగతులకు చెందిన విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం గోడలకు అతికే పత్రికలపై ఉన్న అంశాలను చదివించారు. ఇందులో కేజీబీవీ ఎస్‌వో సీహెచ్.దేవిని కూడా చదవమన్నారు.



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

విద్యార్థులతో మాటామంతి: విద్యార్థులతో సుమారు ఒక గంట పాటు ప్రభుత్వ విప్ కూన రవికుమార్ మాట్లాడారు. ఇందులో పదో తరగతికి చెందిన జి.లక్ష్మీ, డి.రమాకుమారి, ఎం.హర్షిత, అదే విధంగా తొమ్మిది నుంచి కె.ప్రశాంతి, బి.రమ్యశ్రీల విద్యా ప్రతిభను తెలుసుకున్నారు. తరవాత ప్రయోగశాలను పరిశీలించి, అందులోని పరికరాలను తనిఖీ చేశారు. ఇందులో పాలకొండ ఉపవిద్యాశాఖాధికారి ఐ.వెంకటరావు, ఎంపీపీ బి.సూర్యారావు, విద్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### కొత్తకోట పాఠశాలలో దంత వైద్య శిబిరం

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తకోట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీకాకుళం గాదం డెంటల్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ జాన్, తిరుపతిరావు 264 మంది విద్యార్థులకు, 25 మంది ఉపాధ్యాయులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మార్కెటింగ్ మేనేజర్ బాలరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### విశ్వబ్రాహ్మణ సంఘ సంక్షేమానికి కృషి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న విశ్వబ్రాహ్మణ సంఘ సంక్షేమానికి కృషి చేయనున్నట్లు భారతీయ మజ్దూర్ సంఘం రాష్ట్ర నాయకుడు ఎం.బి.జి.నాయుడు అన్నారు. గురువారం రొట్టవలస కూడలి వద్ద మండల కార్యదర్శి కరణం డిల్లేశ్వరరావు అధ్యక్షతన విశ్వకర్మ డివిజన్ మజ్దూర్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.సింహాచలం, ఎస్.జోగారావు, రమణమూర్తి, కె.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక సర్పంచి గోవింద వెంకటశివానందమూర్తి అన్నారు. గురువారం సింధువాడ గ్రామంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఎచ్చెర్ల యూనివర్సిటీ సౌజన్యంతో సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిర్వహిస్తున్న 7 రోజుల సేవా కార్యక్రమంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రతి ఇంటికి వెళ్లి స్వచ్ఛభారత్, ఇతర కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని వాలంటీర్లను కోరారు. అనంతరం శిబిరం వద్ద రక్తదానంపై వాలంటీర్లు వేసిన నృత్యం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.రవికుమార్, సరుబుజ్జిలి, ఆమదాలవలస కళాశాలల ఎన్.ఎస్.ఎస్ పీవోలు డి.రామ్‌ప్రసాద్, జె.రవిబాబు, స్థానిక పాఠశాల హెచ్.ఎం. పి.అమ్మినాయుడు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానంపై నృత్య రూపంలో అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు





ప్రదర్శన నిర్వహిస్తున్న పురపాలక అధికారులు, విద్యార్థులు

## పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన అవసరం

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరికీ పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన అవసరమని ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత, పురపాలక అధికారులు పేర్కొన్నారు. గురువారం లక్ష్మీనగర్ పాఠశాల విద్యార్థులతో కలసి పట్టణంలోని ప్రధాన రహదారిపై రైలు నిలయం కూడలి మీదుగా గాంధీ విగ్రహం కూడలి వరకు స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రదర్శన నిర్వహించారు. పురపాలక సంఘం మేనేజరు కె.శ్రీనివాసరావు, ఏఈ సృజన, లక్ష్మీనగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతృత్వంలో స్థానిక పట్టుశాలి కల్యాణ మండపంలో గురువారం జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కీళ్ల, నేత్ర వైద్య శిబిరంలో 150 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. 20 మందిని నేత్ర శస్త్ర చికిత్సలకు, 15 మందిని కీళ్ల ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఈ శిబిరంలో ఎముకల వైద్య నిపుణులు షాన్, నేత్ర వైద్య నిపుణులు గురుమూర్తితో పాటు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దండా సూరిబాబు, మలిపెద్ది రామకృష్ణ, సర్పంచి కోరుకొండ విజయలక్ష్మి, ఎంపీటీసీ కోరుకొండ సాయికుమార్, విశ్రాంతి ఉద్యోగులు అక్కలనాయుడు, శాంతారాం, వివిగోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఆర్థిక సాయం

బురిడికంచరాం(పొందూరు), న్యూస్‌టుడే: మండలంలోని బురిడికంచరాం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన సిస్టం కళాశాల విద్యార్థులకు యాజమాన్యం గురువారం ఆర్థిక సాయం అందించింది. సిస్టం కళాశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థుల గృహం దగ్ధమైంది. ఈ నేపథ్యంలో వారికి మనోధైర్యాన్ని కల్పించి సహాయం అందించేందుకు యాజమాన్యం, విద్యార్థులు, అధ్యాపకులు కలిసి రూ.12,116 నగదు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

### మొదలవలసలో పారిశుద్ధ్య పనులు

మొదలవలస(పొందూరు గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని మొదలవలస గ్రామంలో గురువారం పారిశుద్ధ్య పనులను చేపట్టినట్లు సర్పంచి మొదలవలస ధనలక్ష్మి తెలిపారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లోని కాలువలు, రహదారికి ఇరువైపులా గల చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేశారు. ఈ పారిశుద్ధ్య పనులకు 14వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

కింతలి(పొందూరు గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని కింతలి గ్రామంలో సర్పంచి దవళ గణపతిరావు ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని పట్టాభివారి వీధిలోని కాలువల్లో చెత్తాచెదారాలతో పాటు రహదారికి ఇరువైపులా గల పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

## రైతులకు ప్రోత్సాహకం పంపిణీ

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని రైతులు పాడిపై దృష్టి పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని శ్రీవిజయ విశాఖ డైరీ బోర్డు డైరక్టర్ ఆరంగి రమణబాబు అన్నారు. గురువారం సరుబుజ్జిలి వద్ద అమృతలింగానగరం బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటరు వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. అమృతలింగానగరం బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటరు పరిధిలో ఉన్న 37 మంది రైతులకు రూ.49,577 ప్రోత్సాహకంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసీసీ డిప్యూటీ మేనేజర్ ఎ.వీరరాజు, అధికారులు ఎస్.రమణ, జె.రామకృష్ణ, పీవీఆర్ సంతోష్, మాజీ సర్పంచి పేడాడ చిరంజీవిరావు, కార్యదర్శి అన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పాడి రైతులకు బోనస్ చెక్కును అందజేస్తున్న బోర్డు ఆరంగి రమణబాబు

## పశువైద్యశాలల నిర్మాణానికి నిధులు మంజూరు

ఆమదాలవలస గ్రామీణం: నియోజకవర్గంలోని ఆమదాలవలస, పొందూరు మండలాల్లో పశువైద్యశాలల నిర్మాణానికి రూ.89 లక్షలను ప్రభుత్వం నిధులను మంజూరు చేసినట్లు ప్రభుత్వ విప్ కూన రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చీమలవలస పశువైద్యశాల నిర్మాణానికి రూ.27.50 లక్షలు, పొందూరు మండలం లోలుగు గ్రామంలో పశువైద్యశాలకు రూ.34 లక్షలు, రాపాక గ్రామంలో పశువైద్యశాల నిర్మాణానికి రూ.27.50 లక్షల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. త్వరలో నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

### నేటి నుంచి ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

ఖాజీపేట(పొందూరు గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని కింతలి పంచాయతీ ఖాజీపేటలో శుక్రవారం నుంచి 11వ తేదీ వరకు కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకంలో భాగంగా ప్రత్యేక సేవా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గురువారం ప్రిన్సిపల్ డి.శ్యామలరావు తెలిపారు.

## చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు

తోలాపి(పొందూరు గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని తోలాపి గ్రామానికి చెందిన చేనేత కార్మికులకు గురువారం జన్మభూమి కమిటీ సభ్యులు పొన్నాడ రామారావు ఆధ్వర్యంలో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన సుమారు 13 మంది చేనేత కార్మికులకు కొత్త పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ఆయనతో పాటు గౌరీ శంకర్ చేనేత సొసైటీ అధ్యక్షులు గుత్తు అప్పారావు, కార్యదర్శి పార్థసారథి, తదితరులు ఉన్నారు.



తోలాపిలో పింఛన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

# ఎచ్చెర్ల

## పోరాటం ఆపేదిలేదు

వాల్తేరు, (సంతకవిటి), న్యూస్‌టుడే : నాగావళి నదిపై వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసేవరకూ పోరాటం ఆపేదిలేదని వంతెన పోరాట కమిటీ కన్వీనర్ నారాయణస్వామి అన్నారు. సంతకవిటి మండలంలోని వాల్తేరు, ఆమదావలస మండలాల్లోని ఇసుకలపేట గ్రామాల మధ్య వంతెన నిర్మించాలంటూ 320 రోజులుగా వంతెన పోరాట కమిటీ రిలేనిరాహార దీక్ష చేస్తుంది. గురువారం కమిటీ కన్వీనర్ ఆధ్వర్యంలో వాల్తేరులో దీక్ష కొనసాగించారు.

## ప్రతిభాభారతిని పరామర్శించిన కలమట

సంతకవిటి, న్యూస్‌టుడే : సంతకవిటి మండలం కావలి గ్రామంలో మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి కుటుంబాన్ని గురువారం పాతపట్నం ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పరామర్శించారు. మనవడు విఖ్యాత్ ఎలా మృతిచెందాడో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పాతపట్నం నియోజకవర్గ తెదేపా నేతలు ఉన్నారు.

# అంతర్జాలంలో అంగన్‌వాడీ సేవలు

- పారదర్శకతకు పెద్దపీట
- క్షేత్రస్థాయిలో అమలుకు చర్యలు
- ఇప్పటికే కేంద్రాలకు జియోట్యాంగింగ్ పూర్తి



గర్భిణిలు, బాలింతల వివరాలు నమోదుచేసేందుకు కేంద్ర స్త్రీశిశుసంక్షేమశాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక వెబ్‌సైట్

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రాలను గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ తెరిచి ఉంచాలి. ఎక్కడా ఆవిధంగా తెరవడం లేదు. కేంద్రం పరిధిలో ఉన్న చిన్నారులను కేంద్రాలకు రప్పించి ఆహ్లాదకర వాతావరణంలో పూర్వప్రాథమిక విద్య నందించాలి. క్షేత్రస్థాయిలో 90శాతం కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరగటం లేదు. కేంద్రానికి హాజరవుతున్న చిన్నారులకు మాత్రమే పౌష్టికాహారం అందించాలి. కార్యకర్తలు కేంద్రానికి చిన్నారులు రాకపోయినా అధిక హాజరు సంఖ్య నమోదుచేసి పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తున్నా ఇకపై ఇట్టే తెలిసిపోతుంది. ఈ కేంద్రాలపై మరింత పర్యవేక్షణ పెంచి సేవల్లో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

**కేంద్రాలకు జియోట్యాగింగ్ :** అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ప్రత్యేక యాప్ ద్వారా జియోట్యాంగింగ్ చేసింది. దీనివల్ల కేంద్రం తెరిచి ఉందా.. రెండు పూటలా సమయానికి తెరుస్తున్నారా అనే విషయాలు జిల్లా, రాష్ట్రస్థాయిలో పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుంది. దీనివల్ల మారుమూల గ్రామాల్లో ఉన్న కేంద్రాలు సమయపాలన పాటించేందుకు అవకాశం ఉంటుంది.

**ఆధార్ నమోదు చేస్తేనే పౌష్టికాహారం :** కేంద్ర ప్రభుత్వం నుంచి చిన్నారులు , బాలింతలు , గర్భిణిల ఆరోగ్యం కోసం విడుదలవుతున్న పౌష్టికాహారం ప్రభుత్వం తయారుచేసిన ఈ-సదన్ యాప్‌కు వారి ఆధార్‌ను అనుసంధానం చేస్తేనే తరువాత ఏడాదికి పౌష్టికాహారం విడుదల చేస్తారు. లేనిపక్షంలో విడుదల చేయమని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అందుకు ఈ ఏడాది మార్చి నాటికి కేంద్రాల్లో ఉన్న చిన్నారులు, బాలింతలు, గర్భిణిల వివరాల శత శాతం ఆ యాప్‌లో నమోదుచేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ నమోదు కార్యక్రమం చివరి దశకు చేరుకుంది.

**కేంద్రాల్లోనే అందించాలి:** గర్భిణిలు, బాలింతలకు ఇస్తున్న పౌష్టికాహారం వారికి అందటం లేదని.. దీంతో ఏ లక్ష్యంతో పోషకాహారం సరఫరా చేస్తున్నామో అది నెరవేరడం లేదని ప్రభుత్వం గుర్తించింది. అందుకు కేంద్రాల్లోనే వాటిని వండి వడ్డించాలని అన్న అమృతహస్త కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. ఏ రోజు ఎంతమంది కేంద్రానికి హాజరవుతున్నారు , ఇతర వివరాలను ఎప్పటికప్పుడు కామన్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌లో ఫొటోతో సహా పొందుపరచాల్సి ఉంటుంది. ఈ విధంగా రోజూ చేస్తేనే కార్యకర్త వేతనం వారి ఖాతాల్లో జమవుతుంది. కొద్దిమంది కనిపించేలా ఫొటోలు తీసి ఎక్కుమంది కేంద్రానికి హాజరవుతున్నట్లు వివరాలు నమోదుచేసి ఉన్నతాధికారులను, కార్యకర్తలు పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

**పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శనగా వివరాలు :** గ్రామాల్లో అంగన్‌వాడీ సేవల్లో పారదర్శకత పెంచేందుకు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ ఇటీవల ప్రత్యేక ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాల ప్రకారం ఒక అంగన్‌వాడీ కేంద్రంలో సేవలకు సంబంధించి ఎంతమంది చిన్నారులకు, గర్భిణిలకు, బాలింతలకు ఏఏ సేవలు, ఏ పౌష్టికాహారం అందించామనే వివరాలు ప్రతి పంచాయతీ కార్యలయం నోటీసు బోర్డులో , బయట గోడలపై అందరకీ కనిపించేలా అతికించాలి. ప్రదర్శనగా ఉంచామని ధ్రువీకరిస్తూ పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణ పత్రం తీసుకొని జిల్లా అధికారులకు కార్యకర్తలు పంపించాలి. క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావటం లేదు.

### పారదర్శకత పెంచేందుకు

అంగన్‌వాడీ సేవలు గ్రామీణ ప్రాంత చిన్నారులు, గర్భిణిలకు, బాలింతలకు పౌష్టికాహారం పక్కాగా అందించేందుకు ఇటీవల ప్రభుత్వం అనేక మార్పులు చేసింది. గతంతో పోలిస్తే కేంద్రాల్లో పారదర్శకత పెరిగింది. ఇంకా పలు చోట్ల లోపాలు ఉన్నాయి. వీటిన్నింటిపైన ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టేందుకు ప్రాజెక్టుకో బ్లాక్ సమన్వయకర్తను నియమించాం. ఈయన కేంద్రాలను సందర్శించి ఎటువంటి సాంకేతి సమస్యలు ఎదురైన పరిష్కరించే చర్యలు తీసుకుంటారు. ప్రతినెలా అంగన్‌వాడీ సేవలకు సంబంధించి వివరాలు పంచాయతీ కార్యాలయాల్లో ప్రజలంతా చూసేలా ఉంచాలి.

**– రాధామాదవి, సీడీపీవో, పొందూరు ప్రాజెక్ట్.**

### ఆయా మండలాల్లో

★ ఎచ్చెర్ల మండలంలో 104 పెద్ద రెండు చిన్న అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 0 నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 5400 మంది ఉన్నారు. వీరందరికీ ఆధార్ వివరాలు నమోదుచేయాల్సి ఉన్నా సగం మందికి మాత్రమే నమోదుచేశారు. మండలంలో మొత్తం 640 మంది గర్భిణిలు, 720 మంది బాలింతలు ఉన్నారు. వీరందరి ఆధార్ వివరాలు నమోదయ్యాయని అధికారులు చెబుతున్నారు. అన్ని కేంద్రాలకు జియోట్యాంగింగ్ పూర్తయింది.

★ లావేరు మండలంలో 108 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పిల్లలు 4380 మంది చిన్నారులు ఉన్నారు. వీరిలో 90శాతం మందికి సంబంధించిన ఆధార్ వివరాలు యాప్‌లో నమోదు చేశారు. బాలింతలు 560, గర్భిణిలు 620 మంది ఉండగా వీరి వివరాలు యాప్‌లో శతశాతం నమోదు చేశారు. జియోట్యాగింగ్ ప్రక్రియ పూర్తయింది.

★ జి.సిగడాం మండలంలో 71 పెద్ద , రెండు చిన్న అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 0నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 4280 మంది ఉన్నారు. వీరిలో 40శాతం మందికి సంబంధించిన ఆధార్ వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదుచేశారు. కేంద్రాలకు జియోట్యాగింగ్ పూర్తయింది.

★ రణస్థలం మండలంలో 112 పెద్ద 14 చిన్న అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 0 నుంచి ఆరేళ్లలోపు వయసు ఉన్న చిన్నారులు 6328 మంది ఉండగా వీరిలో 5231 మందికి సంబంధించిన వివరాలు మాత్రమే నమోదుచేశారు. గర్భిణిలు 803, బాలింతలు 717 మంది ఉండగా వీరి సమాచారం నమోదు పూర్తయింది. అన్ని కేంద్రాలకు జియోట్యాంగింగ్ చేశారు.

# విద్యార్థుల చైతన్య ర్యాలీ



ఎచ్చెర్ల మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే : మండలంలో పలు పాఠశాలల, కళాశాలల విద్యార్థులు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఓడీఎఫ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇబ్రహీంబాద్‌లో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రధానాచార్యులు గురుగుబెల్లి దామోదరరావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముద్దాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం.రామారావు ఆధ్వర్యంలో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. షేర్‌మహ్మద్‌పురం గురుకుల పాఠశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

## వెంకటాపురంలో ర్యాలీ

వెంకటాపురం(లావేరు) , న్యూస్‌టుడే: ఇంటింటా మరుగుదొడ్డి అదే స్వచ్ఛ వెంకటాపురానికి నాందని వెంకటాపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గురువారం ఉన్నత పాఠశాల నుంచి గ్రామ కూడలి మీదుగా పెదవెంకటాపురం వరకు చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు.

## వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోండి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వం పెద్దఎత్తున చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణం , వాటి వినియోగంపై అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆచార్యులు, బోధన సిబ్బంది, విద్యార్థులు గురువారం ఎచ్చెర్ల గ్రామంలోని ప్రజలు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ సమన్వయకర్త తమ్మినేని కామరాజు మాట్లాడుతూ జాతీయరహదారికి ఆనుకొని గ్రామస్థులు ఎక్కువగా బహిరంగ మలవిసర్జన చేస్తున్నారని ఇది ఒక సామాజిక రుగ్మతన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్‌వార్డెన్ అడ్డయ్య పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు, సిబ్బంది



చిల్లపేటరాజాంలో చెంబు శవయాత్ర నిర్వహించిన అధికార్లు



వెంకటాపురంలో విద్యార్థుల ర్యాలీ



మాట్లాడుతున్న ట్రస్టు అధ్యక్షుడు నాగభూషణరావు

## కౌమారదశలో అప్రమత్తంగా ఉండాలి

పాతర్లపల్లి (రణస్థలం), న్యూస్‌టుడే: ప్రతి వ్యక్తి కౌమారదశలో అప్రమత్తంగా ఉండాలని ఉర్వి ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు నాగభూషణరావు అన్నారు. పాతర్లపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం వ్యక్తిత్వ వికాస సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల వయసులో కుమారుడు చనిపోయాడని, నేను ఓ ఐపీఎస్ అధికారినైనా ఏమీ చేయలేని పరిస్థితితన్నారు. పదవీవిరమణ తర్వాత అబ్బాయి పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కమాండర్ చిన వీరయ్యా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తగిన నైపుణ్యత పెంపొందించుకోవాలన్నారు.

# ఎచ్చెర్ల

## తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

### సంతకవిటి పీహెచ్‌సీలో చికిత్స

**సంతకవిటి, న్యూస్‌టుడే** : తేనెటీగల దాడిలో పలువురికి గాయాలయ్యాయి. సంతకవిటి జూనియర్ కళాశాల సమీపంలోని ఓ చెట్టుకు ఉన్న తేనె పట్టుపై కొందరు రాళ్లు విసరడంతో ఒక్కసారిగా ఈగలు దాడిగి దిగాయి. గురువారం సంతకవిటి - రాజాం ఆర్‌అండ్‌బీ రహదారిపై నుంచి వస్తున్న వారిని, అటుగా వచ్చిన కళాశాల విద్యార్థులను దాడిచేసి గాయపర్చాయి. తేనెటీగల దాడిలో కేఆర్‌పురం గ్రామానికి చెందిన ఐ.మోహనరావుకు తీవ్రగాయాలయ్యాయి. సంతకవిటి జూనియర్ కళాశాలలో చదువుతున్న సాయి, ఆర్.గోవింద, కె.రాంబాబు, డి.ధనలక్ష్మి, భాగ్యలక్ష్మిలను తీవ్రంగా గాయపరిచాయి. నొప్పిని భరించలేక గాయపడిన వారంతా సంతకవిటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు.

## సినిమాలు

ఎస్వీఎస్ రామాంజనేయ (రణస్థలం): ఎంసీఏ
వెంకటరమణ (పైడిభీమవరం) : 2 కంట్రీస్

– న్యూస్‌టుడే, రణస్థలం



# మడ్డువలస జలాలు రప్పించేందుకు చర్యలు



మాట్లాడుతున్న జడ్పీ అధ్యక్షురాలు చౌదరి ధనలక్ష్మి

**షేర్‌మహ్మద్‌పురం(ఎచ్చెర్ల), న్యూస్‌టుడే:** ఎస్ఎంపురం పెద్ద చెరువుకు మడ్డువలస జలాలు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని జడ్పీ అధ్యక్షురాలు చౌదరి ధనలక్ష్మి అన్నారు. మండలం షేర్‌మహ్మద్‌పురం, కేశవరావుపేట, ఇబ్రహీంబాద్, పూడివలస గ్రామాల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. దీనిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఎచ్చెర్ల మండలంలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటుచేయటం వల్ల ఈ ప్రాంతం అన్ని విధాల అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. తెదేపా పూర్వ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజలు, విద్యార్థులతో జన్మభూమి మా ఊరు కార్యక్రమ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బల్లాడ వెంకటరమణారెడ్డి, సర్పంచి చౌదరి అవినాష్, ఎంపీటీసీ నర్సింగరావు, ఎంపీడీవో మురళీమోహన్‌కుమార్, డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు బోర సాయిరాం, పశువైద్యాధికారి సురేష్, ఈసీ నరేంద్రకుమార్, ఆర్ఐ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

★ కేశవరావుపేటలో జరిగిన జన్మభూమి సభలో అగ్రిగోల్డ్ బాధితులు తమకు న్యాయం చేయాలని ఆందోళన చేసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భీమారావు, కార్యదర్శి రామారావు, ఏఎంసీ డైరక్టర్ కొత్తకోట సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

★ ఇబ్రహీంబాద్‌లో సభలో పింఛన్ల కోసం దరఖాస్తు అందిస్తున్నా పింఛన్లు మంజూరు చేయలేదని వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు సనపల నారాయణరావు ప్రశ్నించారు. దీనిపై ఎంపీటీసీ సీపాన పద్మావతి, తెదేపా నాయకులు సీపాన ఎర్రన్నాయుడు, వావిలిపల్లి రామస్వామి స్పందించి అర్హులందరకి పథకాలు అందజేస్తున్నామని చెప్పారు.

### లావేరులో..

**లావేరు, న్యూస్‌టుడే:** బెజ్జిపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంతకముందు జరిగిన సదస్సులో ఎంపీడీవో కిరణ్‌కుమార్ ప్రజల సమస్యలు తెలుసుకొని వినతులు స్వీకరించారు. అనంతరం 137 మందికి ఉపకార వేతనాలు, 35 మందికి పింఛన్లు అందించారు. సర్పంచి ఇజ్జాడ ఉత్తరలక్ష్మి, ఎమ్పీటీసీ దన్నాన శ్రీను, జడ్పీటీసీ పిన్నింటి శ్రీదేవి పాల్గొన్నారు. బుడతవలస ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. గుమడాం సదసులో వైకాపా నాయకులు, సర్పంచి సదస్సుకు హాజరుకాలేదు. సంక్రాంతి కానుకలు, ఉపకారవేతనాలు ఉప తహసీల్దార్ గిరిబాబు పంపిణీ చేశారు. పంచాయతీ విస్తరణాధికారి శ్యామల, ఏపీవో శ్రీనివాసులునాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రంగోళి పోటీలు నిర్వహించిన దృశ్యం

### జి.సిగడాంలో

**జి.సిగడాం, న్యూస్‌టుడే** : గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసమే జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీపీ డొంక సూరీడమ్మ అన్నారు. గురువారం దేవరవలస, కప్పరాం, సేతుభీమవరం, పున్నాం గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నరసయ్య మాట్లాడుతూ వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి పలు దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి భాస్కరమూర్తి, సర్పంచులు వెంకటరావు, జక్కంపూడి దాసు, తిరుమరెడ్డి గౌరీశంకరరావు, సవరయ్య తదితరులు పాల్గొన్నారు.

### అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

**రణస్థలం, న్యూస్‌టుడే:** అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జన్మభూమి పరిశీలకులు ఎస్.బాలకృష్ణ అన్నారు. గురువారం చిల్లపేటరాజాంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో మాట్లాడారు. అధికారులు ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించేలా చూడాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛభారత్ కల నెరవేర్చాలన్నారు. ఇంటివద్ద స్థలం లేని వారికి ప్రభుత్వ స్థలంలో నిర్మించుకొని సొంతంగా నిర్వహించుకోవాలన్నారు. అనంతరం గ్రామాల్లో చెంబు పట్టుకొని వెళ్లే సంస్కృతి పోవాలని చెంబుకు శవయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లె విజయ్‌కుమార్, ప్రత్యేకాధికారి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



బెజ్జిపురంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్

### స్థానికులకు ఉద్యోగాలివ్వడం లేదు

**సంచాం (రణస్థలం), న్యూస్‌టుడే:** స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలివ్వడం లేదని పలువురు యువకులు సంచాం జన్మభూమి కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యాన్ని స్థానికంగా మేము భరిస్తున్నప్పటికీ ఉద్యోగాలు మాత్రం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులున్నప్పటికీ స్థానికులకు ఉపాధి కల్పించడం లేదన్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల వారికి ఇక్కడ ఉపాధినిస్తున్నారన్నారు. ప్రత్యేకాధికారి ధర్మారావు మాట్లాడుతూ ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీరాములు, సర్పంచి భవానీ, కోరాడ వెంకటరమణ పాల్గొన్నారు.

★ సమస్యల పరిష్కారానికే జన్మభూమి కార్యక్రమమని ఎంపీపీ గొర్లె విజయ్‌కుమార్ అన్నారు. మరువాడ, ఎన్‌జీఆర్‌పురం గ్రామాల్లో జన్మభూమి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్‌పట్నాయక్ పాల్గొన్నారు.



గుమడాంలో ర్యాలీ దృశ్యం



దేవరవలసలో సంక్రాంతి కానుకలు అందిస్తున్న దృశ్యం



చిల్లపేటరాజాంలో మాట్లాడుతున్న జన్మభూమి పరిశీలకులు ఎస్. బాలకృష్ణ.



రేషను కార్డులు పంపిణీ చేస్తున్న పరిశీలకులు బాలకృష్ణ, ఎంపీపీ గొర్లె విజయ్‌కుమార్ తదితర్లు.

## తితిదే ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం

**లావేరు, న్యూస్‌టుడే:** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీకాకుళం ధర్మప్రచార్ పరిషత్ సహకారంతో తాళ్లవలస రామ మందిరం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు లలితావాణి ఆధ్వర్యంలో శ్రీకాకుళం భాగవతార్ గొండు రామ్మూర్తిచే గజేంద్ర పురాన కాలక్షేపం నిర్వహించారు. వెంకటేశ్వర భజన బృందం ఆధ్వర్యంలో చేపట్టిన భజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం అయిదు రోజుల పాటు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



భజన చేస్తున్న దృశ్యం

## ముఖద్వారానికి శంకుస్థాపన

**రణస్థలం, న్యూస్‌టుడే** : జాతీయ రహదారి నుంచి బంటుపల్లి గ్రామ రహదారి ప్రవేశంలో ముఖద్వారం నిర్మించేందుకు మహాలక్ష్మి యువజన సంఘం అధ్యక్షులు ఎన్.ఈశ్వరరావు, యూబీ పరిశ్రమ జనరల్ మేనేజరు చిరంజీవి గురువారం శంకుస్థాపన చేశారు. యూబీ పరిశ్రమ సహకారంతో రూ.15 లక్షల వ్యయంతో ఈ నిర్మాణం చేపట్టనున్నట్లు ఈశ్వరరావు తెలిపారు.



శంకుస్థాపన పూజలు చేస్తున్న దృశ్యం

## అధ్యాపకులు నిరంతర విద్యార్థులుగా ఉండాలి

### డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. పీవీ కృష్ణాజీ

**రాజాం, న్యూస్‌టుడే:** అధ్యాపకులు నిరంతర విద్యార్థులుగా ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. పీవీ కృష్ణాజీ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ పీవో డా. పిడుగు సూర్యారావు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన నేపథ్యంలో గురువారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. సూర్యారావు దంపతులను ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ 'మహిళా సాధికారత' అన్న అంశంపై పరిశోధన చేయడం హర్షణీయమన్నారు. నిరంతరం తెలుసుకోవాలన్న తపన, ఏదో సాధించాలన్న కసి ఉంటే ఇలాంటి పరిశోధన సునాయాశంగా సాధించవచ్చని చెప్పారు. ఇందులో రెడ్‌క్రాస్ సంస్థ రాజాం శాఖ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పార్వతీశ్వరరావు, ఈశ్వరరావు, శ్రీనివాసరాఇవు, జయకుమారి, పి.చైతన్య, వాయు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# నరసన్నపేట

## గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

**నరసన్నపేట, న్యూస్‌టుడే:** స్థానిక సూర్యభూషణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విలువైన పుస్తకాలను గురువారం శాఖా గ్రంథాలయానికి వితరణగా అందజేశారు. ట్రస్టు ప్రతినిధి కామేశ్వరదాసుబాబు ఆధ్వర్యంలో పుస్తకాలు, బీరువాను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సత్యనారాయణకు అందించారు. ట్రస్టు ప్రతినిధులు కృష్ణ, వసంతకుమార్, గ్రంథాలయాధికారి ఛాయారతన్ పాల్గొన్నారు.

## గడ్డి వాముల దగ్ధం

**కరకవలస(జలుమూరు), న్యూస్‌టుడే:** కరకవలస గ్రామానికి చెందిన సింగిపురపు అబ్బాయి, గురుకు సత్యన్నారాయణ, గరుకు నారాయుడు, గరుకు రమణయ్యకు చెందిన సుమారు 15 ఎకరాలు గడ్డి వాములు గురువారం దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న కోటబొమ్మాళి అగ్నిమాపక శాఖ సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

# అర్హులందరికీ పక్కా ఇళ్లు

## ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



పర్లాంలో చంద్రన్న సంక్రాంతి కానుకలు అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**బొడ్డపాడు(జలుమూరు), న్యూస్‌టుడే:** జలుమూరు మండలం బొడ్డపాడు గ్రామంలో అర్హులందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా బొడ్డపాడు, పర్లాంలో గురువారం నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. బొడ్డపాడులో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో చాలామంది ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారని, వారందరికీ ఏకకాలంలో పక్కా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. రెవెన్యూ శాఖాధికారులు ఇళ్లస్థలాల్లేనివారికి పట్టాలిచ్చేందుకు భూమిని పరిశీలించాలని ఆయన ఆదేశించారు. గృహాలు నిర్మించుకునేందుకు స్థలం ఉండి ఇల్లు నిర్మాణానికి అర్హులు ఎందరు ఉన్నారు వెంటనే గుర్తించాలని గృహనిర్మాణశాఖ ఏఈ గౌరీశంకర్‌ని ఆదేశించారు. పర్లాంలో జరిగిన గ్రామసభలో పలువురు లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్లాం సర్పంచి నీలవేణి, బొడ్డపాడు మాజీ సర్పంచి బాలకృష్ణ, తెదేపా మండల అధ్యక్షుడు రాజేంద్రనాయుడు, జలుమూరు ఏఎంసీ అధ్యక్షుడు చంద్రభూషణ రావు, మండల జన్మభూమి కమిటీ సభ్యుడు గోవిందరావు, ఎంపీడీవో వాసుదేవ రావు, తహసీల్దారు ప్రవల్లిక ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలు సద్వినియోగపరుచుకోవాలి

**శ్రీముఖలింగం(జలుమూరు), న్యూస్‌టుడే:** ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెదేపా రాష్ట్ర పరిశీలకుడు సూర బాలకృష్ణ అన్నారు. జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా శ్రీముఖలింగంలో గురువారం సర్పంచి తర్ర మాణిక్యం అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కుటుంబం మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రహదారి విస్తరణలో ఇల్లు కోల్పోయినవారికి పరిహారం అందించడంలో రాజకీయం చేస్తున్నారని, తెదేపా నాయకులకే అందిస్తున్నారని గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు సతీష్ అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వాసు దేవరావు తదితరులు పాల్గొన్నారు. మాకివలసలో సర్పంచి అల్లు పద్మావతి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో తహసీల్దారు ప్రవల్లికప్రియ మాట్లాడారు. గత మూడేళ్లలో ప్రభుత్వం సాధించిన ప్రగతి వివరించారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుకలు అందించడంతోపాటు గర్భిణులకు సీమంతం జరిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా జన్మభూమి-మాఊరు గ్రామసభలు

**బొద్దాం(పోలాకి), న్యూస్‌టుడే:** బొద్దాం, కోడూరు, రహమాన్ పురం, గుప్పిడిపేట గ్రామాల్లో గురువారం నిర్వహించిన జన్మభూమి-మాఊరు గ్రామసభ ప్రశాంతంగా ముగిసింది. బొద్దాంలో సర్పంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని, పాఠశాలకు ప్రహరీ మంజూరు చేయాలని ఆయన కోరారు. గుప్పిడిపేటలో ఎన్‌టీఆర్ గృహాలు కావాలని కొందరు దరఖాస్తు ఇచ్చారు. మండల ప్రత్యేకాధికారి దామోదరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, ఇందుకు ప్రభుత్వం రూ.15 వేల వరకు ఆర్థికసాయం అందిస్తున్నందున అందరూ విషయంలో జాప్యం చేయక



చెన్నాపురంలో లబ్ధిదారులకు చంద్రన్న కానుకలు పంపిణీ చేస్తున్న సర్పంచి నీరజాక్షి

ముందుకు రావాలన్నారు. ఆయా గ్రామాల్లో ఆయా సర్పంచులు దుర్గమ్మ, దాలయ్య, మల్లేశ్వరమ్మ, మండల పరిషత్తు సలహాదారు భూషణరావు, నరసన్నపేట ఏఎంసీ అధ్యక్షుడు భాస్కరరావు, ఉపాధిహామీ పథకం ఈసీ రమణమూర్తి, తహసీల్దారు జెన్ని రామారావు, ఎంపీడీవో అలివేలుమంగమ్మ, ఈవోపీఆర్డీ రవికుమార్, ఏఈలు గోపాలకృష్ణ, శ్యామలరావు, రమేష్, ఏపీవో సీతారాం, ఏపీఎం శ్రీనివాసబాబా, ఆర్.ఐ.లు త్రినాథరావు, ఢిల్లీశ్వరరావు, జన్మ భూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### జన్మభూమి అభివృద్ధికి వరం

**నరసన్నపేట, న్యూస్‌టుడే:** జన్మభూమి-మాఊరు కార్యక్రమం ద్వారా గ్రామాభివృద్ధి వికాసానికి తోడ్పడతుందని జడ్పీటీసీసభ్యురాలు చింతు శకుంతల అన్నారు. గురువారం పోతయ్యవలసలో జరిగిన జన్మభూమి- మాఊరు గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నెన్నో పథకాలు ప్రవేశపెడుతోందని, వాటి ఫలాలు ప్రజలకు అందేలా జన్మభూమి-మాఊరు కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. తహసీల్దార్ జల్లేపల్లి రామారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మాకి వలసలో జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎంపీపీ శిమ్మ పార్వతమ్మ, జడ్పీటీసీసభ్యురాలు చింతు శకుంతల తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆశయం నెరవేర్చాలి

**కామేశ్వరపేట (నరసన్నపేట గ్రామీణం), న్యూస్‌టుడే:** సంక్షేమ పథకాల ఫలాలు పేదలందరికి వర్తింపజేసి ప్రభుత్వ ఆశయం నెరవేర్చాలని జడ్పీటీసీ సభ్యురాలు చింతు శకుంతల కోరారు. కామేశ్వరపేటలో గురువారం నిర్వహించిన 'జన్మ భూమి-మా ఊరు' గ్రామసభలో ఆమె మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి, పింఛన్లు పంపిణీ చేశారు. అదేవిధంగా యారబాడు 'ఐ'కాలనీలోని లబ్ధిదారులకు ఆమె చందన్న సంక్రాంతి కానుకలు అందజేశారు. కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యుడు అడపా చంద్రశేఖర్, ఎంపీడీవో విద్యాసాగర్, తెదేపా నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**చెన్నాపురం (నరసన్నపేట గ్రామీణం), న్యూస్‌టుడే:** అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎంపీడీవో విద్యాసాగర్ పేర్కొన్నారు. చెన్నా పురంలో గురువారం సర్పంచి కొంక్యాన నీరజాక్షి అధ్యక్షతన నిర్వహించిన 'జన్మభూమి-మా ఊరు' గ్రామసభలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన పలువురు లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, మహిళా సంఘాలకు రుణాలు అందజేశారు. పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు జరిపించారు. ఆయా కార్యక్రమాల్లో మండల జన్మభూమి కమిటీ సభ్యుడు చంద్రశేఖర్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు బాబ్జీ, చిట్టిబాబు, కృష్ణారావు, ఈవోపీఆర్డీ మధుసూదనరావు, వైద్యాధికారిణి నీరజ తదితరులు పాల్గొన్నారు.



అలుదు గ్రామసభలో చంద్రన్న కానుకలు అందజేస్తున్న తెదేపా మండల అధ్యక్షుడు రాఘవేంద్ర తదితరులు



చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు శకుంతల

### రసాభాసగా కుమ్మరిగుంట గ్రామసభ

**కుమ్మరిగుంట(సారవకోట), న్యూస్‌టుడే:** కుమ్మరిగుంటలో గురువారం జరిగిన జన్మభూమి-మాఊరు గ్రామసభ రసాభాసగా సాగింది. తహసీల్దారు ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ ప్రారంభం కాగా, అన్ని పంచాయతీల్లో చెరువుల ఆక్రమణలు తొలగించినప్పటికీ కుమ్మరిగుంట పంచాయతీలో ఎందుకు తొలగించ లేదని రైతు మోహనరావు ప్రశ్నించారు. ఒకే కార్డులో వృద్ధులైన ఇద్దరు నిరు పేద వితంతువులు ఉండడంతో ఒకరు పింఛను పథకానికి నోచుకోని పరిస్థితి ఏర్పడిందని, ఇద్దరికి వేర్వేరుగా రేషన్ కార్డులు మంజూరు చేసి ఆదుకోవాలని గత జన్మభూమిలో దరఖాస్తు చేసినా ఫలితంలేదని సింహాచలం ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకోవడంతో సభ ముందుకు సాగింది. ఇదే పరిస్థితి తరువాత కూడా కొనసాగడంతో అధికారులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా నాయకుడు చిన్నయ్య, మండల జన్మభూమి కమిటీ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.

### మరుగుదొడ్లు ఉన్నవారికే భవిష్యత్తులో పథకాలు

**అలుదు(సారవకోట), న్యూస్‌టుడే:** మరుగుదొడ్లు ఉన్నవారికే భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు వర్తింపజేసే అవకాశం ఉందని తహసీల్దారు ఈశ్వరమ్మ కోరారు. అలుదు ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం ఎంపీటీసీసభ్యుడు వరుదు రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన జన్మభూమి-మాఊరు గ్రామసభలో మాట్లాడారు. ఈ సందర్భంగా తెదేపా మండల అధ్యక్షుడు, ఎంపీటీసీసభ్యుడు రాఘవేంద్ర చేతుల మీదుగా లిబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేసారు. కిడిమిలో ఎంపీడీవో జగదీశ్వరరావు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచి ఎస్.సాంబమూర్తి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పలువురు అధికారులు ప్రభుత్వ పథకాలను వివరించారు. జమ చక్రంలో జరిగిన గ్రామసభలో పలువురు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు వైద్య పరీక్షలు

**అరసవల్లి, న్యూస్‌టుడే:** అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మైక్యూర్ ఆసుపత్రి నిర్వాహకులు గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాలలో భక్తులకు రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి, మందులు ఇచ్చారు.

## ఆకట్టుకున్న కళాప్రదర్శనలు

**శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** నగరంలోని బాపూజీ కళామందిరంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన్మభూమి సంక్రాంతి సంబారాల్లో భాగంగా గురువారం విజయనగరానికి చెందిన సత్యనారాయణ పండిట్ ఇంద్రజాల ప్రదర్శన, నరసన్నపేటకు చెందిన శ్రీనివాస పండిట్ మిమిక్రీ ప్రదర్శన, మాట్లాడే బొమ్మప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గాయకుడు బి.ఎ.నారాయణ పాల్గొని కళాకారులను అభినందించారు. శుక్రవారం సాయంత్రం బాపూజీ కళామందిరంలో తప్పెటగుళ్ల ప్రదర్శన, జానపద నృత్యాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

## ఆంధ్రాబ్యాంకు మేనేజరుకు ఘన సన్మానం



బ్యాంకు మేనేజరును సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

**బుడితి(సారవకోట), న్యూస్‌టుడే:** చీడిపూడి ఆంధ్రా బ్యాంకు మేనేజరు విక్రంజనాదేవ్‌ను గురువారం విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. బుడితి ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు 80 మంది వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం 101 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేసారు. విశ్రాంత ఉద్యోగులకు ఆంధ్రాబ్యాంకు మేనేజరు విక్రంజనాదేవ్ మంచి సేవలుందిస్తుండటంతో సన్మానించినట్లు సంఘ అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి జి.పార్వతీశం మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు ప్రతి ఏడాది లైఫ్‌సర్టిఫికేట్ అందజేయడానికి ఉపఖజానాకు బయోమెట్రిక్ అనుసంధానం కోసం మూడు, నాలుగు సార్లు తిరగాల్సి వస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టిసారించి బయోమెట్రిక్ విధానాన్ని సరళీకృతం చేయాలని కోరారు. 10 నెలల పీఆర్సీ, రెండు డీఏ బకాయిలను విశ్రాంత ఉద్యోగులకు విడుదల చేస్తే పండగను ఆనందంగా జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు అప్పల స్వామి, సమన్వయకర్త సంగమయ్య, కోశాధికారి శివాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ చేస్తున్న సర్పంచి గొద్దు చిట్టిబాబు

## సంప్రదాయాలకు ప్రభుత్వం పెద్దపీట

**నరసన్నపేట, న్యూస్‌టుడే:** సంప్రదాయాలను గౌరవించి పెద్దపీట వేయడంలో తెదేపా ప్రభుత్వం ముందుంటుందని నరసన్నపేట మేజర్ పంచాయతీ సర్పంచి గొద్దు చిట్టిబాబు అన్నారు. గురువారం స్థానిక గాంధీనగర్‌లో చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీసభ్యురాలు నేతింటి భారతి, తెదేపా నాయకుడు ఊణ్న అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పాలకొండ

## జాబ్‌మేళాలో 30 మంది ఎంపిక

**పాలకొండ, న్యూస్‌టుడే:** స్థానిక కృష్ణసాయి డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు 50 మంది హాజరుకాగా, వారిలో 30 మంది ఎంపికైనట్లు ఫార్మా డైరెక్టర్లు జగదీష్, సోమశేఖర్‌లు తెలిపారు. వీరికి ఫార్మరంగంలో 35 రోజులు పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు రామినాయుడు, అధ్యాపకులు జె.మురళి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణంలో చోరీ

**భామిని, న్యూస్‌టుడే:** మండలకేంద్రంలోని ఓ మద్యం దుకాణంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు స్థానికులు, దుకాణ యజమానులు తెలిపారు. రూ.వేల విలువ చేసే మద్యం సీసాలను దుండగులు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై ముకుందరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ పక్కనే ఉన్న గడ్డికుప్పలో కొన్ని సీసాలు దొరికినట్లు ఆయన తెలిపారు. దీనిపై కేసు సమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సతివాడలో చంద్రన్న బీమా పత్రాలను అందజేస్తున్న మండల ప్రత్యేకాధికారిణి గార రమణమ్మ తదితరులు

**కత్తులకవిటి, (వీరఘట్టం గ్రామీణం), న్యూస్‌టుడే:** గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా తెదేపా ప్రభుత్వం కృషి చేస్తోందని తోటపల్లి ప్రాజెక్టు ఛైర్మన్ నిమ్మక పాండురంగ అన్నారు. మండలంలోని కత్తులకవిటి గ్రామంలో గురువారం నిర్వహించిన 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యరహిత సమాజాన్ని నిర్మించేందుకు శతశాతం మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రౌతు దామోదరరావు, ఎంపీటీసీ సభ్యుడు ఆర్.రంగారావు, జన్మభూమి కమిటీ సభ్యులు కె.వెంకటరమణ, పి.కృష్ణమూర్తినాయుడు, ఎంపీడీఓ ఎం.చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలి

**బిల్లుమడ(భామిని గ్రామీణం), న్యూస్‌టుడే:** ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సత్యం అన్నారు. భామిని మండలం బిల్లుమడ, నేరడి-బి గ్రామాల్లో గురువారం 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జన్మభూమి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పింఛన్లు, ఉపాధిహామీ, వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులకు సంబంధించిన సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గోపాలరావు, తెదేపా మండల అధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌సాహు, మాజీ అధ్యక్షుడు ఏ.దశరథనాయుడు, సర్పంచి కె.రామరాజు, నాయకులు వి.మన్మధరావు, బి.రమణయ్య, తిరుపతి, రామారావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## అక్కన్నగూడలో ర్యాలీ

**సీతంపేట, న్యూస్‌టుడే:** సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమం విశిష్టత తెలియజేస్తూ సీతంపేట మండలం సోమగండి, అక్కన్నగూడ తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, స్వచ్ఛభారత్ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా జన్మభూమి-మాఊరు

**నీలానగరం(వీరఘట్టం గ్రామీణం), న్యూస్‌టుడే:** మండలంలోని నీలానగరం గ్రామంలో 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాన్ని గురువారం వేడుకగా నిర్వహించారు. గ్రామంలోని పాఠశాల ఆవరణను బాలికలు రంగవల్లులతో తీర్చిదిద్దారు. విద్యార్థులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన గ్రామసభలో చిన్నారులకు అన్నప్రసాదం కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అధికారులు, తెదేపా నాయకులు ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కరణం రవీంద్రపాత్రుడు, జన్మభూమి కమిటీ సభ్యులు కె.వెంకటరమణ, పి.కృష్ణమూర్తి నాయుడు, ఎంపీడీఓ ఎం.చంటిబాబు తదితరులు హాజరయ్యారు.



ఉపకారవేతనం అందిస్తున్న నాయకులు

## అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యం

**నరిశిపురం, దశుమంతపురం(వీరఘట్టం గ్రామీణం), న్యూస్‌టుడే:** ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తోందని తహసీల్దార్ ఎం.వి.రమణ అన్నారు. మండలంలోని నరిశిపురం, దశుమంతపురం గ్రామాల్లో గురువారం జరిగిన 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే జన్మభూమి

**కొరమ(భామిని), న్యూస్‌టుడే:** సమస్యల పరిష్కారానికి జన్మభూమి కార్యక్రమం చక్కని వేదిక అని సర్పంచి ప్రతినిధి ఏ.రఘుపతినాయుడు అన్నారు. ఎంపీడీఓ చల్లా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కొరమలో గురువారం 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో శ్మశాన వాటికను నిర్మించాలని అధికారులను కోరారు. అలాగే గ్రామంలోని వివిధ సమస్యలను వారికి తెలియజేయగా.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భాస్కరావు, ఇరిగేషన్ ఏఈ రవికుమార్, ఏంఈవో శ్రీనివాసరావు, ఏపీవో బాబురావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

**సతివాడ(భామిని), న్యూస్‌టుడే:** ప్రజాసంక్షేమం కోసం సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని మండల ప్రత్యేకాధికారిణి గార రమణమ్మ అన్నారు. మండలంలోని సతివాడలో గురువారం సర్పంచి పి.రాంబాబు అధ్యక్షతన 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. . ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి వివరించారు.



కత్తులకవిటిలో చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీచేస్తున్న తోటపల్లి ప్రాజెక్టు ఛైర్మన్ పాండురంగ తదితరులు

అనంతరం అర్హులైన లబ్ధిదారులకు చంద్రన్న బీమా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో మురళీకృష్ణ, ఏపీవో బాబురావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భాస్కరరావు, ఏంఈవో శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ రవికుమార్, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు జ్యోతిలక్ష్మి, ఎంపీటీసీ ప్రతినిధి భూపతి తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపకారవేతనాలను సద్వినియోగం చేసుకోవాలి

**పాలకొండ, న్యూస్‌టుడే:** ప్రభుత్వం అందించే ఉపకారవేతనాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు సామంతుల దామోదరరావు అన్నారు. మండలంలోని చిన్నమంగళాపురం గ్రామంలో జరిగిన జన్మభూమి గ్రామసభలో ఉపకారవేతనాలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఐకేపీ ఏపీఎం నీలంనాయుడు మాట్లాడుతూ మండలంలో 1,857 మంది విద్యార్థులకు రూ.1,200 చొప్పున రూ.22.55 లక్షలు విడుదలయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కిమిడి కాశీంనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు బి.లక్ష్మణమూర్తి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, ఎంపీడీవో ఆర్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## భాసూరులో గందరగోళం

**భాసూరు(పాలకొండ గ్రామీణం), న్యూస్‌టుడే:** భాసూరు గ్రామంలో గురువారం నిర్వహించిన జన్మభూమి గ్రామసభ గందరగోళంగా మారింది. గ్రామ అభివృద్ధిని పట్టించుకోవడం లేదంటూ గ్రామస్థులు అధికారులు, ప్రజాప్రతినిధులను నిలదీశారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలున్నాయని అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. రెవెన్యూ సర్వేయిర్ పనితీరు పట్ల అధికారులకు ఫిర్యాదు చేశారు. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని తహసీల్దార్ గ్రామస్థులకు హామీనిచ్చారు. జన్మభూమి గ్రామసభకు సర్పంచి హాజరుకాకపోవడాన్ని పలువురు తప్పుపట్టగా.. అనారోగ్య సమస్యల కారణంగా రాలేకపోయారని అధికారులు సర్దిచెప్పారు. పోలీసులు గ్రామస్థులను శాంతింపచేయడంతో పరిస్థితి సద్దుమనిగింది. అనంతరం ఎంపీపీ వారాడ లక్ష్మీసుమంత్, జడ్పీటీసీ సభ్యులు గ్రామస్థుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. చినమంగళాపురంలో మార్కెట్ కమిటీ అధ్యక్షులు చింత సంగన్నాయుడు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, సర్పంచి కిమిడి కాశిన్నాయుడు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. నగర పంచాయతీ పరిధిలో 11, 19వ వార్డు పరిధిలో జరిగిన గ్రామసభలో నగర పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పల్లా విజయనిర్మల, సిరిపురం చూడామణి, కమిషనర్ బాలాజీప్రసాద్, కౌన్సిలర్లు ఎన్ని ప్రసాద్, పి.హేమాప్రభ తదితరులున్నారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ వారాడ లక్ష్మీసుమంత్



## ఏలాంకు రక్షితనీటి సదుపాయం



నీటి గొట్టాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

**పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే:** పట్టణ పరిధిలో ఏలాం, సీతంపేట కూడలి నుంచి ప్రధాన రహదారిలోని ఆర్డీవో కార్యాలయం కూడలి వరకు ఉన్నవీధులకు ఎట్టకేలకు రక్షిత మంచి నీటి సదుపాయం కలగనుంది. ఇంతవరకు కుళాయిలు లేకపోవడంతో నీటికోసం స్థానికలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యను గుర్తించిన నగర పంచాయతీ అధ్యక్షురాలు పల్లా విజయనిర్మల రూ.9 లక్షల వ్యయంతో కుళాయి గొట్టాలను ఏర్పాటు చేయించారు. పనులు గురువారంతో పూర్తికావడంతో నీటిసరఫరా సిబ్బంది ప్రయోగాత్మకంగా నీటిసరఫరా చేశారు.

## బడిఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలి

**పాలకొండ, న్యూస్‌టుడే:** బడిఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలని బర్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఎడ్యుకేషనల్ కో-ఆర్డినేటర్ ప్రసాదరావు పేర్కొన్నారు. పట్టణంలో పనులకు వెళ్తున్న బడిఈడు పిల్లలను గుర్తించి సంస్థ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.ఆరు వేల చొప్పున అందజేశారు. ఆరుగురు చిన్నారుల తల్లిదండ్రులకు గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సొమ్ముతో చిరువ్యాపారాలు చేసుకుని చిన్నారులను పాఠశాలలకు పంపాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్, కౌన్సిలర్ గంటా వరలక్ష్మి, సంస్థ సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న తెదేపా పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్, నిర్వాహకులు

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

**తంపటాపల్లి(పాలకొండ గ్రామీణం), న్యూస్‌టుడే:** గణిత ఉపాధ్యాయ సమాఖ్య నిర్వహించిన జిల్లాస్థాయి గణిత ప్రతిభ పరీక్షలో నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన చుక్క అఖిల, నాయుడు శివలకు ఉపాధ్యాయులు గురువారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. పాలకొండ పెదకాపువీధి ఉపాధ్యాయుడు గోరు వెంకటరావు, గుణసుందరి దంపతులు చెరో రూ.5 వేల నగదును బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని లీలావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తీరనున్న మురుగునీటి సమస్య

**పాలకొండ, న్యూస్‌టుడే:** నగర పంచాయతీ పరిధిలోని ఎనిమిదో వార్డు సత్యసాయినగర్ కాలనీలో కాలువ నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. పక్కా మురుగుకాల్వలు లేకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను గతంలో 'ఈనాడు' ప్రచురించింది. దీంతో అధ్యక్షురాలు పల్లా విజయనిర్మల, కమిషనర్ పి.బాలాజీప్రసాద్‌లు స్పందించి రూ.50వేలు నిధులను విడుదల చేశారు. ఈ నిధులతో కాలువ నిర్మాణ పనులు గురువారం ప్రారంభించారు. దీంతో కాలనీవాసులకు పారిశుద్ధ్య సమస్య దూరం కానుంది.



కాలువ కోసం తవ్వుతున్న కార్మికులు

# పాలకొండ

## విద్యార్థులకు పోటీలు

వీరఘట్టం గ్రామీణం, న్యూస్‌టుడే: వీరఘట్టం పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం ఆరు నుంచి 10వ తరగతి పాఠశాల విద్యార్థులకు క్విజ్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జామి అనూరాధ, జన్మభూమి కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జన్మభూమి సందేశాన్ని చదివి వినిపించారు.




## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పాలకొండలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

భామిని, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటూ మండలకేంద్రమైన భామిని జూనియర్ కళాశాల జాతీయ సేవ పథకం(ఎన్‌ఎస్‌ఎస్) విద్యార్థులు గురువారం స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపల్ సుందరరావు మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించి గ్రామస్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి ఆవరణలో మరుగుదొడ్డి ఉండాలని, దాని ఆవశ్యకతను వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దుకుందాం

పాలకొండ, న్యూస్‌టుడే: అందరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుని గ్రామాలను స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నినదించారు. గురువారం కళాశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు జి.గోవిందరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో బి.తేజేశ్వరరావు, అధ్యాపకులు యు.సత్యప్రభ, టి.సుజాత, వి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ర్యాలీ

వీరఘట్టం గ్రామీణం, న్యూస్‌టుడే: 'మరుగుదొడ్డి నిర్మించుకోండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి' అంటూ వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వీరఘట్టం ఒట్టిగెడ్డ నుంచి జూనియర్ కళాశాల వరకు గురువారం ర్యాలీ నిర్వహించి నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యుడు పి.శంకరరావు, అధ్యాపకులు టి.మల్లికార్జునరావు, ఎం.కమలకుమారి, ఏ.శ్రీనివాసరావు, ఆర్.రామకృష్ణ, శేషు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న భామిని జూనియర్ కళాశాల విద్యార్థులు

## మహిళా కండక్టర్లకు ప్రత్యేక సెలవులు కేటాయించాలి


రిలే దీక్షల్లో పాల్గొన్న మహిళా కండక్టర్లు

పాలకొండ, న్యూస్‌టుడే: ఆర్టీసీలో మహిళా కండక్టర్లకు నెలలో మూడు రోజులు ప్రత్యేక సెలవు దినాలను ప్రకటించాలని ఎన్‌ఎంయూ డిపో అధ్యక్షుడు ఎం.వైకుంఠరావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోరుతూ చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా కండక్టర్లకు ప్రత్యేక విధులు వేయాలని, డిపోల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. అన్ని డిపోల్లో కొత్త టిమ్‌లు ఇవ్వాలని, అనారోగ్యం కారణంగా విధులకు హాజరుకాని పక్షంలో వేతనంలో కోత లేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

## సరస్వతీదేవి, గాంధీ విగ్రహాల ఆవిష్కరణ


సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పర్రి కృష్ణమూర్తి తదితరులు

బొడ్లపాడు(వీరఘట్టం గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని బొడ్లపాడు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి, మహాత్మగాంధీ విగ్రహాలను గురువారం బిటివాడ పాఠశాల సముదాయం అధ్యక్షుడు పర్రి కృష్ణమూర్తి ఆవిష్కరించారు. దివంగత వెంకటరత్నం, సరోజనమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు పి.రమేష్, సరస్వతీదేవి విగ్రహాన్ని, స్వర్గీయ సమ్మయ్య, సూరమ్మల జ్ఞాపకార్థం వారి తనయుడు రవికుమార్ మహాత్మగాంధీ విగ్రహాన్ని అక్కడ నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యులు పొన్నాడ నాగేశ్వరరావు, గేదెల గజేంద్రనాయుడు, ప్రధానోపాధ్యాయులు వి.రాంబాబు, ఉపాధ్యాయుడు బి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

అన్నవరం(పాలకొండ గ్రామీణం), న్యూస్‌టుడే: అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉంటూ సినిమా థియేటర్ల నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేసుకోవాలని అగ్నిమాపక అధికారి పి.బలరాం సూచించారు. అన్నవరం వెంకటగౌరి థియేటర్‌లో అగ్నిమాపక సేవలపై గురువారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది వై.గోవింద, యు.సూర్యనారాయణ, జి.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 2600 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మండలం మూలవంగర సమీపంలో గురువారం అబ్కారీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈఎస్‌టీఎఫ్ బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. నాటుసారా తయారీ కోసం నిల్వ ఉంచిన 2,600 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. 70 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అబ్కారీశాఖ డైరెక్టరు వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు దాడులు జరిపినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో పాలకొండ అబ్కారీ సీఐ టి.వి.ఆర్.మూర్తి, ఎన్‌ఫోర్సుమెంట్ సీఐలు శ్రీనివాసరావు, రమణమూర్తి, ఈఎస్‌టీఎఫ్ సీఐ రవికిరణ్, పాలకొండ అబ్కారీ ఎస్సైలు కుమార్, జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎక్సైజ్ అధికారులు

## క్రీడలతో మానసిక ఉల్లాసం

భామిని, న్యూస్‌టుడే: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎయిమ్స్ అసోసియేషన్ ఛైర్మన్ ఆర్.ఆనందరావు అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం బత్తిలిలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక ఆదర్శ పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. ఆ పాఠశాల ప్రిన్సిపల్ మంజుబహుదూర్ మాట్లాడుతూ.. పోటీల్లో 10 జట్లు తలపడగా ఆదర్శ పాఠశాల జట్టు విజేతగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం విజేతలకు మెమొంటోలను అందజేశారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు కంటి వైద్య నిపుణులు ఇప్పిలి జానకిరామయ్య, ఎయిమ్స్ వైస్ ఛైర్మన్ మీసాల ప్రఫుల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దిలీప్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.


గెలుపొందిన జట్టుతో ఉపాధ్యాయులు

## ఘనంగా ఇరుముడి కార్యక్రమం

సతివాడ(భామిని), న్యూస్‌టుడే: భామిని మండలం సతివాడ గ్రామంలోని అయ్యప్ప స్వాములు 45 రోజుల దీక్షలు పూర్తి చేసుకొని శబరిమలకు పయనమయ్యారు. గురుస్వామి పిన్నింటి ప్రసాదరావు ఆధ్వర్యంలో గురువారం ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వాములు ఇరుముడితో గ్రామ పురవీధుల గుండా శబరిమలకు బయల్దేరి వెళ్లారు.


సతివాడలో ఇరుముడితో వెళ్తున్న అయ్యప్ప స్వాములు

## క్షీరాభిషేకాలు

వండువ, (వీరఘట్టం గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని వండువ షిరిడీసాయి ధ్యాన మందిరంలో గురువారం ఘనంగా క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## ప్రత్యేక పూజలు

బత్తిలి(భామిని గ్రామీణం, సీతంపేట), న్యూస్‌టుడే: భామిని మండలం బత్తిలి, కాట్రగడ-బి, ఘనసర తదితర గ్రామాల్లో ఉన్న సాయి మందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. భామిని మండలం మనుమకొండ, పాలవలస, జామిగూడ, సీతంపేట మండలం నౌగూడ, ముత్యాలు, లోవగూడ తదితర గ్రామాల్లోని అక్షర బ్రహ్మ దేవాలయాల్లో ఆదివాసీ గిరిజనులు తమ ఆరాధ్యదైవమైన సవర లిపిని పూజించారు.

## ఆశ్రమ పాఠశాలను సందర్శించిన సీమ్స్ బృందం

ఓంద్రుజోల(సీతంపేట), న్యూస్‌టుడే: సీతంపేట మండలం ఓంద్రుజోలలోని గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటీడీఏ డిప్యూటీ డీఈవో గున్ను రామ్మోహనరావు ఆధ్వర్యంలో సీమ్స్(స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ మానిటరింగ్ సిస్టం) బృందం గురువారం సందర్శించింది. పాఠ్య ప్రణాళిక, విషయాల వారీగా విద్యార్థుల స్థాయి, ఉపాధ్యాయుల బోధన, వెన్నెల కార్యక్రమం అమలు వంటి అంశాలను పరిశీలించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు ప్రతి ఇంటివద్ద తల్లిదండ్రులు నిర్మించేలా చూడాలని విద్యార్థులకు రక్షా బంధన్‌లను డిప్యూటీ డీఈవో రామ్మోహనరావు కట్టారు. వారి వెంట ప్రధానోపాధ్యాయిని బి.ఉమ, డిప్యూటీ వార్డెన్ కె.భాస్కరరావు, జీసీడీవో జ్యోతి, ఏఏంవో నందేశ్వరరావు, సమన్వయకర్త కామేశ్వరరావు తదితరులు ఉన్నారు.


బాలికలకు రక్షాబంధన్ కడుతున్న డిప్యూటీ డీఈవో రామ్మోహనరావు

## కొనసాగిన రిలే నిరాహార దీక్ష

సీతంపేట, న్యూస్‌టుడే: బోయ, వాల్మీకి కులస్థులను గిరిజన జాబితాలో చేర్చుతున్నట్లు శాసనసభలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని ఆదివాసీ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజూ కొనసాగింది. సీతంపేట ఐటీడీఏ ముఖద్వారం వద్ద చేపట్టిన ఈ దీక్షలో గిరిజన సంఘ నాయకులు, పుబ్బాడకు చెందిన గిరిజనులు కూర్చున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. దీక్షా శిబిరాన్ని తెదేపా పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి, గిరిజన సలహా మండలి సభ్యుడు నిమ్మక జయకృష్ణ సందర్శించి సంఘీభావం ప్రకటించారు. గిరిజనులు చేస్తున్న పోరాటానికి అండగా నిలుస్తానని హామీనిచ్చారు. దీక్షకు గిరిజన ఐక్యవేదిక జిల్లా నాయకులు ఆరిక మన్మధరావు, బి.సత్యారావు, పాలక పురుషోత్తం, ఆరిక భాస్కరరావు, ఎన్.రాజారావులు, స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పి.రాజబాబు, తెదేపా నాయకులు మద్దతు తెలిపారు. ఈ దీక్షలో పుబ్బాడ సర్పంచి కేశవరావు, ఆదివాసీ సంఘాల ఐకాస నాయకులు నిమ్మక కాంతారావు, హిమరక ప్రసాద్, ఎస్.పి.పెంటయ్య, రామస్వామి, ఎస్.చంద్రశేఖర్, కె.మన్మధరావు, జి.చిరంజీవులు, ఆనందరావు, రామారావు, కుప్పేశ్వరరావు, ఈశ్వరరావు, కన్నమ్మ, లక్ష్మి, రూప తదితరులు పాల్గొన్నారు.


రిలే దీక్షకు సంఘీభావం తెలుపుతున్న తెదేపా పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి జయకృష్ణ

# పలాస

## నేడు జన్మభూమి-మాఊరు సభలు

రాజాం, బైపల్లి, గరుడభద్ర, బాతుపురం, (వజ్రపుకొత్తూరు), న్యూస్‌టుడే : మండలంలోని రాజాం, బైపల్లి పంచాయతీల్లో ఉదయం, గరుడభద్ర, బాతుపురం పంచాయతీల్లో మధ్యాహ్నం నుంచి తహసీల్దార్ రమణయ్య, ఎంపీడీవో తిరుమలరావు నేతృత్వంలో నేడు జన్మభూమి-మాఊరు సభలు నిర్వహించనున్నారు. ఆయా పంచాయతీ ప్రజలు సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస మండలంలోని కేశుపురం, నారాయణపురంలలో ఇటీవల మృతిచెందిన కుటుంభాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డా. ఎస్. అప్పలరాజు గురువారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ కన్వీనర్ పైల చిట్టి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్ల వితరణ



యాచకులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మందస, న్యూస్‌టుడే : మందసకు చెందిన స్వర్గీయ దుర్గా గురుస్వామి జ్ఞాపకార్థం అతని కుటుంబసభ్యులు గురువారం పేదలు, యాచకులకు చలి దుప్పట్లు ఉచితంగా అందజేశారు. శ్రీషిరిడిసాయిబాబా జ్ఞానమందిరంలో మందిర వ్యవస్థాపకులు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో వితరణశీలురు వై. శ్రీనివాస్, నాగరాజు, బాలరాజు, సుభద్ర చేతులమీదుగా దుప్పట్లు అందజేశారు. అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సాయి సేవా బృంద సభ్యులు కె.వి. రమణ, వల్లభరావు, హరిశ్చంద్ర పాల్గొన్నారు.

## తెదేపాతో పేదలకు మేలు

చినవంక, (వజ్రపుకొత్తూరు), న్యూస్‌టుడే : తెలుగుదేశం ప్రభుత్వంతోనే పేదలకు మేలు చేకూరుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగార్జున అన్నారు. గురువారం మండలంలోని చినవంకలో చంద్రన్న సంక్రాంతి కానుకలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామీణుల ఆర్థిక ఉన్నతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. తెదేపా పక్షాన అందరి నిలవాలన్నారు. జన్మభూమి కమిటీసభ్యులు రవి, కేశవరావు, జయలక్ష్మీ, డీలరు అప్పారావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రమదానం చేశారు.. రోడ్డు వేసుకున్నారు

మామిడిపల్లి(కాశీబుగ్గ), న్యూస్‌టుడే: పలాస మండలంలోని బొడ్డపాడు పంచాయితీ మామిడిపల్లికి వెళ్లే రోడ్డు పనులు గ్రామస్థులు సొంతంగా చేపడుతున్నారు. గరుడభద్ర-బొడ్డపాడు రోడ్డు నుంచి మామిడిపల్లికి వెళ్లే మార్గం పూర్తిగా పాడైంది. దీంతో గ్రామస్థులు పలుమార్లు ప్రజాప్రతినిధులకు, యంత్రాంగానికి విన్నవించారు. అయినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో గ్రామస్థులే స్వయంగా రోడ్డు పనులు చేసేందుకు శ్రీకారంచుట్టారు. గురువారం నుంచి కంకరతో రోడ్డు పనులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వరరావు, పాపయ్య, అప్పయ్య, కృష్ణారావు, మాధవరావు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.



మామిడిపల్లి రోడ్డు నిర్మాణానికి కంకర వేసిన దృశ్యం

## నిత్య 'యోగ'ం... నిరంతర ఆరోగ్యం

**యోగా వైపు అడుగులు వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత**



పూండిలో ఉచిత యోగా సాధనలో విద్యార్థులు, యువత

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నగరాలు.. పట్టణాల్లోనే కాదు ప్రస్తుతం పల్లెల్లోని విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు యోగా వైపు అడుగులు వేస్తున్నారు. పూండి ఉన్నత పాఠశాల కేంద్రంగా స్థానిక ఉపాధ్యాయుడు సీనియర్ యోగాభ్యాసకులు మెట్ట మోహనరావు నేతృత్వంలో ఉచిత శీతాకాల యోగా శిక్షణశిబిరాన్ని ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ యోగా శిక్షణశిబిరంలో 30 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత పాల్గొని యోగాసనాలు నేర్చుకుంటున్నారు. రోజూ ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు యోగా తరగతులు జరుగుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మానసిక ప్రశాంతత కోసం 22 యోగాసనాలను నేర్పుతున్నారు. బీపీ, చక్కెరవ్యాధి, వెన్నుముక, మెడనొప్పి, దీర్ఘకాలిక వ్యాధుల నిర్మూలనకు ప్రస్తుతం నేర్చుకుంటున్న యోగాసనాలు ఎంతో మంచి ఫలితాలను ఇస్తున్నాయని పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. యోగా గురువు ఎర్నిబాబు దగ్గర పలు ఆసనాలు నేర్చుకున్న సీనియర్ యోగాభ్యాసకులు ఆర్. భాస్కరరావు, ఉదయ్‌కుమార్, నిరంజన్‌ల సహకారంతో ఉచిత యోగా శిక్షణ వైపు యువత, విద్యార్థుల దృష్టి పెరిగి హాజరుశాతం పెరుగుతూ వస్తుంది. ఇక్కడ యోగా తరగతులు జరుగుతాయని విద్యార్థులు, యువత సద్వినియోగపరచుకోవాలని యోగాశిక్షకులు చెప్పారు.

### యోగాతో ఆరోగ్యం



యోగాతో మంచి ఆరోగ్యం లభిస్తుంది. ఏడాదిక్రితం పూండి వచ్చిన యోగా గురువు ఎర్రిబాబు చెప్పిన యోగాసనాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. చాలా మంది దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందారు. ప్రస్తుతం ఉచితంగా శీతాకాలంలో యోగా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేశాం. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు హాజరై పలు యోగాసనాలు వేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మానసిక ప్రశాంతత కోసం ఇలాంటి యోగా శిబిరాలు ఎంతగానో దోహదపడతాయి.

**– మెట్ట మోహనరావు, సీనియర్ యోగాభ్యాసకులు, పూండి**

### ఫలితం బాగుంది



పూండి కేంద్రంగా యోగా తరగతులు పెట్టడంతో గత వారం రోజులుగా తోటి స్నేహితులతో కలిసి యోగా సాధన చేస్తున్నాను. ఓంకారం, కపాలబాతి, సూర్య నమస్కారాలు, తాడాసనము, ప్రాణయామం వంటి యోగాసనాలు వేస్తుండడంతో రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. రోజూ యోగా చేసి ఆరోగ్యాన్ని కాపాడుకుంటాను. తోటి విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పిస్తాను.

**– జి.జితేంద్ర, 6వ తరగతి విద్యార్థి, పూండి.**

### వెన్నుపూస నొప్పి తగ్గింది



నేను వెన్నుపూస నొప్పి, ఇతర సమస్యలతో బాధపడేవాడిని. అవి తగ్గాలంటే యోగాసనాలు వేయాలని వైద్యులు చెప్పారు. ప్రస్తుతం క్రమంతప్పకుండా యోగాసనాలు వేయడం వల్ల వెన్నుపూస నొప్పి తగ్గడంతో పాటు చాలా సమస్యల నుంచి బయటపడ్డాను. యోగాసనాలు వేసినప్పటి నుంచి ఆరోగ్యం చాలా బాగుంది. అందుకే క్రమంతప్పకుండా రోజుకు రెండు గంటల పాటు యోగా చేస్తున్నాను.

**– పి.ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయుడు, పూండి**

## 40 లక్షల మందికి పార్టీ సభ్యత్వం



మాట్లాడుతున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పైడి వేణుగోపాల్

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో 6 లక్షలు ఉండే తమ పార్టీ సభ్యత్వం 40లక్షలకు చేరిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పైడి వేణుగోపాల్ పేర్కొన్నారు. కాశీబుగ్గలోని మాజీ ఎంపీ డా. కె. విశ్వనాథం నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో తమ పార్టీకి సంబంధించి 60శాతం పోలింగ్‌బూత్ కమిటీల నియామకం జరిగిందన్నారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనపై ప్రజలకు నమ్మకం కలిగిందన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు వంటి చారిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకున్న తర్వాత జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికల్లో భాజపా ఘనవిజయం సాధించిందన్నారు. రాష్ట్ర కిషాన్ మోర్చా అధ్యక్షుడు పి. తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సమస్యలపై మాట్లాడుతున్న తమ పార్టీ నాయకులపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని మిత్రపక్ష నాయకులు పలుమార్లు ప్రస్తావిస్తుండటం తగదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో భాజపా బలమైన శక్తిగా రూపాంతరం చెందుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపి డా. కె. విశ్వనాథం, పార్టీ నాయకులు పి. వైకుంఠరావు, టి. మాధవరావు, మన్మధరావు, నాగేశ్వరరావు, చిరంజీవి, మీల జోగారావు, వై. రాజు బుజ్జి, కె. బాస్కరరావు, విఘ్నేశం తదితరులు పాల్గొన్నారు.

### నేడు మహాసమ్మేళనం

కాశీబుగ్గలో శుక్రవారం పలాస నియోజకవర్గస్థాయి పోలింగ్‌బూత్ కమిటీ భాజపా ప్రతినిధుల మహాసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ డా. కె. విశ్వనాథం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మాజీమంత్రి డి. పురుందరేశ్వరి, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, మాధవ్ తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.



కామన్ సర్వీసు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్టేట్ బ్యాంకు మేనేజరు గుప్తేశ్వర ఆచారి

## బహుళ ప్రయోజినిగా కామన్ సేవాకేంద్రం

మందస, న్యూస్‌టుడే : మందసలో సైబర్ పాయింట్‌లో ఏర్పాటైన కామన్ సర్వీసు సెంటరు బహుళ ప్రయోజినిగా వినియోగపడుతుందని భారతీయ స్టేట్‌బ్యాంకు మందసశాఖ మేనేజరు టి. గుప్తేశ్వరఆచారి అన్నారు. సేవా కేంద్రాన్ని ఆచారి చేతులమీదుగా గురువారం ప్రారంభించారు. ఈకేంద్రం ద్వారా ఎలాంటి సేవలు పొందవచ్చునో వివరంగా చెప్పారు. నగదు జమ, ఉపసంహరణ, నగదు బదిలీ, ఆధార్ లింకు, కొత్త ఖాతాలు ప్రారంభం చేసుకోవచ్చన్నారు. కంప్యూటరు విద్య నేర్చుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కామన్ సర్వీసు సెంటరు జిల్లా మేనేజరు ఎ. జగదీశ్, సమన్వయకర్త ఎన్. లక్ష్మణరావు, నిర్వాహకులు హెచ్. వెంకటహరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పలాస, న్యూస్‌టుడే : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ కె. అరుణకుమారి తెలిపారు. గురువారం అంతరకుడ్డలో 10 గ్యాస్ బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎ. మాధవరావు, డి. లక్ష్మణ్, మహిళలు పాల్గొన్నారు

## ప్రతీ పల్లె పరిశుభ్రంగా మారాలి

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే : పరిసరాల స్వచ్ఛతతోనే పల్లెలు ఆరోగ్యంగా ఉంటాయని ప్రధానోపాధ్యాయులు ఎస్. సారధినాయుడు పేర్కొన్నారు. గురువారం వజ్రపుకొత్తూరులో స్వచ్ఛ సిక్కోలుపై ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సంపూర్ణ మరుగుదొడ్ల నిర్మాణాలకు కృషి చేయలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు పాటు పడాలన్నారు. విద్యార్థులు స్వచ్ఛ నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వో టి. యర్రయ్య, పీడీ గజేంద్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి(వజ్రపుకొత్తూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రతీ పల్లె పరిశుభ్రతకు చిరునామా కావాలని ఆ పల్లెలో ఉన్న పాఠశాల పచ్చదనం, పరిశుభ్రత సంతరించుకోవాలని ప్రధానోపాధ్యాయుడు అనంత పద్మనాభం చెప్పారు. వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులచే వీధుల్లో ర్యాలీ చేశారు. బహిరంగ మలవిజర్జన వలన కలిగే అనర్థాలు, మరుగుదొడ్ల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మెహనకృష్ణ, రవికుమార్, తిరుపతిరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరులో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ చేపడుతున్న దృశ్యం

## భాజపా బలోపేతానికి మరింత కృషి

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే : మండలంలో భాజపా బలోపేతానికి మరింత కృషి చేయనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు అప్పలస్వామి అన్నారు. మండల అధ్యక్ష పదవి రెండేళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలానికి 75 బూత్ కమిటీలు వేసి పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములు చేసినట్లు చెప్పారు. పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీ డా.విశ్వనాథం సహకారంతో కేంద్రంలో మోదీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో భాజపాకు ఆదరణ పెరిగిందన్నారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బొరివంక (కవిటి), న్యూస్‌టుడే: పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా గురువారం బొరివంకలో మండలపరిషత్ పాఠశాల విద్యార్థులు చైతన్య ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు కె.రంగారావు, ఎం.గోపి, ఎల్.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పలాస

## తెరపై సినిమాలు

అన్నపూర్ణ: 2 కంట్రీస్, హరిశంకర్: ఎంసీఏ, రవిశంకర్: ఒక్క క్షణం, భాస్కరరామా: ఇంద్రసేన, వెంకటేశ్వర(ఎస్.వి మ్యాక్స్): హలో

– న్యూస్‌టుడే పలాస



# సమస్యల పరిష్కారానికే జన్మభూమి



మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని యూజీపురం సభలో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పలాస,న్యూస్‌టుడే : ప్రతిఒక్కరూ సొంత ఇళ్లు కలిగివుండాలనే ప్రభుత్వ ఆలోచనను సద్వినియోగం చేసుకోవాలని పురపాలక ప్రాంతీయ డైరెక్టర్ రమేష్ అన్నారు. గురువారం 1వ వార్డు మొగిలిపాడులో జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతీఒక్కరికి స్థలం ఉంటే ఇళ్లు నిర్మించుకొనేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, స్థలం లేకుంటే ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇస్తుందని ఇల్లు లేనివారంతా దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా రేషన్ కోసం వెళితే వేలిముద్రలు పడటం లేదని రేషన్ ఇవ్వటం లేదని గత నెల రేషన్ ఇప్పటివరకు అందలేదని, నాలుగైదుసార్లు తిప్పుతున్నారని గ్రామస్థులంతా ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రమేష్‌నాయుడు, పట్టణ ప్రణాళిక అధికారి సత్యన్నారాయణ, పురపాలకసంఘం ఉపాధ్యక్షుడు జి.సూర్యనారాయణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జి.కృష్ణారావు, జిల్లా తెదేపా ప్రచార కార్యదర్శి పి.లోకనాథం, పట్టణ తెదేపా అధ్యక్షుడు ఎల్.కామేశ్వరరావు, జన్మభూమికమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పేరుకే కౌన్సిలర్‌ని.. పనులు చేయలేకపోతున్నా

2వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నా. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమపథకాలు మా వార్డులో రేషన్, ఫించన్ ఒక్కటైనా మంజూరుచేశారా.. గతేడాది జన్మభూమిలో ఇచ్చిన పేర్లు ఇప్పటివరకు మంజూరుచేయలేదు. పేరుకే జన్మభూమి- మాఊరులో కౌన్సిలర్‌ని అంటూ 2వ వార్డు కౌన్సిలర్ బి.బాలమ్మ తన ఆవేదన వ్యక్తంచేసింది. 2వ వార్డు పద్మనాభపురంగ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మా వార్డులో పింఛన్లు, ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం దఖాస్తులు ఇస్తుంటే లబ్ధిదారులు తమ ఇంటి వద్దకు వచ్చి అడుగుతున్నారని అధికారులు అర్హుల జాబితా ఇవ్వమన్నా ఇవ్వడం లేదని అక్కడ ఉన్న జనం వైపు చూస్తూ అధికారులు మీముందుకే వచ్చారు.. మీరే అడగండి అంటూ సమావేశం నుంచి వెళ్లిపోయారు.

పీఎంపురం, యూజీపురం, పాతటెక్కలి, ఎస్‌జేపురం(వజ్రపుకొత్తూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల జీవితాల్లో సంతోషం నింపుతుందని ఎంపీపీ జి.వసంతరావు చెప్పారు. వజ్రపుకొత్తూరు మండలంలోని ఎస్‌జేపురం, పీఎంపురం గ్రామాల్లో ఎంపీడీవో వి.తిరుమలరావు నేతృత్వంలోను, పాతటెక్కలి, ఎస్‌జేపురం గ్రామాల్లో తహసీల్దార్ ఎస్.రమణయ్య నేతృత్వంలో గురువారం 'జన్మభూమి-మాఊరు' గ్రామసభలు జరిగాయి. యూజీపురం సభలో గ్రామ సమస్యలను స్థానిక తెదేపా అధ్యక్షుడు ఎం.జోగారావు, సర్పంచి లావన్నలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పీఎంపురంలో ఎంపీపీ వసంతరావు, సర్పంచి పార్వతిలు చంద్రన్న సంక్రాంతి కానుకలను అందించారు. పాతటెక్కలి, ఎస్‌జేపురంలో రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్లకు సంబంధించి వినతులు అందించారు. ఈకార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, మాజీ తెదేపా అధ్యక్షుడు యు.ఉదయ్‌కుమార్, ఉప తహసీల్దార్ లప్పలస్వామి, మండల కోఆప్షన్ సూర్యనారాయణ, ఏపీవో ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌతమి, పీఆర్ జేఈ చంద్రశేఖర్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పిడిమందస (మందస), న్యూస్‌టుడే : మందస మండలంలోని పిడిమందసలో గురువారం నిర్వహించిన 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమంలో తెదేపా, వైకాపా కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. సభ వద్ద తెదేపా పరంగా ముద్రించిన పిడిమందసలో అభివృద్ధి పనుల నివేదిక పత్రాలు పంచారు. హుద్‌హుద్ నిధులతో రూ.2.95 కోట్లతో హరిపురం-మందస రోడ్డు నుంచి వీరగున్నమ్మపురం మీదుగా పిడిమందస వరకు తారురోడ్డు మంజూరైందని పేర్కొనడంతో సభ వద్దనున్న వైకాపా వర్గీయులు అడ్డుకొన్నారు. రెండేళ్లుగా అలాగే అంటున్నారే తప్ప, పనులు మాత్రం చేపట్టడం లేదని నిలదీశారు. వైకాపా వర్గీయుల ప్రశ్నలకు తెదేపా నాయకులు సరిగా సమాధానం చెప్పకపోవడంతో ఘర్షణ చోటుచేసుకొని ఒకరినొకరు తోపులాడుకున్నారు. కుర్చీలు విసురుకోడానికి సిద్ధం కావడాన్ని గమనించిన ఎంపీడీఓ చంద్రకుమారి పోలీసులకు ఫోన్ చేయడంతో వివాదం సద్దుమణిగింది.

పలాస పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతను కాంక్షిస్తూ పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం ర్యాలీ చేశారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్ల ఆవశ్యకత, పౌరుల బాధ్యతను తెలుపుతూ, నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. ఇందులో కళాశాల ప్రిన్సిపల్(పూర్తి అదనపు బాధ్యతలు) చింతాడ శరత్‌బాబు, కళాశాల సమన్వయకర్త పాపారావు, ఎం.క్రిష్ణమోహన్, ఆర్.యుగంధర్‌చౌదరి, కె.కేశవరావు, ఎ.ఝాన్సీ, బి.ప్రసాదరావు, ఎన్.బాపూజీ, ఎ.సరస్వతి పాల్గొన్నారు.

వి.జి.పురం (మందస), న్యూస్‌టుడే : మందస మండలంలోని వీరగున్నమ్మపురంలో గురువారం నిర్వహించిన 'జన్మభూమి-మా ఊరు' సభలో గుడారి రాజమణిపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు, కొంతమంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్వచ్ఛత కోసం మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సభ ప్రారంభానికి ముందు నినాదాలు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొంతమంది ఉపాధ్యాయులతో విద్యార్థులను సభకు పంపించినట్లు ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు తెలిపారు.

గొర్లెపాడు (కవిటి), న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికే జన్మభూమి గ్రామసభను నిర్వహిస్తున్నామని కవిటి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.రామకృష్ణారావు పేర్కొన్నారు. సర్పంచి బి.పాపమ్మ అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో పలు అభివృద్ధి విషయాలను వెల్లడించారు. ప్రజా సమస్యలపై వినతులను స్వీకరించారు. గ్రామపెద్దలు, మహిళాసంఘాలప్రతినిధులు పాల్గొన్నారు.

తులసిగాం, ధర్మపురం (ఇచ్ఛాపురం గ్రామీణం), న్యూస్‌టుడే: ఒక ప్రణాళికగా అన్ని గ్రామాలను అభివృద్ధి బాటలో తీసుకువెళ్లడం జరుగుతోందని, సమస్యలు పరిష్కరిస్తున్నామని ఇచ్ఛాపురం ఎంపీపీ దక్కత ఢిల్లీరావు పేర్కొన్నారు. గురువారం తులసిగాం, ధర్మపురం గ్రామాలలో జన్మభూమి-మాఊరు గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామ పంచాయతీలలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. అర్హులందరికీ సంక్షేమపథకాలను అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పైల హేమరాజు, ఆశి ధర్మరాజు, పిట్ట త్రినాధ్, ఇసురు త్రినాధ్ ఇతర పెద్దలు పాల్గొన్నారు.



వీజీపురం జన్మభూమి సభలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే శివాజీ, అధికారులు

వి.జి.పురం, కుంటికోట, నర్సింగపురం (మందస), న్యూస్‌టుడే : ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలు రానున్నకాలంలో ప్రతీ అర్హుడికీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే శివాజీ అన్నారు. మందస మండలంలోని వీరగున్నమ్మపురం, కుంటికోట, నర్సింగపురం, పిడిమందసలో జన్మభూమి సభలు గురువారం జరిగాయి. వీరగున్నమ్మపురం సభలో ఎమ్మెల్యే పాల్గొని సంక్షేమపథకాలను వివరించారు. ఈసందర్భంగా గ్రామస్థులు తారురోడ్డు, రక్షిత తాగునీటి పథకం, కోతుల నుంచి విముక్తి కావాలని కోరగా, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సభల్లో ఎంపీపీ దాసరి జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు కారి ఈశ్వరరావు, రుద్రయ్య, పీఏసీఎస్ అధ్యక్షులు బమ్మిడి కర్రెయ్య, సార దూర్వాసులు, సర్పంచులు కె.గోపాలకృష్ణ, డి.లింగరాజు, జి.రామకృష్ణ, ఎస్.జయలక్ష్మి తహసీల్దారు శ్యామసుందరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెంటికోట, లొద్దభద్ర (కాశీబుగ్గ), న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించేందుకే జన్మభూమి- మాఊరు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు పి.విఠల్‌రావు పేర్కొన్నారు. పలాస మండలంలోని రెంటికోటలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందులో సర్పంచి పావని, ఎంపీటీసీ సభ్యుడు హొరియా మోహనరావు, ఎంపీడీవో పి.సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ డి.కృష్ణమూర్తినాయుడు, వ్యవసాయాధికారి నాగరాజు, రెంటికోట పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గంగారాం, ఆర్‌ఐ శ్రావణ్ పాల్గొన్నారు. లొద్దభద్రలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచి జ్యోతి, ఉపతహసీల్దార్ బి.పాపారావు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు వి.కూర్మారావు, ఉద్యాన వన శాఖాధికారిణి సునీత, వెలుగు ఏపీఎం జాంబవతి తదితరులు పాల్గొన్నారు.



మొగిలిపాడులో జన్మభూమి-మాఊరులో మాట్లాడుతున్న పురపాలక ప్రాంతీయ డైరెక్టర్ రమేష్



పలాస మండలం రెంటికోట సభలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు పి.విఠల్‌రావు

## ఊట నీరు.. నిలిచిపోతున్న తీరు

దేవుపురం (మందస), న్యూస్‌టుడే : మందస మండలంలోని దేవుపురం వద్ద తారు రోడ్డు దుస్థితి ఇది. ఎగువ ప్రాంతంలో దామోదర్‌సాగర్ జలాశయం ఉండడంతో జక్కర నీరు ఊరుతుంది. గ్రామం వద్ద కల్వర్టు లేకపోవడంతో జక్కర నీరు రోడ్డు మీదుగా వెళ్తుంది. బస్సులు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు నిత్యం తిరుగుతుండడంతో రోడ్డు పాడై గోతులు పడ్డాయి. జక్కర నిల్వ అయ్యే భాగానికి వంద మీటర్ల దూరంలో సాగునీటి కాలువ ఉంది. దేవుపురం కాలనీ నుంచి కాలువ వరకు సిమెంటు కాలువ నిర్మిస్తే జక్కర సమస్యతో పాటు రోడ్డు పాడవకుండా ఉంటుంది. రోడ్లు, భవనాల అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.



కల్వర్టు లేక రహదారి పైనుంచి నీరు వెళ్తుండడంతో గోతులు ఏర్పడిన దృశ్యం

## పోలీసుల అదుపులో బెంతు ఒరియా నాయకులు

కవిటి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్ఛాపురం పర్యటనను పురస్కరించుకొని ముందస్తు చర్యలలో భాగంగా బెంతుఒరియా వైకాపా నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు వచ్చిన విశ్వసనీయసమాచారం మేరకు సభలో అల్లర్లు జరుగకుండా బెంతుఒరియా నాయకులు రజనీకుమార్ దొళాయి, శ్యామ్ పురియాలను గురువారం ఉదయం వారి గ్రామాల నుంచి అదుపులోకి తీసుకొని, ఇచ్ఛాపురం ఠాణాకు తరలించారు. సాయంత్రం వారిని తిరిగి విడిచిపెట్టారు. ఈ విషయమై పలువురు వైకాపా నాయకులు తమ నిరసనను తెలిపారు.

## మరుగుదొడ్లు ఉంటేనే మనుగడ

నారాయణపురం (మందస), న్యూస్‌టుడే : ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని, ఇళ్లల్లో మరుగుదొడ్లు ఉంటేనే మహిళల ఆత్మగౌరవానికి భంగం లేకుండా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు డాక్టరు దున్న వాసు అన్నారు. మందస మండలం నారాయణపురంలో పాఠశాల విద్యార్థులతో కలిసి గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. వీధులు, కాలువలు శుభ్రం చేశారు. మరుగుదొడ్ల వినియోగం వలన కలిగే ప్రయోజనాలు తెలుపుతూ ప్లకార్డులతో వీధుల్లో ప్రచార ర్యాలీ చేశారు. సర్పంచి బత్తిన తేజేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మందస, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల అధ్యక్షులు టి.వీరాస్వామి, ఎం.శాంతమూర్తి, డి.ప్రకాశరావు, నియోజకవర్గ పార్టీ అధికార ప్రతినిధి టి.మధుసూదనరావు డి.సురేష్, జి.జగన్నాయకులు, యువత పాల్గొన్నారు.



మరుగుదొడ్ల ప్రాధాన్యంపై విద్యార్థులతో కలిసి చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.వాసు

# పాతపట్నం

## నేడు గ్రామసభలు

**కొత్తూరు, న్యూస్‌టుడే:** మండలంలోని నేరడి, నీలకంఠాపురం, కుంటిబద్ర, సిరుసువాడ గ్రామాల్లో శుక్రవారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించను న్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

**ఎల్‌ఎన్‌పేట, న్యూస్‌టుడే:** మండలంలోని చింతలబడవంజ, ధనుకువాడ గ్రామాల్లో శుక్రవారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్.మోహన్‌ప్రసాద్ తెలిపారు.

## ముందస్తు అరెస్టులు

**కొత్తూరు, న్యూస్‌టుడే:** మండలంలోని ఇరపాడు గ్రామానికి చెందిన కె. సంజీవరావు, పి.సూర్యనారాయణ, సీపీఎం నాయకులు పత్తిక కుమార్‌లను గురువారం ముందస్తు అరెస్టులు చేసినట్లు స్థానిక ఎస్సై డి.విజయకుమార్ తెలిపారు. ఇచ్ఛాపురంలోని సీఎం సభకు వెళ్లి అడ్డుకుంటారన్న సమాచారంతో ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. వ్యక్తిగత పూచీకత్తులపై వదిలేదిలేసినట్లు పేర్కొన్నారు.

# జన్మభూమి ద్వారానే సమస్యల పరిష్కారం

## ఎమ్మెల్యే కలమట వెంకటరమణ



కొత్తూరు: వసపలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కలమట, ఇతర అధికారులు

**వసప (కొత్తూరు), న్యూస్‌టుడే:** జన్మభూమి ద్వారానే సమస్యల పరిష్కారమవుతాయని, దీనిని చక్కటి వేదికగా ఉపయోగించుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. మండలంలోని వసపలో సర్పంచి విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆర్థిక లోటు వెంటాడుతున్నా అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులను స్వీకరించారు. ఇందులో వైస్ ఎంపీపీ బైరాగినాయుడు, మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు మాతల గాంధీ, నూలు వీరభద్రస్వామి, స్థానిక నాయకులు వలురౌతు వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలపై నిలదీత:** నివగాం గ్రామంలో సర్పంచి ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మభూమిలో వివిధ సమస్యలపై ప్రజలు నిలదీశారు. ఇళ్ల బిల్లులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొందరు సభ దృష్టికి తీసుకొచ్చారు. నల్లాన హరి అనే వ్యక్తి అన్యాయంగా తనకు నిత్యావసర సరుకులను నిలిపివేశారన్నారు. ఏడాదిగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా రేషన్ సరుకులను పునరుద్ధరించనందుకు నిరసనగా తన కార్డును అధికారుల ముందే కాల్చేశారు. ఇతర సమస్యల పైనా నిలదీశారు. వీటన్నింటిని పరిష్కరిస్తామని ఎంపీడీవో రాజేశ్వరరావు సర్ది చెప్పారు. ఎంజేపురం, పొన్నుటూరు గ్రామాల్లో తహసీల్దార్ సావిత్రి ఆధ్వర్యంలో సర్పంచులు కె.చిన్నమ్మడు, ఆసూరి ఆనందరావు అధ్యక్షతన గ్రామసభలను నిర్వహించారు. సమస్యలు తెలుసుకున్నారు. పెద్ద ఎత్తున సమస్యలపై విన్నవించారు. వీటిని పరిష్కరిస్తామన్నారు. చంద్రన్న సంక్రాంతి కానుకలను అధికారులు అందించారు.

**వసుంధర(మెళియాపుట్టి), న్యూస్‌టుడే:** ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు అందించేందుకే జన్మభూమి-మా ఊరు కార్యక్రమమే లక్ష్యమని తెదేపా నాయకులు ఎంపీపీ సలాన రాజేశ్వరి, మోహనరావులు అన్నారు. గురువారం మండలంలోని వసుంధర, కొసమాల గ్రామాల్లో జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాతపట్నం శాసనసభ్యుడు కలమట వెంకటరమణమూర్తి సహకారంతో వసుంధర గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ప్రతి ఇంట వ్యక్తిగత మరుగుదొడ్డిని నిర్మించి వినియోగించాలని, ఇందుకు ప్రభుత్వం రూ.15 వేలు చెల్లిస్తుందని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం బిల్లుల చెల్లింపుల్లో జాప్యం పట్ల బచ్చు లచ్చుమయ్య అధికారులను ప్రశ్నించారు. దీంతో వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది. * చాపర, శేఖరాపురం గ్రామ పంచాయతీల్లో జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు అనపాన రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలకు చంద్రన్న బీమా, చంద్రన్న కానుకల పంపిణీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచులు సంధ్యారాణి, ఉర్లాన రవికుమార్, నల్ల కాంతం పుణ్యవతి, గోక మోహనరావుల అధ్యక్షతన సాగిన కార్యక్రమంలో తహసీల్దార్ చలమయ్య, ఎంపీడీవో సలాన చిరంజీవి, మండల స్థాయి అధికారులు, తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

**పాతపట్నం, న్యూస్‌టుడే:** మండలంలో గురువారం జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగాయి. ముందుగా రౌతులక్ష్మీపురం, పెద్దసున్నాపురం పంచాయతీల్లో ఎంపీడీవో బి.చిన్నమ్మడు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న డీసీసీబీ డైరెక్టర్ ఎం.శ్యాంసుందరరావు, తెదేపా మండల పార్టీ అధ్యక్షులు పైల లక్ష్మయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలిగించేందుకు జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. అంతకు ముందు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎస్.మధుబాబుతో పాటు పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు. తీమర, తామర గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి అప్పారావు, తహసీల్దార్ పి.వేణుగోపాలరావుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ కొంచాడ వీరభద్రరావు, తెదేపా నాయకులు మామిడి గోవిందరావులు పాల్గొని మాట్లాడారు. అనంతరం పలు శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు అధికారులు పాల్గొన్నారు.

**హిరమండలం, న్యూస్‌టుడే:** ప్రభుత్వం అమలు చేసే పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా అధికారులు, ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. గురువారం గొట్ట గ్రామంలో సర్పంచి చాపల కాంతమ్మ అధ్యక్షతన జన్మభూమి-మా ఊరు గ్రామసభను ప్రత్యేకాధికారి లక్ష్మణరావు నిర్వహించారు. ఎంపీడీవో వి.రామస్వామి, అన్ని శాఖల అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై వివరించారు. వెలుగు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, అంగన్‌వాడీ సేవలపై చర్చ జరిగే సమయంలో ఆయా శాఖల అధికారులు, ఉద్యోగుల పనితీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త సక్రమంగా సేవలు అందజేయడం లేదని గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే దస్త్రాలు పరిశీలించి, దర్యాప్తు నిర్వహించి ఆరోపణలు నిజమైతే కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారి, ఎంపీడీవోలను ఎమ్మెల్యే ఆదేశించారు. నెలాఖరు లోగా వెలుగు ఉద్యోగులు ఏ గ్రేడ్‌లోకి సంఘాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. గ్రామసభలో గుర్తించిన అన్ని పనులను వేతనదారులకు కల్పించి దినసరి సగటు వేతనం పెంచేందుకు కృషి చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉద్యోగులను ఆదేశించారు. అనంతరం గ్రామస్థులు పలువురు పింఛన్లు, ఇళ్ల మంజూరుకు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు జి.జగన్మోహనరావు, జి.చిట్టిబాబు, ఎల్.లక్ష్మణరావు, శ్రీను, పి.జోగారావు, చాపల రామారావు, వి.చిన్నారావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**పింద్రువాడలో..:** పింద్రువాడ పంచాయతీలో గురువారం సర్పంచి కె.చినబాబు అధ్యక్షతన తహసీల్దార్ ఎం.కాళీప్రసాద్ జన్మభూమి-మా ఊరు గ్రామసభను నిర్వహించారు. గ్రామస్థులు పలువురు ఎన్టీఆర్ ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయాలని దరఖాస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ఎల్‌ఎన్‌పేట, న్యూస్‌టుడే:** ఎల్‌ఎన్‌పేట మండలంలోని దబ్బపాడు, తురకపేట-కృష్ణాపురం పంచాయతీల్లో గురువారం జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమాల్లో అధికారులను నిలదీశారు. ఏడాదిగా నిర్మాణం చేపట్టిన మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలకు బిల్లులు రాలేదని, ప్రభుత్వ పథకాలు ఏకపక్షంగా కొనసాగుతున్నాయని ప్రజలు నిలదీశారు. తురకపేట-కృష్ణాపురంలో సర్పంచి లావేటి మల్లేశ్వరరావు, దబ్బపాడులో జమ్మి పద్మావతి అధ్యక్షతన జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తురకపేట గ్రామస్థులు పైడిదాసు, సీపాన అప్పన్న, తదితరులు మాట్లాడుతూ ఏడాదిగా నిర్మాణం చేపట్టిన మరుగుదొడ్లకు ఇంతవరకు బిల్లులు మంజూరు చేయలేదని, కొత్తవి నిర్మిస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అనంతరం తురకపేట-కృష్ణాపురం గ్రామల ప్రజల మధ్య పథకాలు, అభివృద్ధి పనులపై వాగ్వివాదాలు జరిగాయి. దబ్బపాడు గ్రామంలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాల్లో అవినీతి జరిగిందని, ప్రభుత్వ పథకాల పంపిణీలో వివక్షలు కొనసాగుతున్నాయని తహసీల్దార్ బి.వెంకటరావును నిలదీశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ ఒమ్మి కృష్ణవేణి, జడ్పీటీసీ సభ్యురాలు వెలమల సుగుణ, ఎంపీటీసీ సభ్యురాలు రావాడ సరోజని, మండల తెదేపా అధ్యక్షుడు శివ్వాల కిషోర్‌బాబు, ఎంపీడీవో సీహెచ్.మోహన్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



గొట్టలో ప్రజల ఫిర్యాదులు వింటున్న ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, అధికారులు, ప్రజాప్రతినిధులు



ఎల్.ఎన్.పేట: అధికారులను నిలదీస్తు న్న దబ్బపాడు గ్రామస్థులు

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

**పారాపురం (కొత్తూరు), న్యూస్‌టుడే:** మండలంలోని పారాపురం గ్రామం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పి.రామకృష్ణ అనే వ్యక్తి గాయపడ్డాడు. ఈయనిది కలిగాం గ్రామం. నడిచి వెళ్తున్న ఈయనను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. వెంటనే స్థానిక సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యాధికారి ప్రభాత్ వైద్య సేవలందించారు. తలపై బలమైన గాయమవ్వడంతో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

**మెళియాపుట్టి, న్యూస్‌టుడే:** పర్లాఖెముండి-మెళియాపుట్టి రహదారి కొసమాల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనలో ద్విచక్ర వాహనదారుడు గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడసంద్ర గ్రామానికి చెందిన సంతోషి మజ్జి(35) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కొసమాల గ్రామం నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది.

## ఎన్‌ఎస్‌ఎస్‌లో విద్యార్థులు చేరాలి



మొక్కను నాటుతున్న అనురాధ, ప్రిన్సిపల్ యుంగధర్

**హిరమండలం, న్యూస్‌టుడే:** ఎన్‌ఎస్‌ఎస్‌లో విద్యార్థులు చేరాలని డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సమన్వయకర్త ఎం.అనురాధ అన్నారు. గురువారం సుభలయ ఆర్‌ఆర్ కాలనీలో శ్రీరామేశ్వరి డిగ్రీ కళాశాల, శ్రీరామా జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల క్షేత్ర పర్యటన-సేవా భావ కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. ప్రిన్సిపల్ ఎల్.యుగంధర్ మాట్లాడుతూ వారం రోజుల పాటు గ్రామాల్లో పలు సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపడతారన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్.గోపాలరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు బి.సురేశ్, పి.యతిరాజు, బి.ఉమామహేశ్వరరావు, ఏవో జి.సురేష్, అధ్యాపకులు యు.కృష్ణారావు, జి.సిమ్మన్నలు పాల్గొన్నారు.

## చంద్రన్న బీమాతో పేదలకు ధీమా



బొర్రంపేటలో బీమా సొమ్మును పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

**బొర్రంపేట(ఎల్‌ఎన్‌పేట), న్యూస్‌టుడే:** ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన పేదలకు ధీమాగా ఉండేందుకు తెదేపా ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని మండల తెదేపా అధ్యక్షుడు శివ్వాల కిశోర్ బాబు అన్నారు. బొర్రంపేట గ్రామంలో పల్లి చిన్నమ్మి రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమె కుమారుడు లక్ష్మణరావుకు చంద్రన్న బీమా పథకం రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం దహన ఖర్చుల కోసం రూ.5 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కొవిలాపు కృష్ణమాచార్యులు, ఒమ్మి ఆనందరావు, వెలమల గోవిందరావు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

# పాతపట్నం

## చంగుడిలో రచ్చబండ కార్యక్రమం

పాతపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని చంగుడి గ్రామంలో గురువారం వైకాపా నాయకులు రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పాతపట్నం నియోజకవర్గ బాధ్యురాలు రెడ్డి శాంతి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గడప గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ డా. రేగేటి షణ్ముఖరావు, కె.అర్జునుడు, యెరుకోల వెంకటరావు, జానకమ్మతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పాడి రైతుల సంక్షేమానికి పెద్దపీట

మెట్టూరు (కొత్తూరు), న్యూస్‌టుడే: పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ పెద్దపీట వేస్తుందని ఈ సంస్థ డైరెక్టర్ ఆరంగి రమణబాబు అన్నారు. మండలంలోని మెట్టూరులో విశాఖ డెయిరీకి పాలుపోస్తున్న పాడి రైతులకు సంక్రాంతి అదనపు ఆర్థిక సహాయాన్ని గురువారం అందించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడారు.




## రాష్ట్రాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

హిరమండలం, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రిన్సిపల్ కె.సుజాత అన్నారు. గురువారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ప్రాధాన్యాన్ని తెలియజేసేలా కళాశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం ఏబీ రహదారిపై విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల తెదేపా ఉపాధ్యక్షుడు పీవీ రమణ అన్నారు. గురువారం ధనుకువాడ గ్రామంలో చంద్రన్న సంక్రాంతి సరకులను పేదలకు అందజేశారు.

## విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలి

మెట్టూరు(కొత్తూరు), న్యూస్‌టుడే: విద్యారులు సేవాభావం కలిగి ఉండాలని వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గేదెల కృష్ణారావు అన్నారు. మండలంలోని మెట్టూరు, గులివిందలపేట గ్రామాల్లో జాతీయ సేవా పథకం శిబిరాలను గురువారం ప్రారంభించారు. వెంకటేశ్వర కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ప్రిన్సిపల్ ప్రారంభించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెట్టూరు సర్పంచి బర్రి గోవిందరావు, వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.లక్ష్మణరావు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు శిబిరం కొనసాగనుంది.



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారావు

## మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టేలా చూడాలి

రావిచెంద్రి(ఎల్ఎన్‌పేట), న్యూస్‌టుడే: గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టేలా విద్యార్థులు చూడాలని, వాటి నిర్మాణం చేపట్టేలా తల్లిదండ్రులపై ఒత్తిడి తేవాలని మాజీ జడ్పీటీసీ సభ్యులు శివ్వాల తేజేశ్వరరావు అన్నారు. గురువారం రావిచెంద్రి జడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచి అప్పన్న అధ్యక్షతన మరుగుదొడ్ల నిర్మాణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తేజేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ మహిళలు, బాలికలపై చాలా ఘోరాలు జరుగుతున్నాయని ఇది దృష్టిలో ఉంచుకొని ఆరుబయట మలవిసర్జనకు వెళ్లటం ఖచ్చిత్వం కాదలని అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రూ. 12వేలు వినియోగించుకొని మరుగుదొడ్డి నిర్మాణాలు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి



కృష్ణాపురంలో అన్నప్రాసన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఒమ్మి కృష్ణవేణి, జడ్పీటీసీ సభ్యురాలు వెలమల సుగుణ అన్నారు. గురువారం మండలంలోని కృష్ణాపురం, దబ్బపాడు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణలకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్న అమృత హస్తం పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షురాలు అనూరాధ, శాంతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనకు ఎంపికలు



ఎంపికను నిర్వహిస్తున్న ఏటీడబ్ల్యూ రజిని

పాతపట్నం, న్యూస్‌టుడే: మండలం సింగుపురం పంచాయతీలోని శ్రీలక్ష్మి టెక్స్‌టైల్స్ పరిశ్రమలో ఉపాధి కల్పనకు తగు చర్యలు చేపడుతున్నట్లు ఐటీడీఏ ఏటీడబ్ల్యూ పి.రజిని అన్నారు. గురువారం పాతపట్నం యువ గిరిజన శిక్షణ కేంద్రంలో మహిళలను ఉపాధి కల్పనకు ఎంపికలను నిర్వహించారు. ఆయా ప్రాంతాలకు చెందిన సుమారు 35 మంది మహిళలు ఎంపికలకు హాజరు కాగా ఇందులో 25 మందిని ఎంపిక చేసినట్లు రజిని తెలిపారు. ప్రస్తుతం కొంచాడపేట వద్ద శిక్షణను అందించిన అనంతరం ఉపాధి కల్పన జరుగుతుందన్నారు. ఎంపిక కమిటీలో కేంద్ర సంరక్షకులు పి.శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి టెక్స్‌టైల్స్ నిర్వాహకులు కె.భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యులు డి.రాజ్యలక్ష్మితో పాటు పలువురు పాల్గొన్నారు.

## నేడు కల్లట, అంబావల్లిలో జన్మభూమి గ్రామసభలు

హిరమండలం, న్యూస్‌టుడే: మండలంలోని కల్లట, అంబావల్లి పంచాయతీల్లో శుక్రవారం జన్మభూమి-మా ఊరు గ్రామసభలు జరగనున్నట్లు మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు గురువారం తెలిపారు. సమస్యల పరిష్కారానికి గ్రామస్థులు వినతిపత్రాలు అందజేయవచ్చన్నారు.

### నేడు నాలుగు గ్రామాల్లో గ్రామసభలు

పాతపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని కోదూరు, పెద్దసీది, సవరసిద్ధమనుగు, దశరథపురం గ్రామ పంచాయతీల్లో శుక్రవారం జన్మభూమి-మా ఊరు గ్రామసభలను నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సభల్లో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లను, చంద్రన్న సంక్రాంతి కానుకలను, చంద్రన్న బీమాను పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు.

## నగదు ప్రోత్సాహకం పంపిణీ

హిరమండలం, న్యూస్‌టుడే: పాడి పెంపకంతోనే కుటుంబాలకు స్వయం ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని విశాఖ డెయిరీ డైరక్టర్ ఎన్.రమణబాబు అన్నారు. గురువారం కల్లట పాల కేంద్రం సహకార సంఘం కార్యాలయంలో పాడి రైతులకు విశాఖ డెయిరీ నుంచి మంజూరైన నగదు ప్రోత్సాహకాన్ని పాడి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లట సంఘం పరిధిలో 86 మంది రైతులకు రూ. 95 వేల నగదు ప్రోత్సాహకం మంజూరైందన్నారు. సహకార సంఘం అధ్యక్షుడు ఐ.నర్సింగరావు కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, టెక్కలి మేనేజర్లు వీర్రాజు, గోపాలం డెయిరీ ఉద్యోగులు బంగారునాయుడు, ఆనందరావు, పాడి రైతులు పాల్గొన్నారు.



కల్లటలో పాడి రైతులకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న విశాఖ డెయిరీ డైరక్టర్ ఎన్.రమణబాబు, ఐ.నర్సింగరావు, తదితరులు

## ఉపాధ్యాయినులకు సత్కారం

హిరమండలం, న్యూస్‌టుడే: సావిత్రీ బాయి పూలే ఆశయాలు స్ఫూర్తిదాయకమని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. గురువారం హిరమండలంలోని కేజీబీవీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఎంఈవో, ఎమ్మార్సీ కార్యాలయం సిబ్బంది సత్కరించారు. ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కేజీబీవీ విద్యార్థులు పలు గీతాలకు నృత్య ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో కృష్ణవేణి, సీఆర్పీలు, ఎమ్మార్సీ కార్యాలయం ఉద్యోగులు, ఐఈడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేజీబీవీలో ఉపాధ్యాయినులకు ఆటల పోటీ నిర్వహిస్తున్న దృశ్యం



నేతాజీనగర్ కాలనీలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు, గ్రామస్థులు

## మరుగుదొడ్ల నిర్మాణ ఆవశ్యకతపై ప్రదర్శన

కొత్తూరు, న్యూస్‌టుడే: ఆరుబటయ మల విసర్జనతో అనర్థాలు తప్పవని నేతాజీనగర్ కాలనీ(కొత్తూరు కాలనీ) పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.తిరుపతిరావు అన్నారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలని అన్నారు. మండలంలోని నేతాజీనగర్ కాలనీలో మరుగుదొడ్ల నిర్మాణ ఆవశ్యకతపై గురువారం ర్యాలీ నిర్వహించారు. మరుగుదొడ్డి నిర్మాణం ఆవశ్యతకపై నినాదాలు చేశారు.

## చిన్నారులకు అన్నప్రాసన

వసప (కొత్తూరు), న్యూస్‌టుడే: మండలంలోని వసప, నివగాం, ఎంజేపురం, పొన్నుటూరు గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వసపలో ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పాల్గొని చిన్నారికి అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మిరియాపల్లిలో వైద్య శిబిరం

మిరియాపల్లి(ఎల్ఎన్‌పేట), న్యూస్‌టుడే: మండలంలోని మిరియాపల్లి గ్రామంలో శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 107 మంది రోగులకు వైద్యులు హెచ్.వెంకటప్రసాద్, డి.చిరంజీవిలు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందులను పంపిణీ చేసినట్లు పీఆర్వో ధనుంజయరావు తెలిపారు.

## పైపులైన్‌కు మరమ్మతులు

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని పారాపురం గ్రామానికి సమీపంలోని కుప్పలోడు చెరువు వద్ద లీకైన మెగా తాగనీటి పథకం పైపులైన్‌కు గురువారం మరమ్మతులు చేసి సరిచేశారు. 'నీటి కోసం నీరు వృథా' శీర్షికతో గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించారు. చెరువులోని ఏర్పాటు చేసిన పైపులైన్ లీకేజీని ఏఈ పేడాడ మహేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది శ్రమించారు. శుక్రవారం నుంచి వంశధార నిర్వాసిత కాలనీల్లోని లీకులు సరిచేసి, తాగునీటి కష్టాలను తీరుస్తామని ఏఈ తెలిపారు.



పారాపురంలో పైపులైన్‌ను సరిచేస్తున్న దృశ్యం

## కళ్లద్దాల పంపిణీ

పాతపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని తెంబూరు సత్యసాయి మందిరంలో 30 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. గత ఏడాది నవంబరు నెలలో స్థానిక మందిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 30 మందిని కళ్లద్దాలకు ఎంపిక చేయగా గురువారం స్థానిక మహిళా విభాగ కన్వీనర్ కె.అమ్మోజీ చేతుల మీదుగా పంపిణీ చేపట్టారు.

## కల్వర్టు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

కొత్తూరు, న్యూస్‌టుడే: రెండు రాష్ట్రాలకు చెందిన రహదారి కల్వర్టు శిథిలమైందని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రూ. 25 లక్షలు మంజూరు చేయించామని ఇంతటి ప్రాధాన్యం ఉన్న వంతెన పనులు నత్తనడకన సాగడంపై స్థానిక ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పనులను గురవారం ఆయన పరిశీలించారు. వెంటనే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈఈ జాన్‌విక్లిఫ్ పాల్గొన్నారు.

## మల్లయ్యపేటలో క్రికెట్ పోటీలు

సంతకవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధి మల్లయ్యపేట గ్రామంలో ఈనెల 7వ తేదీ నుంచి మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎవర్‌గ్రీన్ యంగ్ బోయ్స్ యూత్ సభ్యులు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

# రాజాం

## పాఠశాల తనిఖీ

శివ్వాం (వంగర), న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో వై.దుర్గారావు అన్నారు. గురువారం మండల పరిధి శివ్వాం పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బయోమెట్రిక్ , మరుగుదొడ్ల వాడకం , తాగునీటి వసతిని పరిశీలించారు.

# మా గ్రామం ఏ పాపం చేసింది

### అధికారులను ప్రశ్నించిన రామరాయపురం గ్రామస్థులు



రామరాయపురంలో సమస్యలపై అధికారులను నిలదీస్తు న్న దృశ్యం

సంతకవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: మా గ్రామస్థులు ఏం పాపం చేశారు.. మా గ్రామం అభివృద్ధి చెందనవరం లేదా, అధికారులు ఏం చేస్తున్నారు.. గత నాలుగు జన్మభూమిల్లోని ఫిర్యాదులకు ఒక్కటైన పరిష్కరించరా.. సమస్యలు పరిష్కారం కాని జన్మభూమి మాకు ఎందుకు.. అని మండల పరిధి రామరాయపురం గ్రామ సర్పంచి ఎన్ని శ్రీనివాసరావు తోపాటు గ్రామస్థులు అధికారులను ప్రశ్నించారు. గురువారం తహసీల్దార్ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో అధికారులకు మళ్లీ చేదు అనుభవం ఎదురైంది. సర్పంచి మాట్లాడుతూ గతంలో అర్హులైన 36 మందికి రూ.200 చొప్పున పింఛన్లు వచ్చేవని ఇప్పుడు నాలుగేళ్లుగా వాటిని నిలిపేశారన్నారు. గ్రామంలో ఎనిమిది సీసీ రహదారుల కోసం ప్రతిపాదనలు పంపించామని ఒక్కటీ మంజూరు కాలేదన్నారు. మా గ్రామస్థులు ఏం పాపం చేశారని అధికారులపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం దదికుమార్, ఏవో రంగారావు పాల్గొన్నారు.

వంగర, న్యూస్‌టుడే : ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకే 'జన్మభూమి మాఊరు' కార్యక్రమని వంగర జడ్పీటీసీ సభ్యులు బొత్స వాసుదేవరావునాయుడు అన్నారు. గురువారం ఎం.సీతారాంపురంలో సర్పంచి లెంక రామినాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సభ ప్రారంభంలోనే అధికారులను ప్రజలు ప్రశ్నించారు. శివ్వాంలోనూ ఎంపీడీవోకు చేదు అనుభవం ఎదురైంది. మరువాడలో తహసీల్దార్ జి.మంగు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో పథకాలు అందడం లేదని ప్రశ్నించారు. కోనంగిపాడులో వైస్ ఎంపీపీ బౌరోతు రాంబాబు ఆధ్వర్యంలో సభ నిర్వహించారు.

గడిముడిదాం (రాజాం), న్యూస్‌టుడే: పింఛన్ల కోసం జనం నిలదీశారు. మండలం గడిముడిదాం గ్రామంలో గురువారం జన్మభూమి- మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మహిళలు పింఛన్లు కోసం పట్టుబట్టారు. అర్హత ఉన్నా మాకెందుకు పింఛన్లు మంజూరు చేయడం లేదని వీరంతా ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా తహశీల్దార్ వై.శ్రీనివాసరావు జోక్యం చేసుకొని 45 మందికి అర్హత ఉందని తేల్చి ఆన్‌లైన్‌లో అధికారులు పొందుపర్చారని 19 మందికి మాత్రమే మంజూరయ్యాయన్నారు.



సాయన్న చానల్ ముంపు సమస్యను అధికారులకు ప్రశ్నిస్తున్న గ్రామస్థుడు

ఇందులో సర్పంచి బొత్స లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

◆ దోసరి, ఆగూరు, గడిముడిదాం గ్రామాల్లోనూ జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎమ్పీడీవో బలివాడ వెంకటేశ్వరరావు, సర్పంచి ఆగూరు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి , న్యూస్‌టుడే : తెదేపా హయాంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెదేపా నాయకులు అన్నారు. గురువారం మండల పరిధిలోని చాటాయివలస, వన్నలి , ఉంగరాడ, గుళ్లపాడు పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో తెదేపా మండల శాఖ అధ్యక్షులు వినయ్‌కుమార్, కార్యదర్శి మహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు చాటాయివలసలో పసుపు కుంకుమ కింద రూ. 1.25 లక్షలు ఒక సంఘానికి రూ.90 వేలు అందజేశారు. ఉంగరాడ గుళ్లపాడు , చాటాయివలసల్లో సీమంతాలు, ఉపకార వేతనాలు పంపిణీ చేపట్టారు. ఇందులో ఎంపీడీవో శంకరరావు , తహసీల్దార్ సరళ, సర్పంచి సింహాచలం పాల్గొన్నారు

సంతకవిటి, న్యూస్‌టుడే : గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకే జన్మభూమి గ్రామసభలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని మండల తెదేపా సీనియర్ నాయకులు కొల్ల అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ కేసరి అన్నారు. గురువారం వాసుదేవపట్నంలో నిర్వహించిన గ్రామ సభలో వీరు పాల్గొన్నారు. ఈ కార్యక్రంలో ఎంపీడీవో వేణుగోపాలనాయుడు, డీసీ గౌడ్, ఏపీవో హరనాథ్, వాసుదేవపట్నం సర్పంచి బి.వెంకటమ్మ, మాజీ సర్పంచి బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

సంతకవిటి, న్యూస్‌టుడే: సంతకవిటి మండలలో నిర్వహించిన జన్మభూమి మాఊరు గ్రామసభల్లో అధికారులను ప్రజలు అడుగడుగునా ప్రశ్నిస్తున్నారు. పోలీసుల సహకారంతో అధికారులు గ్రామ సభలు నిర్వహించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. గురువారం వాసుదేవపట్నం, తమరాం, మిర్తివలస పంచాయతీల్లో ఎంపీడీవో జి.వేణుగోపాలనాయుడు, తహశీల్దార్ గార సురేష్ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. తమరామంలో నిర్వహించిన సభలో సర్పంచి ఎం.రాధ అర్హులున్నా పింఛన్లు అందడం లేదని ఎంపీడీవో వేణుగోపాలనాయుడును నిలదీశారు. లబ్ధిదారులు గ్రామసభ నిర్వహించొద్దని నినాదాలు చేశారు. అక్కడే ఉన్న పోలీసులు కల్పించుకొని గ్రామసభను అడ్డుకోరాదని చెప్పడంతో సమస్య సద్దుమనిగింది. మిర్తివలసలో రహదారుల బాగుకు చర్యలు తీసుకోవాలని, అర్హులకు పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సర్పంచి పి.అప్పలనాయుడు, ఎంపీటీసీ ఆర్.కృష్ణ అధికారులను కోరారు. పంచాయతీల్లో వైద్యాధికారులు జి. భార్గవి, ఎ.భార్గవ్ వైద్య శిబిరాలు నిర్వహించారు.



మాట్లాడుతున్న జడ్పీటీసీ బొత్స వాసుదేవరావునాయుడు

## రాజాంలో సినిమాలు

● సీతారామా(మినీ): 2కంట్రీస్ ● అప్సర: ఎం.సి.ఎ
● సీతారామా: హలో –న్యూస్‌టుడే, రాజాం

## ఎమ్మెల్యే పల్లెనిద్ర

మరువాడ (వంగర), న్యూస్‌టుడే : రానున్న జగనన్న పాలనలో 'రచ్చబండ - పల్లెనిద్ర' కార్యక్రమంలో తెలుసుకున్న సమస్యలను పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం మండల పరిధి మరువాడలో సర్పంచి గాడి కృష్ణవేణి, మధుసూదనరావు అధ్యక్షతన 'రచ్చబండ - పల్లె నిద్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో పింఛన్లు అందడం లేదని, మందుగుండు పేలుడు ఘటన జరిగి మూడేళ్లు అవుతున్నా భర్తలను కోల్పోయిన బాధితు మహిళలకు ఇప్పటివరకు పింఛన్లు మంజూరు చేయలేదని , జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో వైకాపా నాయకులు కరణం సుదర్శనరావు, సురేష్‌ముఖర్జీ, మురళీకృష్ణ, జోగినాయుడు, సత్యారావు పాల్గొన్నారు.



పల్లె నిద్ర చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, వైకాపా నాయకులు

## ఎన్.ఎస్.ఎస్.విద్యార్థుల భారీ ర్యాలీ



మడ్డువలస గురుకుల కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

మడ్డువలస (వంగర), న్యూస్‌టుడే : బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలకాలని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ వెంకటరావు అన్నారు. గురువారం మండల పరిధి మడ్డువలస సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో వైస్ ప్రిన్సిపల్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

వంగర, న్యూస్‌టుడే : 'స్వచ్ఛతపై విద్యార్థులకు ర్యాలీలు నిర్వహించారు. గురువారం మండల పరిధి భాగెంపేట , మరువాడ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో స్వచ్ఛ ర్యాలీలు నిర్వహించారు. ఇందులో సర్పంచులు సరోజనమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాజాం, న్యూస్‌టుడే: మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని విద్యార్థులు నినదించారు. స్థానిక జీసీఎస్‌ఆర్ కళాశాల నుంచి రాజాం పట్టణంలోని పాలకొండ కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీ పొడుగునా నినాదాలు చేశారు. ఇందులో కళాశాల ప్రిన్సిపల్ డా. కేవీఏనాయుడు తోపాటు కళాశాల అధ్యాపకులంతా పాల్గొన్నారు.



మడ్డువలసలో ర్యాలీ నిర్వహిస్తున్న గురుకుల కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థినులు




ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

## అధ్యాపకులు నిరంతర విద్యార్థులుగా ఉండాలి

### డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. పీవీ కృష్ణాజీ



సూర్యారావును సన్మానిస్తున్న ప్రిన్సిపల్, ఇతర ప్రముఖులు

రాజాం, న్యూస్‌టుడే: అధ్యాపకులు నిరంతర విద్యార్థులుగా ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. పీవీ కృష్ణాజీ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ పీవో డా. పిడుగు సూర్యారావు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన నేపథ్యంలో గురువారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. సూర్యారావు దంపతులను ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ 'మహిళా సాధికారత' అన్న అంశంపై పరిశోధన చేయడం హర్షణీయమన్నారు. నిరంతరం తెలుసుకోవాలన్న తపన, ఏదో సాధించాలన్న కసి ఉంటే ఇలాంటి పరిశోధన సునాయాశంగా సాధించవచ్చని చెప్పారు. ఇందులో రెడ్‌క్రాస్ సంస్థ రాజాం శాఖ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పార్వతీశ్వరరావు, ఈశ్వరరావు, శ్రీనివాసరాఇవు, జయకుమారి, పి.చైతన్య, వాయు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నిలిచిన మడ్డువలస నీటి విడుదల

రేగిడి, న్యూస్‌టుడే : రబీ కోసం మడ్డువలస నీరు విడుదల చేసిన అధికారులు ప్రస్తుతం నీటి విడుదలను నిలిపేశారు. గతనెల 15న కలెక్టర్ చేతుల మీదుగా జలాశయం గేట్లు తెరిచి కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేశారు. ఆరుతడి పంటలు వేయాలని రైతులకు సూచించినా ఎక్కువ విస్తీర్ణంలో అపరాల సాగునే చేపట్టారు. ప్రస్తుతం నీటి అవసరం రైతులకు అంతగా లేదని జలాలు వృథాగా పోతున్నట్టు గుర్తించి కాలువల్లో నీటిని తాత్కాలికంగా నిలపివేశామని అధికారులు చెబుతున్నారు. మళ్లీ ఎప్పుడు అవసరమైతే అప్పుడు విడిచిపెడతామన్నారు.

# రాజాం

## పోరాటం ఆపేదిలేదు

**వాల్తేరు, (సంతకవిటి), న్యూస్‌టుడే :** నాగావళి నదిపై వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసేవరకూ పోరాటం ఆపేదిలేదని వంతెన పోరాట కమిటీ కన్వీనర్ నారాయణస్వామి అన్నారు. సంతకవిటి మండలంలోని వాల్తేరు, ఆమదావలస మండలాల్లోని ఇసుకలపేట గ్రామాల మధ్య వంతెన నిర్మించాలంటూ 320 రోజులుగా వంతెన పోరాట కమిటీ రిలేనిరాహార దీక్ష చేస్తుంది. గురువారం కమిటీ కన్వీనర్ ఆధ్వర్యంలో వాల్తేరులో దీక్ష కొనసాగించారు.




# అభివృద్ధిలో ఆదర్శం

- నిధుల వినియోగంలో ప్రథమస్థానంలో సురవరం
- గ్రామంలో రోడ్లు, వీధికాలువల నిర్మాణం
- ఉపాధి నిధులతో సుందరంగా శ్మశానవాటిక నిర్మాణం

**న్యూస్‌టుడే, సురవరం, (సంతకవిటి)**

వెలుగు ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలనే నానుడిని ఆ గ్రామ సర్పంచి, గ్రామ పెద్దలు నిజం చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు కుమ్మరించినప్పుడే గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటే ప్రజలకు మేలు చేసినవారం అవుతామని భావించి పూర్తిస్థాయిలో పనులు చేపడుతూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఆ గ్రామస్థులు. ప్రభుత్వం పంచాయతీకి మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతో ఆ గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొద్ది రోజులుగా స్వచ్ఛభారత్‌పై దృష్టి పెట్టాలని ప్రజాప్రతినిధులకు ఒకటికి పదిమార్లు చెబుతున్నాయి. దీన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు ఆ సర్పంచి. మరుగుదొడ్ల నిర్మాణం, సిమ్మెంట రహదారులు, వీధి కాలువల నిర్మాణం, పంచాయతీ కార్యాలయం, అంగన్వాడీ భవనం, గ్రామంలో గ్రావెల్ రోడ్ల నిర్మాణం, నీరుచెట్టు నిధులతో సాగునీటి వనరుల అభివృద్ధి చేయడంతో పాటు, శ్మశానవాటిక పనుల్లో స్ఫూర్తిగా నిలుస్తున్నారు సంతకవిటి మండలంలోని సురవరం సర్పంచి గంటా అనురాధ. సురవరం పంచాయతీ ఇతర పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తోంది.


సురవరంలో ఓ వీధిలో నిర్మించిన సిమెంటు రోడ్డు, కాలువలు

### 80 శాతం మరుగుదొడ్ల నిర్మాణం

సురవరం పంచాతీలో 94 కుటుంబాలు ఉన్నాయి. వీరిలో ఇప్పటికే 64 కుంటుబాలు మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేశారు. 15 కుటుంబాలు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. 15 కుటుంబాలు మరుగుదొడ్లు నిర్మించుకోవాల్సి ఉంది. పంచాయతీలో శతశాతం మరుగుదొడ్లు నిర్మించేందుకు గ్రామ సర్పంచి అనురాధ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. దీనికి ముందు గ్రామంలో ఆరుబయట మలవిసర్జన లేకుండా తీర్మానించుకోవడం, ఆదిశగా ముందుకు వెళ్తుండడం ఆనందంగా ఉంది.

### వాడవాడలా రహదారులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ జనాభా ఉన్న పంచాయతీల్లో రహదారులు, వీధికాలువలు అభివృద్ధికి పది శాతం నిధులు పంచాయతీ చెల్లిస్తే, 90 శాతం ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లించేందుకు ముందుకు వచ్చింది. ఈ అవకాశం సురవరం పంచాయతీకి ఎంతో మేలు చేకూరింది. గ్రామంలో తక్కువ జనాభా ఉండటంతో రూ.20 లక్షల నిధులతో వాడవాడలా సిమ్మెంటు రహదారులు, వీధి కాలువల నిర్మాణం చేపట్టారు. ◆ నీరు చెట్టు నిధులు రూ.7.50 లక్షలతో గ్రామంలోని తాగునీటి చెరువులను అభివృద్ధి చేశారు. రూ.5 లక్షలతో గ్రామంలో వాడవాడలా తాగునీటిపైపులైన్లు వేసి ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్నారు. రూ.4.50 లక్షలతో పంచాయతీ భవనం నిర్మించారు. రూ.9 లక్షలతో గ్రామంలోని పంట పొలాలలకు గ్రావెల్ రహదారులు నిర్మించారు.

### రూ.5 లక్షలతో శ్మశానవాటిక

గ్రామంలో మృతి చెందిన వారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు చేపట్టిన శ్మశానవాటిక నిర్మాణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వం రూ.5 లక్షలు నిధులు మంజూరు చేయడంతో ఈ పనులు ఇప్పటికే పూర్తి చేసి, మిగిలిన పంచాయతీలకు ఆదర్శంగా నిలిచారు.


సురవరంలో నిర్మించిన శ్మశానవాటిక

### ప్రజల కోసం



గ్రామానికి మేలు చేయాలని తపనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న నిధులు సద్వినియోగం చేశాం. రహదారులు , మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గ్రామంలో బహిరంగ మలవిసర్జన చేయకుండా ఉండేలా గ్రామంలో తీర్మానం చేసి ఆదిశగా అడుగులు వేస్తున్నాం.

**-గంటా అనురాధ, సర్పంచి, సురవరం**

### నిధులు వస్తుండడంతో బాగు చేసుకుంటున్నాం

ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తుంది. వస్తున్న నిధులతో ప్రణాళికాబద్ధంగా గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు మాకు అండగా నిలుస్తున్నారు.

**- డి.కుమారస్వామి, ఉప సర్పంచి**

### ఆదర్శంగా నిలుస్తుంది

సంతకవిటి మండలంలోని సురవరం గ్రామంలో రహదారుల నిర్మాణం, మరుగుదొడ్లు, శ్మశానవాటిక నిర్మాణంలో ఆదర్శంగా నిలుస్తుంది. వీటి నిర్మాణంలో ఆ పంచాయతీ ఆదర్శంగా నిలుస్తుంది. సురవరం పంచాయతీని ఆదర్శంగా తీసుకుని అన్ని పంచాయతీల్లో శతశాతం మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి.

**-జి.కృష్ణారావు, ప్రత్యేకాధికారి, సంతకవిటి**

## తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

**సంతకవిటి, న్యూస్‌టుడే :** తేనెటీగల దాడిలో పలువురికి గాయాలయ్యాయి. సంతకవిటి జూనియర్ కళాశాల సమీపంలోని ఓ చెట్టుకు ఉన్న తేనెపట్టుపై కొందరు రాళ్లు విసరడంతో ఒక్కసారిగా ఈగలు దాడిగి దిగాయి. గురువారం సంతకవిటి - రాజాం ఆర్అండ్‌బీ రహదారిపై నుంచి వస్తున్న వారిని, అటుగా వచ్చిన కళాశాల విద్యార్థులను దాడిచేసి గాయపర్చాయి. తేనెటీగల దాడిలో కేఆర్‌పురం గ్రామానికి చెందిన ఐ.మోహనరావుకు తీవ్రగాయాలయ్యాయి. సంతకవిటి జూనియర్ కళాశాలలో చదువుతున్న సాయి, ఆర్.గోవింద, కె.రాంబాబు, డి.ధనలక్ష్మి, భాగ్యలక్ష్మిలను తీవ్రంగా గాయపరిచాయి. నొప్పిని భరించలేక గాయపడిన వారంతా సంతకవిటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు.


గాయపడిన విద్యార్థులకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

## ఇరువర్గాల మధ్య కొట్లాట

**సంగాం (వంగర), న్యూస్‌టుడే :** మండల పరిధి సంగాంలో ఇంటి స్థలం సమస్య ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. గురువారం సంగాంకు చెందిన అల్లు శ్రీరామ్ కుటుంబం ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. నిర్మాణంలో ఉన్న స్థలం అదే గ్రామానికి చెందిన సింగనపల్లి కృష్ణ కుటుంబ సభ్యులదని ఇటీవల అడ్డుతగిలారు. దీంతో గ్రామంలోని పెద్దల సమక్షంలో ఇరు కుటుంబాల మధ్య రాజీ కుదిరింది. అయినప్పటికీ పాతకక్షతో వారిద్దరి మధ్య గురువారం వివాదం చోటుచేసుకుంది. చివరికి అది రాజకీయ రంగు పులముకొని కొట్లాటకు దారితీసింది. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు వంగర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం రాజాం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కాంతారావు తెలిపారు.



సంగాం తగాదాలో గాయపడిన అల్లు శ్రీరామ్, సంగంనాయుడు

## కౌమారదశలో అప్రమత్తంగా ఉండాలి

**పాతర్లపల్లి (రణస్థలం), న్యూస్‌టుడే:** ప్రతి వ్యక్తి కౌమారదశలో అప్రమత్తంగా ఉండాలని ఉర్వి ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు నాగభూషణరావు అన్నారు. పాతర్లపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం వ్యక్తిత్వ వికాస సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల వయసులో కుమారుడు చనిపోయాడని, నేను ఓ ఐపీఎస్ అధికారినైనా ఏమీ చేయలేని పరిస్థితితన్నారు. పదవీవిరమణ తర్వాత అబ్బాయి పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కమాండర్ చిన వీరయ్య మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తగిన నైపుణ్యత పెంపొందించుకోవాలన్నారు.

## క్రీడల పట్ల మక్కువ పెంచాలి


విద్యార్థుల ఖోఖో ఆటను తిలకిస్తున్న తహసీల్దార్ సరళ తదితరులు

**రేగిడి.న్యూస్‌టుడే:** ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు క్రీడల పట్ల మక్కువ పెంచాలని తహసీల్దార్ సరళ, ఎంఈవో ప్రసాదరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని చాటాయవలస పాఠశాలను సందర్శించి విద్యార్థుల క్రీడాసక్తిని పరిశీలించారు.

## ప్రతిభాభారతిని పరామర్శించిన కలమట

**సంతకవిటి, న్యూస్‌టుడే :** సంతకవిటి మండలం కావలి గ్రామంలో మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి కుటుంబాన్ని గురువారం పాతపట్నం ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పరామర్శించారు. మనవడు విఖ్యాత్ ఎలా మృతిచెందాడో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పాతపట్నం నియోజకవర్గ తెదేపా నేతలు ఉన్నారు.


ప్రతిభాభారతిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణ

## తితిదే ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం

**లావేరు, న్యూస్‌టుడే:** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీకాకుళం ధర్మప్రచార్ పరిషత్ సహకారంతో తాళ్లవలస రామ మందిరం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు లలితావాణి ఆధ్వర్యంలో శ్రీకాకుళం భాగవతార్ గొండు రామ్మూర్తిచే గజేంద్ర పురాన కాలక్షేపం నిర్వహించారు. వెంకటేశ్వర భజన బృందం ఆధ్వర్యంలో చేపట్టిన భజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం అయిదు రోజుల పాటు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## ముఖద్వారానికి శంకుస్థాపన

**రణస్థలం, న్యూస్‌టుడే :** జాతీయ రహదారి నుంచి బంటుపల్లి గ్రామ రహదారి ప్రవేశంలో ముఖద్వారం నిర్మించేందుకు మహాలక్ష్మి యువజన సంఘం అధ్యక్షులు ఎన్.ఈశ్వరరావు, యూబీ పరిశ్రమ జనరల్ మేనేజరు చిరంజీవి గురువారం శంకుస్థాపన చేశారు. యూబీ పరిశ్రమ సహకారంతో రూ.15 లక్షల వ్యయంతో ఈ నిర్మాణం చేపట్టనున్నట్లు ఈశ్వరరావు తెలిపారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

## బహిరంగ మలవిసర్జన వద్దు

**రేగిడి.న్యూస్‌టుడే:** బహిరంగ మల విసర్జనతో అనేక రకాల అనర్థాలు ఉన్నాయని దాన్ని ప్రతి ఒక్కరు గుర్తించి మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రచారం చేశారు. గురువారం మండల పరిధిలోని సంకిలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఆరుబయట వద్దు మరుగుదొడ్డే ముద్దు అంటు నినాదాలు చేశారు. పురవీధుల్లో తిరుగుతూ ప్రజలకు చైతన్యం కలిగించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు దీన్ని చేపట్టామని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ అన్నారు.

# శ్రీకాకుళం

## నగరంలో సామూహిక సీమంతాలు

బలగ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: నగరంలోని పుణ్యపువీధి, బాకర్‌సాహేబ్ పేట తదితర ప్రాంతాలలో గురువారం సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు అతిథిగా ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి హాజరయ్యారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ ఎంఎన్ రాణి, సూపర్‌వైజర్లు మంగమ్మ, యశోద, బీవీ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెరపై సినిమాలు

● కిన్నెర సినీమాక్స్: 2 కంట్రీస్, ● కీర్తన: జుమాంజీ (వెల్‌కమ్ టు జంగిల్), * ఎస్‌వీసీ (రామలక్ష్మణ): ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయ్), ●సన్ మ్యాక్స్ (చంద్రమహల్): ఒక్క క్షణం, ● మారుతి: సారథి, ● సూర్యమహల్: ఆక్సిజన్, ● రామకృష్ణ: జవాన్, ● సరస్వతి: హలో

-న్యూస్‌టుడే, అరసవల్లి

# ప్రజా సమస్యల పరిష్కారమే 'జన్మభూమి' ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీదేవి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించే ధ్యేయంతో 'జన్మభూమి- మాఊరు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని 13, 14, 15, 16, 18, 23 డివిజన్లలో గురువారం నిర్వహించిన జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఆయా డివిజన్లలో గర్భిణులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 23వ డివిజనులో మసీదు వెనుక ఇటీవల రూ.15 లక్షల వ్యయంతో సీసీ రహదారి పనులు చేపట్టినందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యేను స్థానిక మండల వీధి వాసులు సత్కరించారు. జన్మభూమి సదస్సుల్లో నగరపాలక సంస్థ కమిషనర్ జి.వెంకటేశ్వరరావు, ఏసీపీ డి.ఎస్.వి.కుమార్, సహాయ కమిషనర్ ఎం.జీవరత్నం, తెదేపా నగర అధ్యక్షుడు వెంకటేష్, నగరపాలక సంస్థ ప్రాజెక్టు అధికారి ఎం.జగన్మోహనరావు, జన్మభూమి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### అందరికీ సంక్షేమ పథకాలు

ఖాజీపేట, పెద్దపాడు, కళ్లేపల్లి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, సమాజంలోని ఏ ఒక్కరిని విడిచిపెట్టలేదని శాసనసభ్యురాలు గుండ లక్ష్మీదేవి అన్నారు. గురువారం శ్రీకాకుళం గ్రామీణ మండలంలోని ఖాజీపేట, పెద్దపాడు, కళ్లేపల్లి గ్రామ పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒంటరి మహిళలకు, హిజ్రాలకు కూడా పింఛన్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. కార్యక్రమాల్లో ఉపతహసీల్దార్ పూజారి రాంబాబు, ఈవోపీఆర్డీ నిశ్చల, ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, సూర్యనారాయణ, బి.బాబురావు, విశ్వనాథం, శీర రమణయ్య, చిట్టి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కొర్లాం (గార), న్యూస్‌టుడే: ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం అవలంబిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జన్మభూమి ప్రత్యేక పర్యవేక్షణాధికారి విక్రాంత్ పాటిల్ అన్నారు. మండలంలోని కొర్లాం, అంబళ్ళవలస గ్రామాల్లో ఎంపీడీవో పి.కాంతారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో భాగంగా కొర్లాం పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మరుగుదొడ్లను మంజూరు చేస్తోందన్నారు. గర్భిణులకు ప్రసూతి సౌకర్యార్థం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రూ. కోట్లు వెచ్చించి సదుపాయాలను కల్పిస్తున్నారన్నారు. అంబళ్ళవలసలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు పీస వెంకటరమణమూర్తి, అంపోలు సర్పంచి గొండు వెంకటరమణమూర్తి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కొర్లాం సర్పంచి సూరమ్మ, వైద్యాధికారులు పి.జగదీష్, యుగంధర్, ఆర్ఐ శ్రీనివాసరావు, ఉపాధి హామీ జేఈ నారన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కొర్లాంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి విక్రాంత్ పాటిల్

### వినతులకు సత్వర పరిష్కారం

శాలిహుండం (గార), న్యూస్‌టుడే: అర్హులకు ఏమైనా సంక్షేమ పథకాలు అందకుంటే దరఖాస్తులు చేయాలని.. సత్వరం పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎ.సింహాచలం తెలిపారు. జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా ఆధ్వర్యంలో గురువారం శాలిహుండం, వత్సవలస గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శాలిహుండం గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారి ఆక్రమణలకు గురైందని.. రహదారి పక్కనున్న సాగునీటి కాలువను సైతం కొందరు రైతులు ఆక్రమించుకున్నారని కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్‌తో పాటు మండల ప్రత్యేకాహ్వానితుడు గుండ భాస్కరరావు, సర్పంచి కొంక్యాణ ఆదినారాయణలు స్పందించి.. సర్వేయర్ రఘును పంపించి ఆక్రమణలు గుర్తించారు. జేసీబీ సాయంతో కాలువ పునరుద్ధరణ, రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా స్థానిక పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రామ్మోహన్‌రావు, ఆర్ఐ రామక్రిష్ణ, మాజీ ఎంపీపీ పుల్లటి నాగేశ్వరరావు, వ్యవసాయాధికారి పైల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



శాలిహుండంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సింహాచలం



ఖాజీపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

## విద్యుత్తు తీగలకు మరమ్మతులు

### 'ఈనాడు' కథనానికి స్పందన



బోరవానిపేట పంటపొలాల్లో సరిచేసిన తీగలు

బోరవానిపేట (గార), న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లోని పంట పొలాల్లో విద్యుత్తు తీగలు, నియంత్రికలు ప్రమాదకరంగా ఉన్న అంశంపై 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన ఈనాడు బుధవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్తు శాఖ ఏఈ జగదీష్ స్పందించారు. గ్రామ పరిధిలో ఉన్న విద్యుత్తు తీగలను సిబ్బందితో కలిసి గురువారం సరిచేశారు. ఎస్‌డీఎన్‌పేటలో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సంక్రాంతి అనంతరం మార్చనున్నట్లు ఏఈ తెలిపారు. మరమ్మతు పనుల్లో లైన్‌మేన్ ఆరంగి రవి, సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న తిరుప్పావై ప్రవచనాలు



తిరుప్పావై పాశురం పఠిస్తున్న స్థానాచార్యులు

శ్రీకూర్మం (గార), న్యూస్‌టుడే: శ్రీకూర్మం శ్రీకూర్మనాథ స్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో నిర్వహిస్తున్న ధనుర్మాసం తిరుప్పావై ప్రవచనాలు కొనసాగుతున్నాయి. గురువారం 20వ పాశురంలోని విశేషాలను స్థానాచార్యులు పద్మనాభాచార్యులు భక్తులకు వివరించారు.

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడి అరెస్టు, విడుదల

గార,న్యూస్‌టుడే: మండలంలోని శ్రీకూర్మం పంచాయతీ చింతువలస గ్రామానికి చెందిన రాణా శ్రీనివాస్ మాదిగను గార పోలీసులు గురువారం తెల్లవారుజామున అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఇచ్ఛాపురంలో జన్మభూమి కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరు కానున్న నేపథ్యంలో జిల్లాలోని ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అనంతరం సాయంత్రం విడిచిపెట్టారు.

## ప్రథమ చికిత్సపై విద్యార్థులకు అవగాహన అవసరం

గుజరాతీపేట (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: గుజరాతీపేటలోని వరం నగరపాలక ఉన్నత పాఠశాలలో గురువారం ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రాథమిక వైద్యంపై జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా క్షేత్ర అధికారి జి.విజయబాబు, సర్వ్ సూపర్‌వైజర్ బి.శ్రీధర్ తదితరులు విద్యార్థులకు నీట మునగడం, పొల మారడం, కుక్కకాటు, పాముకాటు, రక్తస్రావం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎక్కడైనా కిందపడిపోయిన వారిని జాగ్రత్తగా తీసుకునివెళ్లే విధానం, దెబ్బలకు కట్లు కట్టడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఇందిరామణి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఆర్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ చికిత్సపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

## ఇందిరామణి సేవలు ప్రశంసనీయం

గుజరాతీపేట (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనలో, పాఠశాల అభివృద్ధిలో ఇందిరామణి కృషి ప్రశంసనీయమైనదని.. ఆమె ఏ పాఠశాలలో పనిచేసినా క్రమశిక్షణాయుతమైన వాతావరణం నెలకొంటుందని యూటీఎఫ్ నేతలు కొనియాడారు. సావిత్రిబాయి పూలే రాష్ట్ర ఉత్తమ మహిళా ఉపాధ్యాయినిగా పురస్కారం అందుకున్న నేపథ్యంలో ఎం.వరహానరసింహం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమెను గురువారం పాఠశాలలో యూటీఎఫ్ నగర శాఖ ఆధ్వర్యంలో ఘనంగా అభినందించారు. యూటీఎఫ్ నగర శాఖ అధ్యక్షుడు శరత్‌బాబు, ప్రధాన కార్యదర్శి డి.వి.ఆర్.పట్నాయక్, కార్యదర్శి ఎం.శ్రీను, జగదీష్ జీవరత్నం, సంగమేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వరరావు, కె.ఎన్.గుప్తా, శిరీషకుసుమ, వెంకటలక్ష్మి, ఉష, కళ్యాణి, వెంకటరత్నం శోభారాణి, తారాబాయి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరామణిని అభినందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

### మహిళాభివృద్ధికి కృషి చేయాలి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో బాలికా విద్యకు, మహిళాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.వాగ్దేవి అన్నారు. గురువారం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ నగరశాఖ ఆధ్వర్యంలో సావిత్రీబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాగ్దేవి మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయి సావిత్రిబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కార గ్రహీత పి.ఇందిరామణిని సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సీనియర్ నాయకులు కె.రామలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా కార్యదర్శులు పి.సూర్యప్రకాశరావు, జి.శారద, సంఘం నాయకులు బి.ధనలక్ష్మి, హెచ్. అన్నాజీరావు, ఎం.శిరీషకుసుమ, రమణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు వైద్యపరీక్షలు



పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అరసవల్లి, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మైక్యూర్ ఆసుపత్రి నిర్వాహకులు గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాలలో భక్తులకు రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి, మందులు ఇచ్చారు.

# శ్రీకాకుళం

## వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాల ఎన్నిక

**శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే:** నగరంలోని ఓ కల్యాణ మండపంలో శ్రీకాకుళం గ్రామీణ మండలం, నగరం వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా బి.అసిరినాయుడు, ఉపాధ్యక్షుడిగా సీహెచ్.మోహనరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.అప్పలస్వామినాయుడు, సహ కార్యదర్శిగా పి.కామేశ్వరరావు, కోశాధికారిగా డి.శ్రీధర్ ఎన్నికయ్యారు. సంఘం నగర అధ్యక్షుడిగా కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా ఎం.రామారావు, ప్రధాన కార్యదర్శిగా జి.వాసుదేవరావు, సహాయ కార్యదర్శిగా ఎం.సింహాచలం, కోశాధికారిగా ఎస్.ప్రసాదరావులను ఎన్నుకున్నారు. సభ్యులుగా సీహెచ్.హిమగిరి, బి.రామకృష్ణారావు, ఆర్.రమణమూర్తి, టి.లక్ష్మణరావు, ఎ.నరసయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎ.చక్రధర్, ఎం.రామ్మోహన్‌రావు, జి.శ్యామలరావు, పి.రమేష్, వి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**గ్యాస్ సమాచారం:** ● శ్రీదేవిప్రసాద్ ఎంటర్‌ప్రైజెస్ (హెచ్‌పి): జనవరి 4న నమోదు చేసిన వారికి జనవరి 5న సరఫరా చేస్తారు. ● వేదమాత ఎంటర్‌ప్రైజెస్ (హెచ్‌పీ): జనవరి 4న నమోదు చేసిన వారికి జనవరి 5న సరఫరా చేస్తారు. ● ప్రియలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ (భారత్): జనవరి 4న నమోదు చేసిన వారికి జనవరి 5న సరఫరా చేస్తారు. * సిరి భారత్ గ్యాస్ ఏజెన్సీ: జనవరి 4న నమోదు చేసిన వారికి జనవరి 5న సరఫరా చేస్తారు.

**-న్యూస్‌టుడే, కలెక్టరేట్ (శ్రీకాకుళం)**



## ఆరుబయట మలవిసర్జన నిర్మూలనపై అవగాహన



వప్పంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా కళాశాల విద్యార్థినులు

**కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే:** స్వచ్ఛాంధ్ర సాధన కోసం ఆరుబయట మలవిసర్జనపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. జన్మభూమిలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం.బాబురావు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన వల్ల ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించే మరుగుదొడ్ల నిర్మాణ సహాయాన్ని పొంది, వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి.లచ్చన్న, ఐక్యూఏసీ సమన్వయకర్త ఎన్.ఎస్.ఎన్ స్వామి, ఎన్‌సీసీ అధికారి వై.పోలినాయుడు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వై.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

**వప్పంగి (కలెక్టరేట్), న్యూస్‌టుడే:** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం-2 ఆధ్వర్యంలో వప్పంగి గ్రామంలో విద్యార్థినులు గురువారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రం చేసి.. అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మరుగుదొడ్ల ఆవశ్యకతపై గ్రామస్థులను ప్రజలను చైతన్యం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. ఎం.ఆర్.జ్యోతి ఫ్రెడరిక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కె.కరుణ, డా. కె.జ్యోతిలక్ష్మి, అధ్యాపకులు గోల్డీనా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే:** స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో గురువారం ఓడీఎఫ్ ర్యాలీ నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి కళింగ రహదారి మీదుగా ఏడురోడ్ల కూడలి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డి నిర్మాలించుకోవాలని, ఉపయోగించాలని ఈ ర్యాలీలో పాల్గొన్న వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ ఇంజినీరు జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలు నగరపాలక సంస్థ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపల్, అధ్యాపకులు



బలగ గిరిజన ఆశ్రమ పాఠశాలలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు

### విద్యార్థుల ప్రతిజ్ఞ

**బలగ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే:** నగరంలోని బలగ సమీపాన ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో గురువారం ఓ నూతన కార్యక్రమానికి నాంది పలికారు అక్కడి విద్యార్థినులు. మారుమూల గిరిజన తండాలలో నివసిస్తున్న తమ తల్లిదండ్రులకు బహిరంగ మలమూత్ర విసర్జన వలన వచ్చే పర్యావసానాలు వివరించి, వారిలో చైతన్యం తీసుకువస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ధనుర్మాస మేలుకొలుపులు



బలగలో ధనుర్మాస మేలుకొలుపులు నిర్వహిస్తున్న దృశ్యం

**శ్రీకాకుళం సాంస్కృతికం,** న్యూస్‌టుడే: నగరంలోని పలు దేవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బలగ, పొందరవీధి, బుచ్చిపేట, బొందిలీపురం తదితర ప్రాంతాల్లో గురువారం వేకువజాము నుంచే ధనుర్మాస మేలుకొలుపులు, భజన కార్యక్రమం చేశారు. నానుబాలవీధిలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో, పాలకొండరోడ్డులోని కోదండరామాలయంలో, బ్యాంకర్స్ కాలనీలోని శివబాలాజీ ఆలయంలో, పాండురంగవీధిలోని శ్రీరామమందిరంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించారు.

## ఉచిత న్యాయసాయాన్ని సద్వినియోగం చేసుకోండి



వృద్ధాశ్రమంలోని మహిళలతో మాట్లాడుతున్న శ్యామలాదేవి

**పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే:** జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ కార్యదర్శి కె.శ్యామలాదేవి పేర్కొన్నారు. గురువారం పాతశ్రీకాకుళంలోని ప్రశాంతి వృద్ధజనాశ్రమాన్ని, బెహరా మనోవికాస కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులతో ఆమె మాట్లాడుతూ ఉచిత న్యాయసహాయం అవసరమైతే తమను సంప్రదించాలని సూచించారు. రెండు ఆశ్రమాల్లోని వసతులు, సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## అవగాహన రాహిత్యంతోనే ఆరోపణలు: ఎమ్మెల్యే

**శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో జన్మభూమి కమిటీలు అధికారికంగా ఉన్నాయని, ఈ విషయంపై కనీస అవగాహన లేకుండా నగరంలో జరిగే జన్మభూమి డివిజన్ సదస్సుల్లో నగర జన్మభూమి కమిటీ నాయకుడు వెంకటేష్ ఎలా పాల్గొంటారంటూ వైకాపా నాయకులు ప్రశ్నిస్తున్నారని ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. నగరంలోని 15వ డివిజన్‌లో స్థానిక తెదేపా నాయకుని నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారికంగా జన్మభూమి కమిటీ నాయకులు సదస్సుల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ఇకపై వైకాపా నాయకుల అవినీతి ఆక్రమాలను ప్రతి డివిజన్‌లో ప్రజలకు వివరిస్తానన్నారు.

## నిలిచిన పనులు .. నిత్యం అవస్థలు



గొంటివీధిలో అసంపూర్తిగా నిర్మించిన సీసీ రహదారి

**శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే:** నగరంలోని ప్రకాశనగర్ కాలనీ నుంచి వన్‌వే ట్రాఫిక్ రహదారి వరకు గొంటివీధిలో చేపడుతున్న సీసీ రహదారి పనులు గత కొద్ది రోజులుగా అర్ధంతరంగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఈ ప్రాంతంలోని ప్రాథమిక పాఠశాల నుంచి వన్‌వే ట్రాఫిక్ రహదారి వరకు ఇటీవల సీసీ రహదారి పనులను సంబంధిత గుత్తేదారు ప్రారంభించారు. పనులు పూర్తి చేయకుండా మధ్యలో వదిలేయడం వల్ల నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ జి.వెంకటేశ్వరరావును వివరణ కోరగా పనులు సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఆకట్టుకున్న కళాప్రదర్శనలు



ఇంద్రజాల ప్రదర్శనలో దృశ్యం

**శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** నగరంలోని బాపూజీ కళామందిరంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన్మభూమి సంక్రాంతి సంబరాల్లో భాగంగా గురువారం విజయనగరానికి చెందిన సత్యనారాయణ పండిట్ ఇంద్రజాల ప్రదర్శన, నరసన్నపేటకు చెందిన శ్రీనివాస పండిట్ మిమిక్రీ ప్రదర్శన, మాట్లాడే బొమ్మప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గాయకుడు బి.ఎ.నారాయణ పాల్గొని కళాకారులను అభినందించారు. శుక్రవారం సాయంత్రం బాపూజీ కళామందిరంలో తప్పెటగుళ్లు ప్రదర్శన, జానపద నృత్యాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

## 'ఎస్టీల్లో చేర్చేవరకు మత్స్యకారుల పోరాటం'



దీక్షల్లో పాల్గొన్న మత్స్యకారులు

**కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే:** మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చేవరకు వెనుకడుగు వేయకుండా పోరాటం కొనసాగిస్తామని మత్స్యకార ఎస్టీ సాధన సమితి ప్రతినిధులు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 25 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ డిమాండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న తమ స్థితిగతులను పరిశీలించి ప్రత్యేక కమిషన్ వేసి ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గురువారం నాటి దీక్షల్లో సంతబొమ్మాళి, గార మండలాల మత్స్యకారులు కూర్చున్నారు. కార్యక్రమంలో మత్స్యకార సాధన సమితి ప్రతినిధులు దూడ సుధాకర్, చింతపల్లి సూర్యనారాయణ, మోస ఫల్గుణరాజు, మైలపల్లి లక్ష్మడు, ఎం.నర్సింగరావు, ఎం.నర్సింహమూర్తి, కేశవ రాంబాబు, కె.సింహాచలం, కె.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ తిరుమలలో 24న సహస్ర దీపాలంకరణ



స్వామివారికి హారతి ఇస్తున్న దృశ్యం

**గుజరాతీపేట (శ్రీకాకుళం), న్యూస్‌టుడే:** నగరంలోని గుజరాతీపేటలో గల నారాయణ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 24న సహస్ర దీపాలంకరణ, 27న కూడారై ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా గురువారం వేకువజామున 5 గంటలకు తిరుప్పావై 20వ పాశురం చదివిన అంతనరం భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సహస్ర దీపాలంకరణ, కూడారై ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# టెక్కలి

## డిజిటల్ తరగతిగది ప్రారంభం

ఆకాశలఖవరం (సంతబొమ్మాళి), న్యూస్‌టుడే: సాంకేతిక తరగతిలో విద్యార్థులకు బోధిస్తే మంచి ఫలితాలొస్తాయని ఎంఈవో చిన్నవాడు అన్నారు. ఆకాశలఖవరం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన డిజిటల్ తరగతి గదిని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన దస్త్రాలతోపాటు విద్యార్థుల ప్రతిభా పాటవాలు తనిఖీ చేశారు.

## సావిత్రిబాయి పూలే జయంతి

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త, రచయిత్రి సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ కాలమానిని, దైనందిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు కామేశ్వర రావు, మండల అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు సంజీవరావు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

# నందిగాం మండల రూప్రురేఖలు మారుస్తా

## రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

నర్సిపురం (నందిగాం), న్యూస్‌టుడే: నందిగాం మండల రూపురేఖలను మారుస్తానని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నందిగాం మండలం నర్సిపురంలో గురువారం సర్పంచి ప్రగడ ఇంద్రావేణి అధ్యక్షతన నిర్వహించిన జన్మభూమి- మా ఊరు కార్యక్రమం గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నాటికి ఆఫ్‌షోర్ జలాశయ నిర్మాణం పూర్తిచేసి మండలంలోని సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. సుభద్రాపురం ఎత్తిపోతల పథకం ద్వారా మెట్ట భూములకు సాగునీరందిస్తున్నామని, అదేవిధంగా మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకం పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ నాటికి మెట్ట ప్రాంతానికి సాగునీరందిస్తామన్నారు. వచ్చే ఫిబ్రవరి నుంచి రూ.40కే కిలో కందిపప్పు చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. ఉగాది నుంచి చంద్రన్న పెళ్లి కానుక అమలు చేయడంతోపాటు అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. గత పదేళ్లుగా చేయని అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పుడు చేస్తుంటే కొందరు పనిగట్టుకొని విమర్శలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. మూడు నెలల్లో వంశధార ప్రాజెక్టు పూర్తి చేసి 24 గంటల పాటు సాగునీరందిస్తామన్నారు. ఆయిల్ ఇంజిన్లు వాడుతున్న రైతులకు కిరోసిన్ సరఫరా చేస్తామన్నారు. వంశధార, నాగావళి నదులు అనుసంధానం చేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు పినకాన అజయ కుమార్, వంశధార ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మళ్ల బాలకృష్ణ, లఖిదాసుపురం, దేవళభద్ర, సుభద్రాపురం, దేవుపురం, సర్పంచులు మాదిన లోకనాథం, సర్లాన సుజాత, కుజ్జ తాతయ్య, శిష్టు గున్నయ్య, సైలాడ ఎంపీటీసీ సభ్యుడు సబ్బి జానకిరాం, పలువురు నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మొండ్రాయివలసలో సర్పంచి పల్ల లక్ష్మీదేవి అధ్యక్షతన, నరేంద్రపురంలో సర్పంచి జీరు మోహనరావు అధ్యక్షతన ఎంపీడీవో రాంబాబు జన్మభూమి-మా ఊరు గ్రామసభలు నిర్వహించారు. దేవళభద్రలో సర్పంచి సర్లాన సుజాత అధ్యక్షతన తహసీల్దారు నాగేశ్వరరావు జన్మభూమి- మా ఊరు గ్రామసభను నిర్వహించారు.

### జన్మభూమి-మాఊరుతో ప్రజాసమస్యల పరిష్కారం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన గొప్ప కార్యక్రమం జన్మభూమి- మా ఊరు అని ఎంపీపీ మట్ట సుందరమ్మ పేర్కొన్నారు. టెక్కలి మండలం శాసనాం, బూరగాం పంచాయతీల్లో గురువారం నిర్వహించిన గ్రామసభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బూరగాంలో విద్యుత్తు సమస్యలపై గ్రామస్థులు అధికారులను నిలదీశారు. ఏడాదిగా లైన్‌మేన్ లేకపోవడంతో పలుమార్లు అంధకారంలోనే రాత్రంతా గడపాల్సి వస్తోందని వాపోయారు. కొత్తవీధిలో రహదారులు, ఇతర మౌలిక వసతుల్లేవని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రామేశ్వరంలో 40 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉండడంతో చందాలు వేసుకుని వలంటీరును నియమించుకున్నామని, తక్షణమే ఉపాధ్యాయ పోస్టును మంజూరు చేయాలని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గతేడాది ఖరీఫ్‌లో పంట నష్టపరిహారం నమోదులో ఒక్కో రైతు నుంచి రూ.100 చొప్పున వసూలు చేశారని పలువురు ఆరోపించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీసభ్యురాలు కర్నిక సుప్రియ, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడు చాపర గణపతి రావు, ఎంపీడీవో హరిహరరావు, సర్పంచులు బందాపు అప్పన్న, జనపాన సుందరి, ఎంపీటీసీ సభ్యురాలు లోపింటి పుష్ప, తెదేపా మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు. గూడెంలో తహసీల్దార్ అప్పలరాజు అధ్యక్షతన జరిగిన జన్మభూమి-మాఊరు గ్రామసభలో సర్పంచి సాలాసి తేజ, తెదేపా నాయకులు గండేటి భీమారావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు. రహదారుల నిర్మాణం, కాలువల పునరుద్ధరణ, శ్మశానవాటికకు రక్షణ గోడ నిర్మాణాలపై గ్రామస్థులు వినతులందించారు.



మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎల్.ఎల్.నాయుడు

### ఐక్యతతోనే అభివృద్ధి

ఆకాశలఖవరం (సంతబొమ్మాళి), న్యూస్‌టుడే: ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎల్.ఎల్.నాయుడు పేర్కొన్నారు. హనుమంతు నాయుడు పేట, ఆకాశలఖవరం గ్రామాల్లో గురువారం సర్పంచి మహేష్, ఎంపీ టీసీసభ్యురాలు పుణ్యవతి ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మభూమి-మాఊరు గ్రామ సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బయోమెట్రిక్ యంత్రం ద్వారా సంక్షేమ పథకాలు పంపిణీ చేయడంతో లబ్ధిదారుల చేతివేళ్లు పడకపోవడంతో పథకాలకు దూరమవుతున్నారని ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకొచ్చారు. వీటితో పాటు పలువురు సమస్యలు వివరించారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి కృష్ణవేణి, జడ్పీటీసీసభ్యురాలు లమ్మత లక్ష్మి, ఎంఈవో చిన్నవాడు, వెలుగు ఏపీఎం గోవిందరావు, అధికారులు, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ

సంతబొమ్మాళి గ్రామీణం, న్యూస్‌టుడే: నర్సిపురం, తోటాడ గ్రామపంచాయతీల్లో గురువారం సర్పంచులు భైరాగి, దమయంతి ఆధ్వర్యంలో జన్మభూమి- మాఊరు గ్రామసభలు నిర్వహించారు. దివ్యాంగుడు ఇచ్ఛాపురం సతీష్ పింఛను ఇవ్వాలని కోరారు. తోటాడలో పలువురు లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. గ్రామసభల్లో ఎంపీడీవో ప్రభావతి, ఎంపీటీసీసభ్యుడు రామ చంద్రరావు, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



బూరగాంలో జన్మభూమి-మాఊరు గ్రామసభలో పాల్గొన్న ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు, ఇతర ప్రజాప్రతినిధులు

### ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హుల గుర్తింపు

తాటిపర్తి, నీలంపేట (కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తిస్తుండడం ప్రశంసనీయమని కోటబొమ్మాళి ఏఎంసీ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మి అన్నారు. తాటిపర్తి, నీలంపేటల్లో గురువారం జరిగిన జన్మభూమి- మాఊరు కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో రేణుక, ఎంఈవో నారాయణరావు, తెదేపా నాయకులు మెండ భాస్కరరావు, ఉపసర్పంచి (నీలంపేట)శశిభూషణరావు, రొక్కం మోహన రావు తదితరులు పాల్గొన్నారు. జర్జంగి, దుప్పలపాడు గ్రామపంచాయతీల్లో గురువారం తహసీల్దారు వాన శివబ్రహ్మానంద్ నేతృత్వంలో జన్మభూమి- మా ఊరు కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో తెదేపా నాయకులు దుద్దు దానయ్య, గురివిల్లి రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.



తాటిపర్తిలో లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి సరకులు అందిస్తున్న కోటబొమ్మాళి ఏఎంసీ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రభావతి



యోగా తరగతులకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

## జాతీయ యోగా తరగతులకు విద్యార్థులు

టెక్కలి, న్యూస్‌టుడే: గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌లో ఈ నెల 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి యోగా తరగతులకు లింగాల వలస ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయిని అనూ రాధ తెలిపారు. పాఠశాల నుంచి తరుణ్, లిఖిత, కరుణ ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపికపై గురువారం ఉపాధ్యాయులు సింహాచలం, బంగారమ్మ, శైలజా సుభాషిణి, సూర్యప్రకాష్, భాస్కరరావు, శివకుమార్, నారాయణరావు హర్షం వ్యక్తం చేశారు.

## గ్రామాల్లో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీలు

నందిగాం, న్యూస్‌టుడే: స్వచ్ఛతపై మండలంలోని పలు గ్రామాల్లో గురు వారం విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. ప్రతి కుటుంబం మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, రహదారులపై చెత్త వేయరాదని నినాదాలు చేశారు. నర్సిపురంలో టెక్కలి ఐతమ్ పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఇంటింటికి వెళ్లి మరుగుదొడ్ల ఆవశ్యకతను సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, ఉదయబాబు, మురళీధర్, శ్రీహరి, ప్రశాంతి పాల్గొన్నారు. దేవుపురంలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేశారు. ర్యాలీలో ప్రధానోపాధ్యాయుడు పోలాకి వాసుదేవు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందిగాం, న్యూస్‌టుడే: స్థానిక గురుకుల పాఠశాల/కళాశాల విద్యార్థినులు ఏడు రోజులపాటు నిర్వహించే సేవా శిబిరం గురువారం కూడా కొనసాగింది. ఈ నేపథ్యంలో నందిగాంలో ర్యాలీ నిర్వహించి మరుగుదొడ్లపై పూర్తి అవగాహన కల్పించారు. ఎస్సీ వీధిలో చెత్తను ఊడ్చి శుభ్రపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి. లక్ష్మమ్మ, ఎన్ఎస్ఎస్ పీవో జి. విజయలక్ష్మీ, వైస్ ప్రిన్సిపల్ కూర్మారావు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.



నందిగాంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు



నర్సిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న టెక్కలి ఐతమ్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు



దేవుపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు

## బాబా సన్నిధిలో విశేష పూజలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: కె.కొత్తూరులోని షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజాకార్యక్రమాలు జరిగాయి. పెద్దసాన గ్రామానికి చెందిన బీఎస్‌జేఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు కోత చిన్నబాబు కుమారులు అన్నదాన ప్రసాదవితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చుట్టుపక్కలనుంచి పెద్దఎత్తున భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు వాకాడ బారికరెడ్డి, రత్నాలమ్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# టెక్కలి

## 14 మంది భాజపా శక్తి కేంద్రాస్ ఇన్‌ఛార్జుల నియామకం

**సంతబొమ్మాళి, న్యూస్‌టుడే:** మండలంలో గురువారం భాజపా టెక్కలి నియోజక వర్గ సమన్వయకర్త హనుమంతు ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో పార్టీ నూతన శక్తి కేంద్రాస్ ఇన్‌ఛార్జుల నియామకం చేపట్టారు. సంతబొమ్మాళి మండలంలో 68 పోలింగ్ కేంద్రాలకు 14 మంది శక్తి కేంద్రాస్ ఇన్‌ఛార్జులను నియమించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారావు, నాయకులు చంద్రశేఖర్, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు చేయూత

**టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే:** పేద విద్యార్థులు చదువుకు దూరం కాకుండా వారికి ఆర్థిక సాయం చేస్తున్నట్లు బర్డ్‌సంస్థ సమన్వయాధికారి బి.సురేష్ అన్నారు. టెక్కలి పట్టణంలోని గొడగలవీధి, చేరివీధి, చిన్నబజారు ప్రాంతాల్లో మూడు పేద కుటుంబాలకు గురువారం చెరో రూ.6 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పి.ఉమామహేశ్వరరావు, బి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెరపై సినిమాలు

టెక్కలిలో.. సుదర్శన్ : **2 కంట్రీస్,** భవానీ: **ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయి)** కోటబొమ్మాళి: శివ కృష్ణ: **సారధి**



## ప్రత్యేక హోదాతోనే భవిత

**టెక్కలి, న్యూస్‌టుడే:** రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోనే విద్యార్థుల భవిత ఆధారపడి ఉందని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. స్థానిక మదర్‌థెరిసా జూనియర్ కళాశాలలో గురువారం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రత్యేక హోదా రాకపోతే విద్య, ఉపాధి, ఉద్యోగావకాశాలను కోల్పోతామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తున్న వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డికి మద్దతుగా విద్యార్థులు, యువత నిలవాలని కోరారు. ఆయనవెంట నాయకులు సత్తారు సత్యం, తిర్లంగి జానకి రామయ్య, యర్రా చక్రవర్తి, పుష్యా సత్యం తదితరులున్నారు.

## ఘనంగా న్యూటన్ జయంతి

**నందిగాం, న్యూస్‌టుడే:** ఐజక్ న్యూటన్ గొప్ప శాస్త్రవేత్త అని స్థానిక బాలికల గురుకుల పాఠశాల/ కళాశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయిని కాత్యాయినీ దేవి పేర్కొన్నారు. పాఠశాల /కళాశాలలో గురువారం న్యూటన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. న్యూటన్ జీవిత చరిత్రను విద్యార్థినులకు వివరించారు. జయంతి కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.లక్ష్మమ్మ, వైస్ ప్రిన్సిపల్ కూర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాదుస్తుల పంపిణీ

**కొత్తపేట (కోటబొమ్మాళి), న్యూస్‌టుడే:** కొత్తపేటకు చెందిన కబడ్డీ క్రీడాకారులకు గురువారం కింజరాపు యువసేన క్రీడా దుస్తులను పంపిణీ చేసింది. సర్పంచి జీరు నారాయణరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో తెదేపా ప్రచార కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్న బీమా సాయం పంపిణీ


**జియ్యన్నపేట (కోటబొమ్మాళి), న్యూస్‌టుడే:** జియ్యన్నపేట, కురుడు గ్రామపంచాయతీల్లో పలువురికి చంద్రన్న బీమా సాయం అందించినట్లు బీమామిత్ర సుబ్బలక్ష్మి తెలిపారు. కురుడు పంచాయతీలో ఎర్ర అప్పారావు మృతిచెందడంతో ఆయన కుటుంబసభ్యులకు రూ.5వేలు, జియ్యన్నపేటలో ఎడ్ల అమ్మన్నాయుడు మృతిచెందడంతో ఆయన కుటుంబసభ్యులకు రూ.2 లక్షల సాయం అందించామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు శ్రీనివాసరావు, రామ దాసు తదితరులు పాల్గొన్నారు.

**సీతానగరం (సంతబొమ్మాళి), న్యూస్‌టుడే:** సీతానగరం గ్రామానికి చెందిన బత్సల దానయ్య (59) ఇటీవల రహదారి ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి గురువారం ఎంపీపీ కర్రి కృష్ణవేణి చేతులమీదుగా చంద్రన్న బీమా సాయం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బాబ్జీ, కృష్ణారావు, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు

**ఈదులవలస(పోలాకి), న్యూస్‌టుడే:** జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటోందని ఏడీ లక్ష్మణరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు ఫిబ్రవరి 16వ తేదీలోగా పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు ఆయా పాఠశాలల్లో ప్రధానాచార్యులను సంప్రందించాలని ఆయన కోరారు. జిల్లాలో మొత్తం 14 పాఠశాలలుండగా, ఒక్కో దానిలో 80 సీట్లు ఉన్నాయన్నారు.

## చెంబులకు స్వస్తి పలకాలి



టెక్కలి ఇందిరా కూడలిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

**కొత్తపల్లి (కోటబొమ్మాళి), న్యూస్‌టుడే:** బహిరంగ మల విసర్జనకు వినియోగించే చెంబులకు స్వస్తి పలకాలని కోరుతూ కోటబొమ్మాళి మండలం కొత్తపల్లిలో గురువారం సర్పంచి శిమ్మ వరలక్ష్మి నేతృత్వంలో చెంబులతో నిర్వహించిన ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. గ్రామాల్లో పరిశుభ్రతకు, చక్కటి ఆరోగ్యానికి మరుగు దొడ్లు మంచి ఫలితాలనిస్తాయని తెదేపా నాయకుడు సింహాచలం పేర్కొన్నారు. ర్యాలీలో స్థానిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య,ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అదే విధంగా నీలంపేటలోనూచెంబుకు స్వస్తి పలకాలని కోరుతూ ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో కోట బొమ్మాళి ఏఎంసీ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మి, ఎంఈవో నారాయణరావు, ఉపసర్పంచి శశిభూషణరావు,తదితరులు పాల్గొన్నారు.

**కోటబొమ్మాళి, న్యూస్‌టుడే:** జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం మానవహారం నిర్వహించారు. ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్మాణాల ఆవశ్యకతను తెలియజేస్తూ వారంతా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రకాశరావు, అధ్యాపకులు రాజశేఖర్, అప్పన్న, సూర్యనారాయణ, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్‌కళాశాల విద్యార్థుల మానవహారం

**టెక్కలి, న్యూస్‌టుడే:** జన్మభూమి రుణం తీర్చుకోవడానికి అంతా ముందుకు రావాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రకాశరావు అన్నారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా టెక్కలిలో గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ఓడీఎఫ్ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మరుగుదొడ్లు ప్రతిఒక్కరూ వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు నారాయణరావు, జనార్దన్, గోవిందరావు, అజయ్‌కుమార్, రవికుమార్, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

**నౌపడ (సంతబొమ్మాళి), న్యూస్‌టుడే:** 'జన్మభూమి-మా ఊరు', 'స్వచ్ఛాంధ్ర మిషన్' కార్యక్రమాల్లో భాగంగా నౌపడలో గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మరుగుదొడ్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రిన్సిపల్ శ్యామసుందరావు, నౌపడ, పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



నౌపడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

## 40 లక్షల మందికి పార్టీ సభ్యత్వం



మాట్లాడుతున్న పైడి వేణుగోపాల్

**కాశీబుగ్గ, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్‌లో 6 లక్షలు ఉండే తమ పార్టీ సభ్యత్వం 40లక్షలకు చేరిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పైడి వేణుగోపాల్ పేర్కొన్నారు. కాశీబుగ్గలోని మాజీ ఎంపీ డా.కె.విశ్వనాథం నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో తమ పార్టీకి సంబంధించి 60శాతం పోలింగ్‌బూత్ కమిటీల నియామకం జరిగిందన్నారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనపై ప్రజలకు నమ్మకం కలిగిందన్నారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలు వంటి చారిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకున్న తర్వాత జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికల్లో భాజపా ఘనవిజయం సాధించిందన్నారు. రాష్ట్ర కిషాన్ మోర్చా అధ్యక్షుడు పి.తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సమస్యలపై మాట్లాడుతున్న తమ పార్టీ నాయకులపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని మిత్రపక్ష నాయకులు పలుమార్లు ప్రస్తావిస్తుండటం తగదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో భాజపా బలమైన శక్తిగా రూపాంతరం చెందుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపి డా.కె.విశ్వనాథం, పార్టీ నాయకులు పి.వైకుంఠరావు, టి.మాధవరావు, మన్మధరావు, నాగేశ్వరరావు, చిరంజీవి, మీల జోగారావు, వై.రాజు బుజ్జి, కె.బాస్కరరావు, విఘ్నేశం తదితరులు పాల్గొన్నారు.

**నేడు మహాసమ్మేళనం:** కాశీబుగ్గలో శుక్రవారం పలాస నియోజకవర్గస్థాయి పోలింగ్‌బూత్ కమిటీ భాజపా ప్రతినిధుల మహాసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ డా.కె.విశ్వనాథం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మాజీమంత్రి డి.పురుందరేశ్వరి, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, మాధవ్ తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

## కొత్తపేట స్టేట్‌బ్యాంకుశాఖను విలీనం చేస్తారా?

**కొత్తపేట (కోటబొమ్మాళి), న్యూస్‌టుడే:** సుమారు రూ.12 కోట్ల వ్యాపార లావాదేవీలు కలిగిన కొత్తపేట స్టేటుబ్యాంకు శాఖను కోటబొమ్మాళి స్టేటు బ్యాంకులో విలీనం చేయడం ఎంతమాత్రం తగదని, ఎలా చేస్తారని పలువురు వ్యాపారులు మేనేజర్ కె.నాగరాజును గత రెండురోజులుగా ప్రశ్నిస్తూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. తక్షణమే కొత్తపేటకు చెందిన స్టేటుబ్యాంకు శాఖను కొత్తపేట తరలించాలని వారంతా కోరుతున్నారు. దీనిపై మేనేజర్ మాట్లాడుతూ గత రెండురోజులుగా వినియోగదారులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, తానేం చేయలేనని తెలిపారు. ఇప్పటికే స్టేట్‌బ్యాంకులో పెద్దఎత్తున రద్దీ నేపథ్యంలో ఇక్కడ స్టేటు బ్యాంకు సేవలు పొందుతున్నామని, విలీనం చేస్తే సమస్యలు రెట్టింపవుతాయని అంతా పేర్కొంటున్నారు.



కొత్తపేట స్టేట్‌బ్యాంకు మేనేజర్ నాగరాజును ప్రశ్నిస్తున్న వ్యాపారులు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ రిజిస్ట్రార్ శ్రీహరిరావు

## పక్కాగా ధాన్యం కొనుగోళ్లు

**టెక్కలి, న్యూస్‌టుడే:** ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పక్కాగా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు సహకార శాఖ జిల్లా జాయింట్ రిజిస్ట్రార్ శ్రీహరిరావు తెలిపారు. గురువారం స్థానిక పీఏసీఎస్ కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా టెక్కలి కేంద్రంలో ఇప్పటివరకు 362 రైతుల నుంచి 40,352 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, రూ. 6,25,45,600 చెల్లింపులు చేశామని సీఈవో పి.సత్యారావు వివరించారు. ఆయనవెంట డీసీసీబీ డైరెక్టర్ డి.కృష్ణారావు తదితరులున్నారు.

## గ్యాస్ సమాచారం

**టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే:** టెక్కలి ప్రభానంద గ్యాస్‌లింక్స్‌లో డిసెంబరు 25వ తేదీన పేరు నమోదు చేసుకున్నవారికి శుక్రవారం గ్యాస్‌సిలిండర్లు సరఫరా చేస్తారు. బుకింగ్ సమయం: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు. గ్యాస్ గోదాం వద్ద డెలివరీ ఇవ్వరు. సంప్రదించాల్సిన ఫోను నంబర్లు- 08945-244543, 244322, ఆన్‌లైన్ బుకింగ్ నంబరు- 9848824365.